భారత

కమ్యూనిస్టు పార్టీ

(మార్క్సిస్టు)

# 22వ మహాసభ
# రాజకీయ తీర్మానం

(ఏప్రిల్ 18–22, 2018, హైదరాబాద్ మహాసభలో ఆమోదించినది)

ప్రచురణ : భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆంధ్రప్రదేశ్ కమిటీ

# 22వ మహాసభ ఆమోదించిన రాజకీయ తీర్మానం

మన పార్టీ 21వ మహాసభ నాటి నుండి గడచిన కాలంలో భారతదేశంలో మితవాద రాజకీయాలు మరింతగా సంఘటితమవడం కనపడుతున్నది. బిజెపీ నేతృత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం మన దేశంపైనా, ప్రజలపైనా దుర్మార్గమైన చతుర్ముఖ దాడి సాగిస్తున్నది; నయా ఉదారవాద ఆర్థిక విధానాలను ఉధృతంగా అనుసరించటం ద్వారా, వివిధ రూపాలలో మత విభజనను తీవ్రతరం చేయడం ద్వారా, పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికీ, వ్యవస్థలకూ వ్యతిరేకంగా నిరంకుశ దాడులను పెంచటం ద్వారా, అమెరికాకూ, సామ్రాజ్యవాదానికీ జూనియర్ వ్యూహాత్మక భాగస్వామిగా భారతదేశాన్ని బిగించివేయడం ద్వారా యీ దాడి చేస్తున్నది. భారత పాలక వర్గాలు అమెరికన్ సామ్రాజ్యవాదుల ఆదేశాలకు లొంగి మన దేశ ప్రయోజనాలను, ప్రజల ప్రయోజనాలను బలిచేస్తున్నాయి. భారతదేశ పరిస్థితులపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపగల ముఖ్యమైన అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో దీనిని మనం అంచనా వేయాలి.

# అంతర్జాతీయ పరిస్థితి

**1.1** 21వ మహాసభ అనంతరకాలంలో అంతర్జాతీయ పరిస్థితిలోని ప్రధాన లక్షణాలు యీ దిగువ విధంగా వున్నాయి:

**(i)** కొంతమేరకైనా ప్రపంచ ఆర్థిక పరిస్థితి కోలుకోగలదన్న ముందస్తు అంచనాలు వున్నప్పటికీ, 2008లో ఆర్థిక సంస్థలు కుప్పకూలడం ద్వారా వ్యక్తమైన ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభం కొనసాగుతున్నది.

**(ii)** పెట్టుబడిదారీ దేశాలన్నిటా 'పొదుపు చర్యలు' చేపడ్డం అశేషజనం మరింతగా ఆర్థిక దోపిడీకి గురవడానికి దారితీసింది. అధిక సంఖ్యాక ప్రజలపై ఆర్థిక దోపిడీని మరింత తీవ్రతరం చేయడానికి, వారి ప్రజాతంత్ర హక్కులపై దాడిని ఉధృతం చేయడానికి యిది దారితీస్తున్నది. ఈ దాడులకు వ్యతిరేకంగా ప్రపంచంలోని వివిధ దేశాలలో జరుగుతున్న నిరసన చర్యలు, పోరాటాలు పెరుగుతున్నాయి.

**(iii)** ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థలో కొనసాగుతున్న ఈ ఆర్థిక సంక్షోభం అటు అంతర్జాతీయంగానూ, యిటు ఆయా దేశాలలోనూ ఆర్థిక అసమానతలు మరింతగా పెరగటానికి దారితీస్తున్నది.

**(iv)** తన ప్రపంచాధిపత్యాన్ని పటిష్టపరుచుకునేందుకు, ఆర్థిక సంక్షోభపు ప్రతికూల ప్రభావాలను అధిగమించేందుకు చేస్తున్న ప్రయత్నంలో అమెరికన్ సామ్రాజ్యవాదం అన్ని రకాలుగా మరింత దూకుడును ప్రదర్శిస్తున్నది. ప్రత్యేకించి ఇది రాజకీయ, ఆర్థిక, సైనిక జోక్యాల ద్వారా వ్యక్తం అవుతోంది.

**(v)** అమెరికా రాజకీయ, సైనిక జోక్యాలపై లాటిన్ అమెరికాలోని పలుదేశాలలో తీవ్రమైన ఘర్షణ సాగుతున్నది. ఈ ఖండంలోని వామపక్ష ప్రభుత్వాలను అస్థిరపరచటానికీ, ప్రజలలో సర్వత్రా పెరుగుతున్న సామ్రాజ్యవాద వ్యతిరేక వెల్లువను వెనక్కు కొట్టటానికీ అమెరికా సర్వశక్తులనూ వినియోగిస్తున్నది.

**(vi)** ఐరోపాలో తీవ్ర మితవాద నయా ఫాసిస్టు శక్తులు తలెత్తడంతో పలు దేశాలలో మితవాద రాజకీయం వైపు మరింత మొగ్గు చూపటం యీ కాలంలో కనపడుతున్నది. అమెరికన్ పాలక వర్గాలలోని అత్యంత

తిరోగామి శక్తులకు ప్రతినిధి డోనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్ష పదవిని అధిష్టించడంతో యీ ధోరణి మరింత బలపడింది.

**(vii)** సుదీర్ఘకాలం నయా ఉదారవాద సంక్షోభం ఒత్తిడి ప్రభావం కొనసాగుతుండడం వలన, 21వ మహాసభలో మనం గుర్తించిన సామ్రాజ్యవాద శిబిరంలో ఐక్యత పెరగడం, వీరి మధ్య వైరుధ్యాలు మొద్దుబారడం బలహీనపడి సామ్రాజ్యవాద కేంద్రాల మధ్య నూతన ఘర్షణ కేంద్రాలు, వైరుధ్యాలు తలెత్తుతున్నాయి.

**(viii)** మనదేశంతో సహా మరికొన్ని ఇతర దేశాలు, అమెరికా వైపు మొగ్గుచూపడంతో బహుళ ధృవ అంతర్జాతీయ ఆర్థిక రాజకీయ క్రమం నెలకొల్పాలన్న ధోరణి కొత్త చిక్కులు ఎదుర్కొంటున్నది.

**(ix)** అమెరికా ఏకపక్షంగా అంతర్జాతీయ ఒప్పందాల నుండి వైదొలగడం, బహుళపక్ష ఒప్పందాలకు బదులు విడివిడిదేశాలతో ద్వైపాక్షిక ఒప్పందాలకు మొగ్గుచూపడం వలన పర్యావరణ మార్పులపై ప్రపంచవాణిజ్య సంస్థ వంటి అంతర్జాతీయ ఒప్పందాల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది.

**(x)** పొరుగుదేశాలతో మనదేశ సుహృద్భావ సంబంధాలపైనా ప్రత్యక్ష ప్రభావం కలిగించే ముఖ్యమైన పరిణామాలు మన చుట్టూ ఉన్న అన్ని దేశాలలో చోటుచేసుకున్నాయి.

**(xi)** **సోషలిస్టు దేశాలు :** ఈ కాలంలో చైనా బలమూ, ప్రపంచంపై దాని ప్రభావమూ పెరిగాయి. వియత్నాం, క్యూబా తమ తమ ఆర్థిక వ్యవస్థలలో గణనీయమైన నిలకడైన పెరుగుదలను సాధించాయి. ఉత్తర కొరియాకు (డి.పి.ఆర్.కె) సంబంధించి దాని అణుకార్యక్రమమూ, క్షిపణుల మోహరింపు ప్రధానాంశాలుగా ఉన్నాయి.

**(xii)** కమ్యూనిస్టుపార్టీలు, వర్కర్స్ పార్టీలు ఏటా నిర్వహించే అంతర్జాతీయ సమావేశాలతోబాటు అక్టోబరు విప్లవ శతవార్షికోత్సవాలు జరపడం ద్వారా అంతర్జాతీయ కమ్యూనిస్టు సంఘీభావం స్పష్టంగా వ్యక్తం అవుతున్నది.

## ప్రపంచ పెట్టుబడిదారీ సంక్షోభం

**1.2** 2008లో ఆర్థిక సంస్థలు కుప్పకూలడంతో ప్రపంచపెట్టుబడిదారీ సంక్షోభం ముందుకు తోసుకువచ్చింది. అప్పటినుండి పెట్టుబడిదారీ వ్యవస్థ ఒక సంక్షోభం వెంట మరో సంక్షోభంలో కూరుకుపోతూనే వుంది. 20వ శతాబ్దపు చివరి దశాబ్దంలో సాధించిన వృద్ధిరేటు స్థాయికి ప్రపంచ పెట్టుబడిదారీ విధానం తిరిగి పుంజుకోలేకపోతున్నది. అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడి నేతృత్వంలో కొనసాగుతున్న సామ్రాజ్యవాద ప్రపంచీకరణ పెట్టుబడి సంచయన క్రమాన్ని తీవ్రతరం చేస్తూనేవున్నది. మన 20వ మహాసభలో ఆమోదించిన సైద్ధాంతిక తీర్మానంలో పేర్కొన్నట్టుగా "నిర్బంధంగా ప్రజల సంపదను స్వాధీనం చేసుకోవడం ద్వారా ఈ పెట్టుబడి సంచయనం" కొనసాగుతోంది. ఈ క్రమం పెట్టుబడిదారీ దోపిడీని మరింత తీవ్రం చేస్తుంది. తత్ఫలితంగా మున్నెన్నడూ ఎరుగని స్థాయిలో ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయి. తత్కారణంగా ప్రపంచ జనాభాలో అత్యధికులు పేదరికంలో మగ్గుతున్నారు. ఇది నయా ఉదారవాదమే స్వయంగా సంక్షోభంలో చిక్కుకోవటానికి దారితీస్తున్నది.

**1.3** 2017 అక్టోబరులో ఐ.ఎం.ఎఫ్, – ప్రపంచ ఆర్థిక దృక్పథం విడుదల చేసిన నివేదిక ప్రపంచ జిడిపి పెరుగుదల ఆశావహంగా ఉండబోతున్నట్టు చూపించింది. 2016లో 3.2 శాతంగా వున్న పెరుగుదల 2017 నాటికి 3.6 శాతానికి పెరుగుతుందని, 2018 నాటికి 3.7 శాతానికి చేరుకుంటుందని, 2020–21 నాటికి 3.8 శాతంగా వుండగలదని చెప్పటం జరిగింది. కాని యిది ప్రపంచ ద్రవ్య సంక్షోభ దశకానికి ముందున్న 4 శాతం సగటు పెరుగుదలకన్నా తక్కువగా వున్నది. ఆశావహ పరిస్థితి రానున్నదని చెప్తున్నప్పటికీ ఈ మధ్యంతర కాలంలో ఎదురయ్యే చిక్కుల ఫలితంగా అభివృద్ధిరేటు పడిపోయే ప్రమాదం కూడా లేకపోలేదని ఐ.ఎం.ఎఫ్. తన 2017 నాటి హెచ్చరికను పునరుద్ఘాటించింది.

**1.4** **ప్రపంచ వ్యాప్తంగా నిరుద్యోగం :** జిడిపి వృద్ధి రేటులో కొద్దిపాటిగానైనా మెరుగుదల వుంటే దానిని అనుసరించి ఉపాధి రేటు పెరుగుతుందని

సాధారణంగా భావిస్తారు. అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలలో నిరుద్యోగ రేటు 2010లో 8.3 శాతం నుండి 2017లో 5.7 శాతానికి తగ్గినట్లు ఐ.ఎం.ఎఫ్ అంచనా వేసింది. తగ్గుతున్న నిరుద్యోగం రేటు కార్మికుల జీనవ పరిస్థితులు మెరుగు పరుస్తాయనుకోవలసిన అవసరం లేదు. 2016లో జీతాలు మరియు ఆదాయాలు 1.8 శాతం పెరగగా 2017 లో 2. 3శాతం పెరుగుతాయని అంచనా వేయడం జరిగింది. అయినా ఇది 1999–2008 దశకం మధ్య అంటే సంక్షోభానికి ముందున్న 3.4 సగటు వేతనాలు, ఆదాయాల పెరుగుదల కన్నా తక్కువే. నిరుద్యోగితలో ఈ తరుగుదల, యీ పరిమిత వృద్ధి కూడా అస్థిరమైనదే, ఎందుకంటే, యీ వృద్ధి కారణంగా కలిగిన వుద్యోగాలు సంఖ్య రీత్యా పరిమితమైనవే కాక, వాటి స్వభావరీత్యా చాలా తక్కువ స్థాయి కలిగి వున్నాయి. "వేతన కాఠిన్యాలను" (wage rigidities) తగ్గించేందుకు "కార్మిక మార్కెట్‌లో సర్దుబాటు" (labour market flexibility) చేసుకోవాలనే పేరుతో అంతకంతకూ మరింత ఎక్కువగా పార్ట్‌టైమ్, కాజువల్, స్వయం ఉపాధి వంటి తక్కువ వేతనాలు చెల్లించే ఉద్యోగాలలో నియామకాలు చేపడుతున్నారు. సరళంగా చెప్పాలంటే అభివృద్ధి ఈమాత్రంగానైనా పుంజుకోవడానికి కారణం తమలాభాలను గరిష్టస్థాయిలో నిలుపుకునేందుకు కార్మికులను మరింతగా పీల్చి పిప్పిచేసి, అర్థిక దోపిడీని తీవ్రతరం చేయడం. ఇదే పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క అతి ముఖ్యమైన స్వభావం.

**1.5** ఇలాంటి నామ మాత్రపు పెరుగుదల, దానితో పాటు స్థూల జాతీయ ఉత్పత్తిలో నిజ వేతనాల భాగం తగ్గకపోయినా స్థబ్దతలో ఉండడం వలన పెద్ద ఎత్తున వస్తు ఉత్పత్తి పెరగడానికి అవసరమయిన దేశీయ గిరాకీ ఆర్థిక వ్యవస్థలో పెరగడం లేదు.

**1.6** కృత్రిమ మేధ అభివృద్ధి, రోబోటిక్స్ ఆటోమేషన్ సంభావ్యతను కేవలం మళ్ళీ మళ్ళీ చేయాల్సిన పనులకో ఫ్యాక్టరీ లో చేసే పనులకు పరిమితం చేయవు. రాబోయే కృత్రిమ మేధో పరికరాలు ఉద్యోగిత మరియు ఉద్యోగాల పరిధిని మార్చివేయవచ్చు – టాక్సీలు, ట్రక్‌లు నడిపే డ్రైవర్ల

పని దగ్గరినుండి 'మేధస్సు ' నుపయోగించి చేయాల్సిన పనుల పై ప్రభావం చూపవచ్చు. కార్మిక వర్గ ఉద్యమాలు ఈ కొత్త సాంకేతికత విసిరే సవాళ్ళను స్వీకరించి తగిన నినాదాలను ఇవ్వగలగాలి, లక్ష్యాలను నిర్దేశించగలగాలి, కార్మికులను సంఘటితం చేయగలపని పద్ధతును చేపట్టతలగాలి.

**1.7** అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి నాయకత్వంలోని నయా ఉదారవాద విధానాల కారణంగా బ్యాంకులు, ద్రవ్య సంస్థలు భారీ మొత్తాలను పోగు చేశాయి. కాని దేశీయ డిమాండులో పెరుగుదల లేని కారణంగా ఈ పెట్టుబడుల మొత్తాలను మార్కెట్‌లోకి విడుదల చేయలేకపోయాయి. ఫైనాన్షియల్ టైమ్స్ పత్రిక చెప్పిన దాని ప్రకారం ప్రపంచంలోని అతి పెద్ద కేంద్ర బ్యాంకులు – అమెరికా సంయుక్త రాష్ట్రాల రిజర్వుబ్యాంకు, యూరోపియన్ సెంట్రల్ బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ జపాన్, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్, ఇంకా స్విట్జర్లాండ్, స్వీడన్ దేశాల బ్యాంకులు ప్రస్తుతం 995 లక్షల కోట్లరూపాయలు పైగా మొత్తాలను కలిగి వున్నాయి, ఇది 2008 ద్రవ్య సంక్షోభం ముందు కాలంతో పోలిస్తే నాలుగు రెట్లుకన్నా ఎక్కువ. దీనివల్ల ఆస్తుల ధరల పెరుగుదల వేగం ఎక్కువగా వున్నప్పటికీ అదే సమయంలో సాధారణ ద్రవ్యోల్బణం తక్కువగా వున్నది. ఇది మరోసారి 'బుడగ' పేలిపోయే పరిస్థితికి దారితీస్తుంది, అంటే మరో ద్రవ్య సంక్షోభానికి అవకాశం వుందన్న అన్నమాట. మొత్తం మీద చూస్తే అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి నడిపిస్తున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రమాదకరస్థితిలో పడిపోయి, మరో విడత ద్రవ్య సంక్షోభం దిశగా పయనిస్తున్నది.

## పెరుగుతున్న అసమానతలు

**1.8** మన పార్టీ 21వ మహాసభలో పేర్కొన్నట్లుగా నయా ఉదారవాదం సృష్టించిన ఆర్థిక సంక్షోభం అటు ప్రపంచవ్యాప్తంగానూ, ఇటు ఏదేశానికాదేశంలోనూ మరింత ఆందోళనకరమైన రీతిలో అసమానతలను పెంచుతోంది. ధనికులు మరింత ధనికులవుతుండటం, పేదలు మరింతగా పీల్చిపిప్పిచేయబడే ఈ క్రమం అంతకంతకూ తీవ్రంగా కొనసాగుతోంది.

'క్రెడిట్ సుయిస్' 2017 నివేదిక ప్రకారం ప్రపంచ ఆదాయంలో 70.1 శాతం ప్రపంచ జనాభాలోని 2.7 శాతం మంది దగ్గర పోగుపడి వున్నది. మరోవైపున ప్రపంచ జనాభాలోని 85.6 శాతం మంది, ప్రపంచ ఆదాయంలో 8.6 శాతాన్ని మాత్రమే కల్గివున్నారు.

**1.9** ప్రపంచ అసమానతల నివేదిక (ప్రపంచ అసమానతల పరిశోధనా సంస్థ నివేదిక 2018 ప్రకారం) 1980 నుంచి, 1 శాతంగా వున్న ప్రపంచ కుబేరులు జనాభాలోని దిగువస్థాయిలోని 50 శాతం మంది ఆదాయం కన్నా రెండురెట్లు ఎక్కువ పొందుతున్నారు. దిగువస్థాయిలోని 50శాతం ప్రజలకు, పైస్థాయిలోని ఒక్కశాతం కుబేరులకు మధ్యన ఉన్నవారి ఆదాయాల పెరగడమో నామమాత్రంగా అసలు పెరగకుండా ఉండడమోజరుగుతున్నది. లేదా ప్రపంచంలోని వివిధ దేశాలను అధ్యయనం చేసిన యీ నివేదిక ప్రకారం, 1980–2015 మధ్య అమలైన నయా ఉదారవాద సంస్కరణల ఫలితంగా, పైనున్న 10 శాతం యొక్క ఆదాయానికి పై చిలుకు వాటాలు భారతదేశంలో అంతకుముందున్న 30 శాతం నుండి దాదాపు 60 శాతానికి పెరిగింది.

## పెరుగుతున్న ప్రజా నిరసనలు

**1.10** ఈ పరిస్తితులలో ప్రపంచ జనాభాలో అత్యధికులు అంతకంతకు ఎక్కువగా దారిద్ర్య బాధను అనుభవిస్తుండగా. దీనితోపాటే శ్రామిక వర్గంపైనా, కార్మిక సంఘాలపైనా, రైతులపైనా, ప్రజాతంత్ర హక్కులపైనా, పౌర స్వేచ్ఛలపైనా దాడులు కూడా పెరుగుతున్నాయి; సంపన్న పెట్టుబడిదారీ దేశాల నుండి వర్ధమాన దేశాల వరకు ప్రపంచ వ్యాప్తంగా ప్రజా పోరాటాలుకూడా తలయెత్తుతున్నాయి. ఐతే, 21వ మహాసభలో మనం గమనించినట్లుగా యీ పోరాటాలలో అత్యధిక భాగం మౌలికంగా ఆత్మ రక్షణ స్వభావం కలిగివున్నాయి. ఆత్మరక్షణ అంటే ప్రధానంగా ప్రస్తుతమున్న జీవన స్థాయీ, ప్రజాతంత్ర హక్కులూ మరింతగా దాడులకు గురికాకుండా, అలానే హరించుకుపోకుండా కాపాడుకునేందుకు ఉద్దేశించినవే. **అయితే, భవిష్యత్తులో పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా**

**సంఘటితపరచవలసిన పోరాటాలకు పునాదులుగా ఈ నిరసనోద్యమాలు ఉంటాయి.**

## నయా ఉదారవాద సంక్షోభం

**1.11** ప్రపంచ ద్రవ్య సంక్షోభం ప్రారంభమయిన పదేళ్ళు గడచిన తరువాత, ఈనాడు ఎక్కువమంది ప్రజలకు, ప్రత్యేకించి అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలకు చెందిన వారికి నయా ఉదారవాద విధానాల అమలు పెరగడం అంటే ఏమిటో స్పష్టంగా అర్థం అయింది. రెండవ ప్రపంచ యుద్ధానంతరం మొదటి రెండున్నర దశాబ్దాల కాలంలో పెట్టుబడిదారీ వ్యవస్థ బ్రహ్మాండమైన పెరుగుదలను నమోదు చేసింది; తరచుగా దీనిని పెట్టుబడిదారీ సమాజం యొక్క స్వర్ణయుగంగా ప్రస్తావిస్తారు. అమెరికాలో 1948–1972 మధ్య అమెరికన్ జనాభాలోని పై తరగతికి చెందిన వారి జీవనస్థాయి పెరిగింది. అయితే, ఆర్థికాభివృద్ధిలో సింహభాగం గెప్పెడు మంది చేతులలోకి పోయే పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా అంఖ్యాక ప్రజలు దారిద్రంలో మగ్గుతున్నారు. 1972–2013 మధ్య దిగువన వున్న 10 శాతం ప్రజల నిజ ఆదాయాలు పడిపోగా, పైస్థాయిలోని 10 శాతం వారి ఆదాయాలు గణనీయంగా పెరిగాయి. ఈనాడు పూర్తి కాలపు పురుష శ్రామికుని సగటు నిజ ఆదాయం నాలుగు దశాబ్దాల నాటికన్నా తక్కువగా వున్నది. దిగువన వున్న 90 శాతం ప్రజల ఆదాయం గత 30 సంవత్సరాలుగా స్తంభించిపోయింది. 2005–2014 మధ్య, అత్యున్నత ఆదాయాలు పొందే ఆర్థిక వ్యవస్థలున్న పాతిక దేశాలలో 65 నుంచి 70 శాతం కుటుంబాల నిజ ఆదాయాలు స్తంభించి వుండడమో, లేదా తగ్గడమో జరిగింది. 2000వ సంవత్సరంలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో కేవలం 33 శాతం అమెరికన్లు మాత్రమే తమను తాము శ్రామిక వర్గానికి చెందిన వారిగా చెప్పుకున్నారు. కాగా, 2015లో యీ సంఖ్య 48 శాతానికి పెరిగింది, అంటే దాదాపుగా జనాభాలో సగంమంది అన్నమాట. ప్రపంచ జనాభాలో అసంఖ్యాక ప్రజల పేదరికమూ, జుగుప్సాకర అసమానతల స్థాయి తీవ్ర అసంతృప్తికి కారణమవుతున్నది; ఇది రాజకీయ రూపంలో మార్పును కొరుకుంటున్నది.

**1.12** నయా ఉదారవాదం సృష్టించిన యీ సంక్షోభం సామ్రాజ్యవాద దేశాల మధ్య నూతన వైరుధ్యాలను, సృష్టించి, చీలికలకు దారితీస్తున్నది. బ్రెక్సిట్ వంటివి ఇందుకు ఉదాహరణలు. కొత్త రాజకీయ శక్తుల ఆవిర్భావం ఉద్రిక్తతలు పెరగటం ఈనాడు సర్వసాధారణమైంది.

## మితవాద రాజకీయాల వైపు మొగ్గు

**1.13** మన పార్టీ 21వ మహాసభ అనంతర కాలంలో ప్రపంచంలోని పలు ప్రాంతాలలో మితవాదం వైపు రాజకీయాల మొగ్గు మరింతగా కనపడుతున్నది. సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న ప్రస్తుత సమయంలో సామ్రాజ్యవాదం తీవ్రస్థాయిలో నయా ఉదారవాదాన్ని అనుసరిస్తూ, ప్రపంచాన్ని చీలికలు పీలికలు చేసే కార్యక్రమాన్ని చేపట్టి దేశీయ, స్థానిక, ప్రాంతీయ ఉద్రిక్తతలను పెంచుతున్నది. దీనివల్ల జాతి దురహంకారమూ, విదేశీవిద్వేషమూ, పచ్చి మితవాద నయా ఫాసిస్టు ధోరణులూ పెరుగుతున్నాయి. అమెరికన్ ఎన్నికలలో డోనాల్డ్ ట్రంప్ విజయమూ, బ్రిటన్‌లో బ్రెక్సిట్ ఓటులో మితవాద సమీకరణ, ఫ్రాన్స్‌లో మరినే లిపెన్ నేతృత్వంలోని పచ్చి మితవాద నేషనల్ ఫ్రంట్‌కు ఎన్నికలలో ఓట్లు పెరగడం, జర్మనీలో ఆల్టర్నేటివ్ ఫర్ డేయిష్ల్యాండ్ పార్టీ ముందంజ, ఆస్ట్రియాలో పచ్చి మితవాద పార్టీ అయిన 'ఫ్రీడం పార్టీ'తో కలిసి మితవాద ప్రభుత్వ స్థాపన, ఐరోపా పార్లమెంట్ సభ్యులలో దాదాపు మూడవవంతు మంది మితవాద, పచ్చిమితవాద పార్టీలకు చెందినవారు ఎన్నికకావడం ఇవన్నీ మితవాదం వైపు మొగ్గును ప్రతిఫలిస్తున్నాయి. ఈ ధోరణి భారత రాజకీయాలపై కూడా తన ప్రభావాన్ని చూపుతున్నది.

**1.14** ప్రపంచ ఆర్థిక సంక్షోభం తీవ్రతరమైన సమయంలో ప్రజలలో నానాటికీ వెల్లువెత్తే అసంతృప్తిని ఎవరు అదుపుచేయగలరనే దానిపై రాజకీయ పోరాటం తెరపైకివస్తుంది. వామపక్ష, అభ్యుదయవాదులను ప్రధాన ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ముందుకు రానీయకుండా నిలవరించి ప్రజలలో ఉన్న అసంతృప్తిని తనువైపు మలుచుకుని రాజకీయ మితవాద శక్తులు ముందుకొస్తున్నాయి. ఏ ఆర్థిక విధానాలైతే యీనాటి ఆర్థిక

సంక్షోభానికి దారితీసి, ప్రజలపై మున్నెన్నడూ ఎరుగని భారాలను మోపి, ప్రజలలో అసంతృప్తి పెరగటానికి కారణమయ్యాయో, సరిగ్గా ఆ విధానాలనే ప్రజల అసంతృప్తిని సొమ్ము చేసుకున్న మితవాద చివరకు శక్తులు చేపట్టాయి. ప్రజలలో పెరుగుతున్న అసంతృప్తిని రాజకీయంగా మలచుకొని నాయకత్వం వహించడంలో ఫలప్రదమయ్యేది వామపక్ష, ప్రజాతంత్ర శక్తులా లేక మితవాద రాజకీయవాదులా అన్న అంశమే రానున్న కాలంలో పలు ప్రపంచ దేశాల రాజకీయాల దిశను నిర్ధారిస్తాయనటం స్పష్టం. 1929-33లలో మహామాంద్యం ప్రబలినపుడు ప్రపంచ గుత్త పెట్టుబడి మద్దతుతోనే ఫాసిజం తలెత్తింది. సంక్షోభం కారణంగా ప్రజలలో పెరిగిన అసంతృప్తిని తమకు అనుకూలంగా మలచుకోవటంలో ఆనాడు ఫాసిస్టు శక్తులు సఫలమయ్యాయి. సుదీర్ఘ ఆర్థిక సంక్షోభానికి వ్యతిరేకంగా ప్రజలలో పెరుగుతున్న అసంతృప్తి ప్రస్తుత తరుణంలో పచ్చి మితవాదానికీ, నయా ఫాసిస్టు శక్తులకు వూతమిస్తున్నది.

1.15 **సరితూగే ధోరణులు :** అయితే, ఈ మితవాద వెల్లువకు అడ్డుకట్ట వేయగలిగే, సరితూగ గలిగే రాజకీయ పోరాటాలు ఈ కాలంలో ముందుకొస్తున్నాయి. వివిధ దేశాలలో వామపక్షవాద వేదికలు ఏర్పడి పురోగమిస్తున్నాయి.

1.16 ఫ్రాన్సులో జరిగిన అధ్యక్ష ఎన్నికలలో వామపక్ష అభ్యర్థి జీన్ లుక్ మేలెంచాన్ మొదటి రౌండ్ లో 20% ఓట్లను పొందారు. చివరి రౌండ్‌లో పచ్చి మితవాద పార్టీ ఓటమి పాలయింది. అయితే దాదాపు మూడో వంతు ఓటర్లు ఎన్నికల్లో పాల్గొన లేదు. నయా ఉదారవాద బ్యాంకర్‌ని గాని ఫాసిస్ట్‌ని గాని ఎన్నుకునేందుకు నిరాకరించారు. మరికొన్ని దేశాలలో కూడా తీవ్రమితవాదులు పదవులలోకి రాకుండా ప్రతిఘటించడం జరిగింది.

1.17 పోర్చుగల్‌లో (పి.సి.పి.), గ్రీస్‌లో (కె.కె.ఇ) వంటి దేశాలలోని కమ్యూనిస్టు పార్టీలు బలమైన శక్తులుగాతన నిలిచి ఎన్నికల విజయాలను కూడా సాధించాయి. సైప్రస్‌లో ఏకెఇఎల్, అక్కడి కమ్యూనిస్టు పార్టీ స్థానాన్ని యిటీవలి స్థానిక పురపాలక సంఘ ఎన్నికలలో మెరుగుపరుచుకుంది.

**1.18** నూతన వామ పక్షాల సంఘటనలు యూరప్‌లో కొన్ని చోట్ల ఏర్పడ్డాయి. ఉదారవాద సంస్కరణలను వ్యతిరేకిస్తానని, శ్రామిక వర్గంపై సాగుతున్న దాడులను త్రిప్పికొడతానని, హరించుకుపోయిన ప్రజాతంత్ర హక్కులను పునరుద్ధరిస్తానని వాగ్దానం చేస్తూ గ్రీస్‌లోని సిరిజా (Syriza) ఎన్నికల విజయాన్ని సాధించింది. అంతిమంగా సిరిజా ఐరోపా ద్రవ్య పెట్టుబడుల ఒత్తిళ్ళకు లొంగిపోవటంతో మితవాదానికి మరింత అవకాశం ఏర్పడింది. గ్రీసుప్రజలలో పెరుగుతున్న అసంతృప్తి మితవాద వ్యతిరేక రాజకీయ సమరానికి రంగంగా మారింది. స్పెయిన్‌లో ప్రగతిశీల దృక్పథం కలిగిన పిఓడిఇఎంఓఎస్ పార్టీ ఏర్పడి వామపక్ష శక్తులతో పొత్తుపెట్టుకుని గణనీయమైన ఎన్నికల విజయాలను సాధించింది.

**1.19** జెరిమీ కోర్బిన్ నేతృత్వాన ఇంగ్లండులో పుంజుకున్న లేబర్ పార్టీ తమకు ప్రజల సమస్యలే ప్రధానమని ఎన్నికల ప్రచారంలో పునుద్ఘాటించింది. ఒకవిధంగా చెప్పాలంటే బ్రిటన్‌లో వామపక్ష ఎజండాను పునరుద్ధరించింది. అమెరికాలో బెర్నీ సాండర్స్ శ్రామిక ప్రజల్లో తన ప్రచారాన్ని కొనసాగిస్తూ మద్దతును కూడగడుతున్నాడు.

**1.20** ఈ కాలంలో సోషల్ డెమొక్రాటిక్ పార్టీలు యూరప్ లో మరింత బలహీన పడడం, అదే సమయంలో పచ్చి మితవాద పార్టీలు బలపడడం చూసాం. పి.ఏ.ఎస్.ఓ.కె గ్రీస్‌లోను సోషలిస్ట్ పార్టీ ఫ్రాన్స్‌లోను, ఇటాలియన్ సోషలిస్టు పార్టీ, జర్మన్ సోషియల్ డెమొక్రాటిక్ పార్టీ, స్కాండినేవియన్ సోషల్ డెమోక్రాటిక్ పార్టీలు ఎన్నికలలో తీవ్రంగా విఫలమై ఆయా దేశాలలో బలహీనపడుతున్నాయి. ఎందుకంటే వారు నయాఉదారవాద విధానాలను అనుసరించారు; కార్మిక వర్గ ప్రయోజనాలకు దగా చేసారు. సోషల్ డెమోక్రసీ సంప్రదాయ స్వరూపాన్ని – ప్రతిపక్షంగా ఉన్నప్పుడు శ్రామిక వర్గ ప్రయోజనాలకు మొనగాడుగా ఉండడం; ప్రభుత్వంలో ఉండగా బూర్జువా వర్గ ప్రయోజనాలకు అండగా ఉండడం – ప్రజాబాహుళ్యం నేరంగా పరిగణించి నిర్ద్వందంగా తిరస్కరించింది.

**1.21** ఎక్కడైతే వామపక్షాలు, వామపక్ష భావాలు కలిగిన శక్తులు నయా ఉదారవాదాన్ని, సామ్రాజ్యవాద దాడులను తీవ్రంగా వ్యతిరేకిస్తూ జనసమీకరణలను, పోరాటాలను బలోపేతం చేస్తున్నాయో అక్కడ అవి

సోషల్ డెమొక్రట్లను అధిగమించి ప్రజల మద్దతును పొంది పురోగతిని సాధిస్తున్నట్లు యీ పరిణామాలు తెలుపుతున్నాయి. భవిష్యత్తులో యిదే రాజకీయ సమరాలకు రంగం కానున్నది. నయా ఉదారవాదాన్ని ఎదిరించే సమర్థవంతమైన వామపక్షం లేనిచోట ప్రజల అసంతృప్తిని మితవాదం సొమ్ము చేసుకుంటున్నది.

## సామ్రాజ్యవాద దాడి

**1.22** అమెరికా నేతృత్వంలో సామ్రాజ్యవాద దాడి పెరుగుతుండడానికి ప్రపంచ ఆర్థిక సంక్షోభం ఒక నేపథ్యాన్ని సమకూర్చిపెట్టింది. అమెరికా సైనిక జోక్యంగాని అమెరికా నాయకత్వంలో నాటో సైనిక జోక్యంగాని ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలోనూ ముఖ్యంగా మధ్య ఆసియా, ఉత్తర ఆఫ్రికా, లాటిన్ అమెరికాలలో కొనసాగుతూనే ఉన్నది; అమెరికా ఇజ్రాయిల్‌ల కూటమి పట్టు పశ్చిమ ఆసియా పరిణామాలలో కొనసాగుతున్నది. చరిత్రలో మొదటి సారిగా బాల్టిక్, పోలాండ్ ప్రాంతాలలో నాటో సైనిక బలం చొరబాటుతో దాని ఉనికి మరింతగా పెరుగుతున్నది. 'చైనా ను నిలవరించడమన్న' తన వ్యూహాత్మక విధానాన్ని అమెరికా సామ్రాజ్యవాదం మరింత దూకుడుగా అమలుచేస్తున్నది. సోషలిస్టు దేశాలకు వ్యతిరేకంగా అమెరికన్ సామ్రాజ్యవాదం చేపడుతున్న చర్యలు ప్రస్తుత యుగంలో సామ్రాజ్యవాదానికీ, సోషలిజానికీ మధ్య ఉన్న కేంద్ర వైరుధ్యాన్ని మరింత తీవ్రతరం చేస్తున్నాయి.

**1.23** **అమెరికా అధ్యక్షునిగా డోనాల్డ్ ట్రంప్ :** అమెరికా అధ్యక్ష పదవికి డోనాల్డ్ ట్రంప్ ఎన్నిక కావటం అమెరికన్ పాలక వర్గంలోని అత్యంత ప్రతీఘాత శక్తుల విజయాన్ని ప్రతిబింబిస్తున్నది. విజయాన్ని సాధించటానికిగాను అమెరికన్ శ్రామిక వర్గంలో పేరుకుపోయిన అసంతృప్తిని రాజకీయ మితవాదం ఎలా వుపయోగించుకున్నదీ తెలుసుకునేందుకు యిదొక మంచి ఉదాహరణ. అధ్యక్షుడైన తర్వాత ట్రంప్ నయా వుదారవాద విధానాన్ని కఠినంగా అనుసరిస్తున్నాడు. ఇరాన్, పాలస్తీనా, క్యూబా, ఆఫ్ఘనిస్థాన్‌ల విషయంలో తనకు ముందున్న ప్రభుత్వ వైఖరిని ఆయన తిరగతోడుతున్నాడు. వెనిజులా, డిపిఆర్‌కె (ఉత్తరకొరియా) విషయంలో

కూడా ట్రంప్ కఠిన వైఖరిని అనుసరిస్తూ సరికొత్త ఘర్షణలను, ఉద్రిక్తతలను సృష్టిస్తున్నాడు. ఇజ్రాయిల్, సౌదీ అరేబియాలకు అతను అందిస్తున్న పూర్తి మద్దతు అరబ్ ప్రపంచంలో ఉద్రిక్తతలను పెంచేందుకు దారితీస్తున్నది.

**1.24** **పెరుగుతున్న సైనిక వ్యయం:** ప్రపంచ ఆర్థిక సంక్షోభం కారణంగా తగ్గుముఖం పట్టిన సైనిక వ్యయం తిరిగి పెరగనారంభించింది. ఈనాడు అమెరికా తన సైనిక వ్యయం కోసం జిడిపీలో 3.58 శాతాన్ని ఖర్చు చేస్తున్నది. అదే ప్రపంచ జిడిపీలో సైనిక వ్యయం యొక్క సగటు చూస్తే 2.3 శాతంగా ఉంది. 2018వ సంవత్సరానికిగాను అమెరికా తన బడ్జెట్‌లో రక్షణ కోసం మున్నెన్నడూ ఎరుగని రీతిలో 700 బిలియన్ డాలర్లను కేటాయించింది. నాటో సైనిక వ్యయంలో అమెరికాయే 70 శాతాన్ని భరిస్తున్నది. ఇది 2014లో - 1.4 శాతం తగ్గగా 2015 నాటికి 1.8 శాతానికి పెరిగింది. ఇది 2017 నాటికి మరింతగా పెరిగి 4.3 శాతానికి చేరింది.

**1.25** సామ్రాజ్యవాదం చేస్తున్న సైనిక వ్యయంలో యీ రకమైన పెరుగుదల ప్రపంచంపై తన పెత్తనాన్ని స్థాపించాలన్న అమెరికన్ సామ్రాజ్యవాద ప్రయత్నాలను మరింత బలోపేతం చేయటానికి ఉద్దేశించినదే. లాటిన్ అమెరికా, పశ్చిమ ఆసియా, ఆఫ్రికాలోని కొన్ని ప్రాంతాలలోనూ సైనిక జోక్యాన్ని కొనసాగిస్తూనే అమెరికా ప్రపంచ సైనిక వ్యూహాత్మక కేంద్రీకరణను పసిఫిక్ మహాసముద్రం వైపుకు మరలించినట్లు గత మహాసభల సందర్భంగా చెప్పుకున్నాము. దానికున్న నౌకాదళంలో మూడింట రెండువంతులు పసిఫిక్ సముద్రం లోనే వున్నది, "చైనాను నిలువరించేందుకు" దక్షిణ చైనా సముద్రంలోని వివాదాలపై అమెరికా ప్రత్యేకించి తన దృష్టిని కేంద్రీకరించింది. ప్రపంచ పెత్తనం కోసం తాను వేసుకున్న పథకాలకు గట్టి ప్రత్యర్థిగా చైనా ఉన్నదని అమెరికా భావిస్తుండటమే యిందుకు కారణం.

## లాటిన్ అమెరికా

**1.26** లాటిన్ అమెరికాలో రాజకీయాలలో సైనిక పరంగా అమెరికా జోక్యం నానాటికి పెరుగుతున్న కారణంగా లాటిన్ అమెరికా ప్రజలకు అమెరికా

సామ్రాజ్యవాదానికి మధ్య తీవ్రమయిన వైరం పెరుగుతూ వస్తున్నది. అమెరికా దాడి ఇప్పటికి సోషలిస్టు క్యూబా పైనే ఎక్కుపెట్టబడి ఉంది. ఒబామా పరిపాలన క్యూబా కి అమెరికాకు మధ్య సంబంధాలను మెరుగు పరుచుకోడానికి చేసిన చిన్న ప్రయత్నాలను కూడా డోనాల్డ్ ట్రంప్ తిరగ దోడారు. అమెరికా సామ్రాజ్య వాదం వెనిజులా ను లక్ష్యంగా చేసుకుని అక్కడ ఆహార కొరత ఏర్పడేందుకు దోహదం చేస్తున్నది. అలాగే బ్రెజిల్ బొలివియా ఇతర దేశాలలో కూడా అమెరికా జోక్యం నానాటికి పెరిగి లాటిన్ అమెరికా వామపక్ష అభివృద్ధిని ఆటంక పరుస్తున్నది. ఆ ప్రాంతం రాజకీయాలలో ఆర్థిక విధానాలలో, అమెరికా ప్రాబల్యం పునరుద్ధరించుకునే ప్రయత్నం చేస్తున్నది. ఆర్జెంటినా లో నయా ఉదారవాది మరిసీయా మర్సి ఆ దేశ అధ్యక్షుడిగా ఎన్నుకోబడేటట్టు చేయడంలో విజయం సాధించింది. బ్రెజిల్ అధ్యక్షుడిగా ఎన్నికయిన దిల్మా రౌస్సెఫ్ అవినీతి ఆరోపణలను ఎదుర్కొన్న నెపంతో పదవీచ్యుతుడు కావించబడ్డాడు. అంతకు ముందు ఉన్న అధ్యక్షుడు లులా, ప్రజాబాహుళ్యం మద్దత్తు ఉన్నప్పటికీ ఇటువంటి కారణాలతో ఎన్నికలలో పాల్గొనలేకుండా చేయడం జరిగింది. బ్రెజిల్ ప్రజలు తాము కష్టపడి సంపాదించుకున్న ప్రజాస్వామ్య హక్కులను అమెరికా మద్దత్తుతో హరిస్తున్న మితవాద శక్తులతో తీవ్ర ఘర్షణ పడుతున్నారు.

**1.27** 2017 అక్టోబరు 15వ తేదీన ప్రాంతీయ గవర్నర్లను ఎన్నుకునేందుకై వెనిజులా ప్రభుత్వం ఎన్నికలను నిర్వహించింది. బొలివెరియన్ వ్యతిరేక ప్రతీఘాత శక్తులకు అమెరికా డబ్బు సంచులను అందచేసింది. ఈ ఎన్నికలలో నికోలస్ మదురో ప్రభుత్వం చావుదెబ్బ తినగలదని, హుగోఛావిజ్ పార్టీ అయిన యునైటెడ్ సోషలిస్టు పార్టీ ఆఫ్ వెనిజులాకి, 2018 అక్టోబరులో జరగనున్న అధ్యక్ష ఎన్నికలలో మదురో ఓటమికి ఇప్పటి ఎన్నికల ఓటమి పునాది కాగలదని అమెరికా ఆశపడింది. అయితే పిఎస్‌యువి 23 గవర్నర్ల పదవులకుగాను పద్దెనిమిదింటిని గెలుచుకున్నది. వెనిజులాలో బొలివరియన్ ఆల్టర్నేటివ్‌కు ప్రజల మద్దతు బలంగా వున్నదని స్పష్టం అయింది.

**1.28** 2017 నవంబరు 26న హోండురాస్‌లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో అవకతవకలు జరిగాయంటూ ఎల్లెడెలా ఆరోపణలు వెల్లువెత్తినప్పటికీ హెర్నాండెజ్ తిరిగి ఎన్నిక కావటాన్ని అమెరికా బహిరంగంగా సమర్థించింది. హోండురాస్‌లోనూ, యితర మధ్య అమెరికా దేశాలలోనూ అమెరికా జోక్యానికి సుదీర్ఘ చరిత్రే వున్నది. బహుళజాతి సంస్థల గనుల, అతి తక్కువ వేతనాలుండే కార్ఖానాల ప్రయోజనాల కోసం 2009లో హోండురాస్‌లో కుట్రను అమెరికా ప్రేరేపించింది. ఎన్నికల అక్రమాలకు వ్యతిరేకంగా హెూండురాస్‌లో ప్రజలు పెద్దయెత్తున ఆందోళనలకు దిగగా ఆందోళనలు అత్యంత పాశవికంగా అణచివేయబడ్డాయి. అక్కడ అమెరికా మద్దతుతో ఒక నిరంకుశ ప్రభుత్వం ఉనికిలోకి వచ్చింది.

**1.29** మధ్య అమెరికాలోని మరోదేశం నికారాగువాలో డేనియల్ ఓర్టెగా మరలా ఎన్నికయ్యాడు. ఆయన చేపట్టిన ప్రజానుకూల చర్యల కారణంగా నికరాగువాలో పేదరికం దాదాపు 13 శాతం తగ్గింది. లాటిన్ అమెరికాలో వెనిజులాతోపాటుగా బొలీవియా, ఈక్వెడార్, హోండురాస్, నికరాగువాలలో అమెరికన్ సామ్రాజ్యవాదం చాలా చురుకుగా పనిచేస్తున్నది. ఈ వామపక్ష అభ్యుదయ ప్రభుత్వాలను అస్థిరపరచటానికి అది ప్రయత్నాలు చేస్తున్నది.

## పశ్చిమాసియా

**1.30** పశ్చిమాసియాలోని ఇరాన్‌ను అటు ఆర్థికంగా, యిటు రాజకీయంగా బలహీనపరచి, ఏకాకిని చేయడం, అమెరికన్ సామ్రాజ్యవాదం రాజకీయంగా అదుపును సాధించటం, ఇజ్రాయెల్‌ను పటిష్ట పరచడం లక్ష్యంగా అమెరికా – ఇజ్రాయిల్ పొత్తు పోషిస్తున్న ప్రధాన పాత్ర కొనసాగుతోంది.

**1.31** పాలస్తీనాలోని తూర్పు జెరూసలేం, వెస్ట్ బాంక్‌లలో అక్రమ నివాసాల నిర్మాణాన్ని ఇజ్రాయెల్ కొనసాగించటాన్ని ఖండిస్తూ మొట్టమొదటిసారిగా 2016లో ఐరాస భద్రతా సమితి తీర్మానించింది. తూర్పుజెరూసలెం పాలస్తీనా దేశరాజధానిగా నిర్ధారించబడిన ప్రాంతం. అయితే ఇజ్రాయిల్ మాత్రం ఆ ప్రాంతంలో అక్రమంగా జనావాసాలను ఏర్పరచి, వేలాది

నూతన గృహాలను యూదుల కోసం నిర్మించేందుకు, విస్తరించేందుకు అడ్డగోలుగా పథకాలు రచిస్తున్నది.

**1.32** ఈ పూర్వరంగంలోనే, జెరూసలేంను ఇజ్రాయెల్ రాజధానిగా గుర్తించి, అమెరికా రాయబార కార్యాలయాన్ని టెల్ అవీవ్ నుంచి అక్కడకు తరలించాలన్న డోనాల్డ్ ట్రంప్ నిర్ణయం పాలస్తీనా ప్రాంతాలపై ఇజ్రాయెల్ దురాక్రమణను సమర్ధించే కవ్వింపుచర్య. అంతేగాక ఇది అన్ని ఐరాస తీర్మానాలకూ, తూర్పు జెరూసలేం 1967 నుండి ఇజ్రాయెల్ దురాక్రమణలో వున్నదన్న అంతర్జాతీయ సమాజ అభిప్రాయానికీ పూర్తి వ్యతిరేకం. తూర్పు జెరూసలేం రాజధానిగా స్వతంత్ర పాలస్తీనా ఏర్పడాలన్నదే అంతర్జాతీయంగా అంగీకారం పొందిన వైఖరి. ఇజ్రాయెల్ – పాలస్తీనాల మధ్య శాంతి చర్చలకు గల అవకాశాలను చెడగొట్టడంలో అమెరికన్ ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత. డోనాల్డ్ ట్రంప్ నిర్ణయం ఈ ప్రాంతంలో మరింతగా ఉద్రిక్తతలను ఘర్షణలను పెంచడమేగాక ప్రపంచవ్యాపితంగా ప్రకంపనలను విస్తరింపజేస్తుంది.

**1.33** పశ్చిమా ఆసియాలోని, యితర ప్రాంతాలలో కూడా అమెరికా జోక్యం కొనసాగుతున్నది. రసాయన ఆయుధాలు వాడుతున్నారన్న నెపంతో సిరియాపై క్షిపణి దాడులు చేస్తున్నది. అయితే, సిరియాలో అధికార మార్పిడిని ప్రభావితం చేయాలన్న దాని ప్రయత్నాలు విఫలమైనట్లు ఇప్పుడు స్పష్టమవుతున్నది. ఏడేళ్ళ సుదీర్ఘ అంతర్యుద్ధంలో సిరియన్ బలగాలు సాధించిన పురోగమనం అసాధారణమైనది. సిరియాలో అధికార మార్పును ప్రభావితం చేయాలన్న అమెరికన్ సామ్రాజ్యవాద ప్రయత్నాలకు వ్యతిరేకంగా దీర్ఘకాలం కొనసాగుతున్న అంతర్యుద్ధంలో సిరియా శక్తులు ముందడుగు వేస్తున్నాయి. భయంకరమైన ఈ యుద్ధం 4 లక్షల పౌరుల ప్రాణాలు బలిగొన్నది. అమెరికా, దాని అరబ్ మిత్రుల మద్దత్తు వున్న ఇస్లామిస్టు శక్తుల వైఫల్యం పశ్చిమాసియా రాజకీయాలపై ప్రగాఢమైన ప్రభావాన్ని చూపగలదు. సిరియాలో రష్యా వ్యూహాత్మక సైనిక జోక్యంతో ఈ ప్రాంతంలో దాని ప్రభావం స్థిరపడింది. రష్యా–టర్కీ–ఇరాన్‌ల సంయుక్త చొరవ యీ ప్రాంతంలో అమెరికా కుట్రలను భగ్నం చేసింది. సిరియాలో అసాద్ ప్రభుత్వాన్ని కుప్పకూల్చాలన్న లక్ష్యాన్ని సాధించటం

బహుక్లిష్టమని అర్థం కావటంతో అమెరికా యిప్పుడు తన దృష్టిని **ఇరాన్** పైకి మరలించింది. ఈ ప్రాంతంలో అమెరికా వ్యూహానికి యిదే ప్రధాన లక్ష్యంగా కొనసాగుతున్నది. ఇరాన్ అణు ఒప్పందాన్ని ధ్రువీకరించటానికి డోనాల్డ్ ట్రంప్ తిరస్కరించటం చూస్తే ఇరాన్‌పైనా, యీ ప్రాంతంపైనా మరిన్ని నూతన తరహా ఒత్తిళ్ళువచ్చే సూచనలు కన్పిస్తున్నాయి.

**1.34** ఇరాన్‌ను బలహీనపరచాలనే తన ప్రయత్నాలలో భాగంగా, అమెరికన్ సామ్రాజ్యవాదం తన మిత్రదేశమైన సౌదీ అరేబియాను యెమెన్‌లో సైనిక జోక్యం కొనసాగించేలా ప్రోత్సహిస్తున్నది. ఆకలితోనూ తిండిలేని కారణంగా యెమెన్‌లో 2017 డిసెంబరు చివరి నాటికి కనీసం 50,000 మంది పిల్లలు మృతి చెందివుంటారని ఐరాస అంచనా వేసింది.

**1.35** ఇదే సమయంలో సౌదీ అరేబియాలో అంతర్గత రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. సౌదీ సింహాసనాన్ని మహమ్మద్ బిన్ సాల్మన్ అధిష్టించటంతో ఖతార్, సిరియా, యెమెన్‌లలో సౌదీ అరేబియా జోక్యాలు కొనసాగుతూనే వున్నాయి. ఇప్పుడది హెజ్‌బుల్లాను బలహీన పరిచేందుకు లెబనాన్‌ను కూడా లక్ష్యంగా పెట్టుకున్నది.

**1.36** **ఖతార్** : సౌదీ అరేబియా దాని మిత్రులు కలసి ఖతార్ రాజ్యాన్ని ఏకాకిగా చేయడానికి బలహీనపరచడానికి చేసిన ప్రయత్నాలకు మొదట్లో అమెరికన్ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మద్దతు వుండేది. ఇరాన్‌తో దౌత్య సంబంధాలు తెగతెంపులు చేసుకోవాలని, అల్జజీరా ఎలక్ట్రానిక్ మధ్యమాన్ని నిలిపివేయాలని, హమాస్‌తోనూ సౌదీ అరేబియా, కతార్‌ను ముస్లిం బ్రదర్‌హుడ్‌తోనూ కలిసి పనిచేస్తున్న సంస్థలను బహిష్కరించాలని సౌదీ అరేబియా కతార్‌ను డిమాండ్ చేసింది. కతార్ ఇరాన్ కలసి సౌత్ పార్స్ చమురు నిక్షేపాలలో అధికశాతం భాగస్వాములుగా ఉన్నారు. అందువలన ఇద్దరూ హైడ్రో కార్బన్ రంగంలో సహకరించుకోవలసిన అవసరం ఉంది. సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరైట్స్‌లు కతార్‌లో పాలన మారాలని కోరుకుంటున్నాయి. అయితే కతార్‌కి కూడా ఈ ప్రాంతంలో స్నేహితులున్నారు. యిదే సమయంలో 12 బిలియన్ డాలర్ల విలువ చేసే యుద్ధ విమానాలను ఖతార్‌కు అమ్మే ఒప్పందంపై అమెరికా సంతకం

చేసింది. ఈ ప్రాంతంలో దాదాపు 10వేల మందికి పైగా సైనికులు వున్న అమెరికన్ సైనిక స్థావరాలకు ఖతార్ ఆతిథ్యం యిస్తున్నది. సిరియా, ఇరాక్‌లలోని సైనిక చర్యలకు అత్యంత కీలకమైన అమెరికా ప్రధాన కార్యాలయం సెంట్‌కామ్‌కు కూడా ఖతార్ ఆతిథ్యం యిస్తున్నది.

## ఆఫ్రికా

**1.37** ఉత్తర ఆఫ్రికా ప్రాంతంలో మత తీవ్రవాద శక్తులు తమ ఆధిక్యతను కొనసాగిస్తున్నాయి. లిబియాపై సామ్రాజ్యవాద శక్తుల దాడి ఆ దేశాన్ని అస్థిరపరచడమే కాకుండా ఆ ప్రాంతమంతటా తీవ్రమైన ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. మతోన్మాదశక్తులు, ఉగ్రవాద శక్తులు అంతకంతకూ పెరుగుతున్నారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే పేరుతో 'ఆఫ్రికామ్' ద్వారా అమెరికా అక్కడ తన సైనిక ఉనికిని బలోపేతం చేసుకుంటున్నది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా చేపట్టినట్టు చెప్పబడుతున్న చర్యలలో నైజీరియా, మాలి, సాహెల్ దేశాల్లో అమెరికన్ సైనికులు మరణించినట్టు వార్తలు వెలువడుతున్నాయి. ఆయా దేశాలలోని సుసంపన్నమైన సహజ వనరులను కొల్లగొట్టేందుకూ, ప్రధానమైన వాణిజ్య మార్గాలను, మార్కెట్లను అదుపు చేసేందుకూ, ఆఫ్రికా ఖండంలో పెరుగుతున్న చైనా ప్రాబల్యాన్ని నిరోధించేటందుకూ పైన పేర్కొన్న దేశాల అంతర్గత వ్యవహారాలలో అమెరికా జోక్యం చేసుకుంటున్నది.

## దక్షిణాఫ్రికా

**1.38** దక్షిణ ఆఫ్రికాలో జాకోబ్ జుమా, ఆ దేశ అధ్యక్షుడు, ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ అధ్యక్షుడు కూడా. అవినీతి వ్యవహారాలు బయట పడడంతో అయన రాజీనామా చేయవలసి వచ్చింది. అయన కొనసాగడం ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ , దక్షిణాఫ్రికా కమ్యూనిస్టు పార్టీ, దక్షిణాఫ్రికా కార్మిక సంఘాల సంస్థ త్రికోణ మైత్రికి ముప్పుగా పరిణమించింది. సిరిల్ రామఫోసా అనే దీర్ఘకాల వయోవృద్ధుడైన కార్మిక నాయకుడు జుమా స్థానంలో అధ్యక్షుడిగా ఎన్నుకోబడ్డాడు. జింబాబ్వేలో స్వతంత్ర జింబాబ్వేకు 37 సంవత్సరాలపాటు తిరుగులేని నాయకునిగా వున్న రాబర్ట్ ముగాబే

దేశాధ్యక్ష పదవికి బలవంతంగా రాజీనామా చేయవలసి వచ్చింది. ఆ తరువాత జడ్.ఎ.ఎన్.యు.పి.ఎఫ్. అసాధారణ మహాసభను నిర్వహించి పార్టీ అధ్యక్షునిగా ఎమరగన్ మనగాగ్వాను ఏకగ్రీవంగా ఎన్నుకొని, రానున్న 2018 ఎన్నికల్లో ఆయనను అధ్యక్ష పదవికి, పార్టీ అభ్యర్థిగా నిలబెట్టాలని నిర్ణయించింది.

## సామ్రాజ్యవాదుల మధ్య వైరుధ్యాలు

**1.39** దీర్ఘకాలంగా కొనసాగుతున్న ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభం, తిరిగి పెరుగుతున్న సామ్రాజ్యవాదుల దాడులు – ఈ పరిస్థితులలో సామ్రాజ్యవాద శిబిరంలో పొందిక ప్రతికూల ప్రభావానికి లోనైంది. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి నేతృత్వంలో సామ్రాజ్యవాద ప్రపంచీకరణ కాలంలో సామ్రాజ్యవాదుల మధ్య వైరుధ్యాలు మొద్దుబారి వున్నాయని గతమహాసభలో మనం గుర్తించాం. ఆ పరిస్థితి క్రమంగా చెదిరిపోతున్నది. ఇందుకు బ్రెక్సిట్ ఓటు ఒక ఉదాహరణ. డోనాల్డ్ ట్రంప్ విధానాలకూ, ఐరోపా యూనియన్, జపాన్‌వంటి యితర పెట్టుబడిదారీ కేంద్రాలకూ మధ్య ఘర్షణ పెరుగుతున్నది. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ముందుండి రూపొందించిన ట్రాన్స్–పసిఫిక్ భాగస్వామ్య ఒప్పందాన్ని డోనాల్డ్ ట్రంప్ రద్దుచేశాడు. యిది జపాన్ ప్రయోజనాలకు భంగం కల్గిస్తుంది.

**1.40** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ముందు తమ దేశం చైనా నుండి దిగుమతి చేసుకునే స్టీల్, అల్యూమినియం ఉత్పత్తులపై పన్నులు పెంచి, ఆ తరువాత ఇతర అనేక వస్తువులపై సుంకాలు పెంచడం వాణిజ్య యుద్ధం మొదలవుతుందన్న భయాన్ని కలిగిస్తున్నాయి. అమెరికా అనుసరించే ఈ రక్షణ విధానాలు దాని యూరప్ మిత్రులను వ్యతిరేకులను చేస్తుంది.

**1.41** పారిస్ వాతావరణ ఒప్పందం నుండి అమెరికా ఉపసంహరణ, అమెరికాకు, ఐరోపా యూనియన్‌కు మధ్య ఘర్షణను మరింత తీవ్రతరం చేసింది. నాటో కూటమికి సమకూర్చే నిధులలో ఐరోపా దేశాలు ఎక్కువ భాగాన్ని భరించాలని డోనాల్డ్ ట్రంప్ పట్టుబట్టటం కూడా ఉద్రిక్తతల పెరుగుదలకు

కారణమవుతున్నది. ఇరాన్ అణు ఒప్పందం విషయంలో డోనాల్డ్ ట్రంప్ యిటీవల మాట తప్పడం కూడా అమెరికాకు, ఈ ఒప్పందంపై సంతకాలు చేసిన యితర దేశాలకు, అంటే జర్మనీ, ఫ్రాన్స్, రష్యా, ఇంగ్లాండులకు మధ్య ఘర్షణలను పెంచింది. అమెరికా యొక్క ఐరోపా మిత్రులు ట్రంప్ చర్యను ఆమోదించకపోవచ్చు. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ద్వారా గరిష్ట లాభాలను సాధించేందుకు, ప్రజలపై దోపిడీని మరింత తీవ్రతరం చేసే విషయంలో సామ్రాజ్యవాద శిబిరం సఖ్యతతో వ్యవహరించవచ్చుగాని, ఇతర సమస్యల విషయాలలో ఘర్షణలు, వైరుధ్యాలు తలెత్తుతున్నాయని పై పరిణామాలన్నీ సూచిస్తున్నాయి.

## పర్యావరణ మార్పులు

**1.42** పారిస్ ఒప్పందాన్ని అమెరికా ఆమోదించబోదంటూ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించటంతో, ఏళ్ళతరబడి ప్రపంచంలో పెరుగుతున్న ప్రపంచ ఉష్ణోగ్రతలను అరికట్టి, పర్యావరణానికి జరుగుతున్న నష్టాన్ని పూడ్చటానికి సాగుతున్న పోరాటం మరోసారి నిలచిపోయింది.

**1.43** సంపన్న దేశాలు తమ వాగ్దానాలను నిలబెట్టుకోవన్న అనుమానాలు సరైనవేనని మరోసారి రుజువైంది. పర్యావరణానికి హాని కలిగించే విషవాయువుల విడుదలను అదుపుచేసేందుకు ఒక అంతర్జాతీయ అధికారిక వ్యవస్థను ఏర్పాటు చేయడానికి డిసెంబరు 2016లో పారిస్ ఒప్పందం కుదిరింది. అయితే ఈ ఒప్పందం శాస్త్ర విజ్ఞానం నిర్దేశిస్తున్న అవసరాలను అభివృద్ధి చెందిన దేశాలకు, వర్ధమాన దేశాలకు మధ్య పేరుకుపోతున్న అసమానతల సమస్యనుగాని పరిష్కరించలేకపోయింది. ఆ విధంగా పారిస్ ఒప్పందం రూపొందించిన వ్యవస్థ తీవ్ర అసంతృప్తులను కలిగించింది. పారిస్ ఒప్పందం రూపొందించిన వ్యవస్థ ఆయాదేశాలు స్వచ్ఛందంగా హానికర వాయువుల విడుదలను అదుపుచేయడానికి అంగీకరించాలని నిర్దేశిస్తున్నది. పర్యవసానంగా భూగోళంపై ఉష్ణోగ్రతల పెరుగుదల ప్రతియేటా 3 డిగ్రీల సెంటీగ్రేడ్‌ను మించిపోతున్నది. ఇది అందరూ అంగీకరించిన 2 డిగ్రీల సెంటీగ్రేడ్ పరిమితికన్నా చాలా ఎక్కువ.

1.5 డిగ్రీల సెంటీగ్రేడ్‌కే పరిమితం చేయాలన్న ఆకాంక్షల గురించి ఇక చెప్పనవసరం లేదు. అమెరికా పారిస్ ఒప్పందాన్ని తన ఇష్టానుసారం నడిపిస్తున్నది. భూగోళంపైన పర్యావరణానికి హానికలిగించడంలో అభివృద్ధి చెందినదేశాలు తమకు గల చారిత్రిక బాధ్యతను అంగీకరించి సరిచేసేందుకు జవాబుదారీగా వ్యవహరించాల్సి వుంది. అందుకుగాను కర్బన ఉద్గారాల తగ్గింపు లక్ష్యాలను తప్పనిసరిగా అభివృద్ధి చెందిన దేశాలు అమలుచేసే విధంగా ఒప్పందం ఉండాలి. కాని అన్ని దేశాలూ స్వచ్ఛందంగా లక్ష్యాలను నిర్ణయించుకొనే వీలు కల్పించారు. దీనికి తోడు అభివృద్ధి చెందిన దేశాలు అందించాల్సిన ఆర్థిక సహాయానికి కర్బన ఉద్గారాల తగ్గింపుకు తోడ్పడే సాంకేతిక పరిజ్ఞానం బదలాయింపులకు సంబంధించి గత ఒప్పందాలలో చేసిన వాగ్దానాలను సైతం ఇప్పుడు పక్కన బెట్టారు. ప్రయివేటు పెట్టుబడి ప్రయోజనాలు ఒనగూడే పర్యావరణ మార్పు ఎజెండాని ఇప్పుడు అమెరికా ముందుకు తెచ్చి అమలుకు ఒప్పించేవిధంగా ఆజ్ఞలు జారీ చేస్తున్నది. తమ గతచర్యలకు అభివృద్ధిచెందిన దేశాలు ఎటువంటి నష్టపరిహారమూ చెల్లించనవసరం లేదని పారిస్ ఒప్పందం తేల్చిచెప్పింది. వర్ధమాన దేశాలు "పర్యావరణ రక్షణ బాధ్యత ఉమ్మడిగా అన్ని దేశాలకూ ఉన్నప్పటికీ, అది వేరు వేరు మోతాదుల్లో ఉంటుందన్న" సూత్రాన్ని పునరుద్ఘాటించినప్పటికీ దానిని వాస్తవంలో తోసిపుచ్చారు. ప్రస్తుతం ట్రంప్ నాయకత్వాన అమెరికా పారిస్ ఒప్పందం నుంచి బయటకు వచ్చింది. ఆ రకంగా అన్ని రకాల అంతర్జాతీయ పర్యావరణ నియంత్రణల పరిధి నుంచి బయటకు వచ్చినట్లయింది. ఇంతకుముందు క్యోటో ఒప్పందాన్ని తోసిపుచ్చిన వైఖరినే అమెరికా కొనసాగిస్తున్నది. ప్రపంచం మొత్తంమీద వాతావరణాన్ని కలుషితం చేయడంలో ద్వితీయ స్థానంలో అమెరికా ఉంది. కలుషిత వాయువుల తగ్గింపుపై నామమాత్రపు వాగ్దానాలనే, అదీ తన ఐరోపా భాగస్వాములకన్నా చాలా తక్కువ మోతాదులలోనే చేసింది.

**1.44** 2018లో భూగోళంపై కర్బన ఉద్గారాల విడుదలను అదుపు చేసేందుకు తీసుకున్న చర్యలపై అంచనా వేయనున్నారు. ఈ చర్చల సందర్భంగా

కర్బన ఉద్గారాల విడుదలను మరింత హెచ్చుమోతాదులో తగ్గించాలని భారతదేశంపై వత్తిడి తెచ్చేందుకు అభివృద్ధి చెందిన దేశాలు ప్రయత్నాలు చేస్తున్నాయి. దీని వలన మన దేశాభివృద్ధికి చేసే ప్రయత్నాలకు తీవ్ర ఆటంకాలు ఏర్పడతాయి. వీటిపట్ల భారతదేశం అప్రమత్తంగా ఉండాలి. కాని ప్రస్తుత ప్రభుత్వం ఈ విషయాలలో ఎటువంటి ప్రయత్నమూ చేయడం లేదు. అందువలన అభ్యుదయశక్తులు పూనుకుని కర్బన ఉద్గారాలను తగ్గించే చర్యలు, ప్రజారవాణా వ్యవస్థ ఏర్పాటు, విద్యుత్తు, వంటగ్యాస్ వంటి ఆధునిక ఇంధనాలు పేదలందరికీ, ముఖ్యంగా గ్రామీణ పేదలందరికీ అందుబాటులోకి తేవడం వంటి చర్యలు చేపట్టే విధంగా ప్రభుత్వంపై వత్తిడి పెంచాలి.

## 1.45 బహుళధృవ పరిస్థితి

**1.46** గత మహాసభ అనంతర కాలంలో అంతర్జాతీయ సంబంధాలలో బహుళధృవ పరిస్థితికి సంబంధించి పరస్పర విరుద్ధ ధోరణులు తలయెత్తాయి. ఇండియా, బ్రెజిల్ దేశాలలో మితవాద ప్రభుత్వాలు ఏర్పడటం, దక్షిణాఫ్రికాలో ఏఎన్‌సి – కొసాటు – ఎస్‌ఏసిపి కూటమి బలహీనపడిన పూర్వరంగంలో అక్కడ ఎన్నికలు సమీపించడంతో బ్రిక్స్ ప్రభావం బాగా దెబ్బతిన్నది. ఏదియేమైనప్పటికీ, బ్రిక్స్ షాంఘైలో 'న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్'ను నెలకొల్పడంలో జయప్రదం అయింది. పైన పేర్కొన్న వైరుధ్యపూరిత ధోరణుల దృష్ట్యా సామ్రాజ్యవాద ఆర్థిక సంస్థలకు దీటుగా నిలవటంలో దాని సామర్థ్యం ప్రశ్నార్థకంగా తయారైంది.

**1.47** షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఓ) సమర్థవంతమైన ప్రాంతీయ సంస్థగా తన పాత్రను బలోపేతం చేసుకుంటూ, భారత్, పాకిస్తాన్‌లను పూర్తిస్థాయి సభ్యులుగా చేయడం ద్వారా విస్తరించింది. కొన్ని అభివృద్ధి చెందిన దేశాలతో సహా 60 మంది సభ్యులతో ఆసియన్ మౌలికసదుపాయాలు మరియు పెట్టుబడుల బ్యాంకును (ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఇన్‌వెస్ట్‌మెంట్ బ్యాంక్) స్థాపించటానికి చైనా చొరవ తీసుకుంటున్నది.

**1.48** ఏకధ్రువ ప్రపంచం ద్వారా తన ప్రపంచ పెత్తనాన్ని పటిష్టం చేసుకోవడానికి అమెరికన్ సామ్రాజ్యవాదం చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా వివిధ

వేదికల ద్వారా అంతర్జాతీయ బహుళ ధ్రువత్వాన్ని అభివృద్ధి చేసి పటిష్టం చేయాలి. అయితే విదేశీ, రక్షణ, వ్యూహాత్మక అంశాలలో అమెరికా అనుకూల వైఖరిని ప్రకటించిన భారతదేశం పాత్ర చాలా కీలకంగా మారనున్నది. చైనా చొరవ తీసుకున్న 'వన్ బెల్ట్ వన్ రోడ్' అన్న పథకంలో చేరటానికి భారతదేశం తిరస్కరించింది. ప్రస్తుతం భారతదేశం చేపట్టిన అమెరికన్ సామ్రాజ్యవాద అనుకూల వైఖరి ముమ్ముందు కూడా యీ రకమైన వేదికల శక్తిసామర్థ్యాలను దెబ్బతీస్తూనే వుంటుంది.

**1.49** లాటిన్ అమెరికా లో ప్రాంతీయ పార్టీలయిన యూనియన్ అఫ్ సౌత్ అమెరికన్ నేషన్స్ (యూ ఎం ఏ ఎస్ యూ ఆర్), మెర్కడో కామన్ దెల సూర్ (సథరన్ కామన్ మార్కెట్) (ఎం ఈ ఆర్ సి ఓ ఎస్ యూ ఆర్), బోలివరీయన్ అలయన్స్ ఫర్ పీపుల్ అఫ్ అవర్ అమెరికా (ఏ ఎల్ బి ఏ), అండ్ కమ్యూనిటీ అఫ్ లాటిన్ అమెరికా అండ్ కరీబియన్ స్టేట్స్ (సి ఈ ఎల్ ఏ సి) అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఏర్పడినవి, అమెరికా బలపరిచిన మితవాద ప్రభుత్వాలు అర్జెంటినా, బ్రెజిల్ లలోను ఇతర దేశాలలో ఏర్పడడంతో బలహీనపడ్డాయి.

## 1.50 డబ్ల్యుటిఓ చర్చలు

**1.51** ఇంతకుముందే పేర్కొన్నట్లుగా అమెరికాతోపాటు యితర సంపన్న పెట్టుబడిదారీ దేశాలు ద్వైపాక్షిక, ప్రాంతీయ వాణిజ్య ఒప్పందాల చర్చలకు ప్రాధాన్యతను యిస్తున్నాయి. ప్రపంచ వాణిజ్య నిబంధనలను నిర్ణయించే ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఓ) యింకెంత మాత్రం ప్రధాన వేదికగా ఉండబోదు. 160కి పైగా దేశాలు సభ్యులుగా ఉన్న డబ్ల్యుటిఓలో ఉండటంతో వర్ధమాన దేశాల ప్రతిఘటనను తేలికగా దెబ్బతీయడానికి ద్వైపాక్షిక, ప్రాంతీయ ఒప్పందాలను అమెరికాతోపాటు యితర అభివృద్ధి చెందిన దేశాలు ఒక సులభ మార్గంగా ఎంచుకుని వ్యవహరిస్తున్నాయి.

**1.52** ప్రస్తుతం భారతదేశం ప్రధానమైన రెండు వాణిజ్య ఒప్పందాల గురించి చర్చలు సాగిస్తున్నది. భారత్ – ఐరోపాయూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం, ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్యం (ఆర్ఇసిపి). ఇందులో

భారతదేశంతో కలిపి మొత్తం 15 దేశాలు ఉన్నాయి. ఆసియన్ సభ్యదేశాలు 10, జపాన్, దక్షిణ కొరియా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, చైనాలు వుంటాయి.

భారతదేశ – ఈయూ, స్వేచ్ఛా వాణిజ్య, చర్యలు (ఎఫ్.టి.ఏ) రహస్యంగా జరుగుతున్నాయి. చర్చలోవున్న కొన్ని అంశాలు భారతదేశ వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ కార్యక్రమాలకు ఇతర సేవల ప్రయోజనాలకు భంగకరమైనవి.

**1.53** అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడులకు, అమెరికా ప్రయోజనాలకు లొంగిపోకుండా దేశీయ ప్రయోజనాలను రక్షించుకునే భారతదేశ ప్రయత్నాలు అంతకంతకూ పతనమవుతున్నాయి. బిజెపీ ప్రభుత్వం స్పష్టమైన అమెరికా అనుకూల వైఖరి అనుసరించడమే యిందుకు కారణం. సంబంధిత చర్చలు పూర్తి గోప్యంగా జరిగాయి. చర్చల నివేదికలను వెల్లడి చేయడం లేదు. ఇది గతంలో అనుసరించిన పద్ధతులకు భిన్నం. ఈ వివరాలను పార్లమెంటుకు సైతం యివ్వలేదు. ఇతర దేశాల ద్వారా బయటకు పొక్కిన యీ చర్చల వివరాల ప్రకారం చూసినట్లయితే, ఒత్తిళ్ళకు లొంగిపోయి డబ్ల్యుటిఓ కోరుతున్న దానికన్నా ఎక్కువగా వాణిజ్య నిబంధనలను మరింత సరళీకృతం చేయటం జరిగింది. భారతీయ పేటెంట్ నిబంధనలను సవరించాలని వస్తున్న వత్తిళ్లు ఆందోళన కల్గిస్తున్న అంశం. దీనివల్ల భారతదేశంలోకి దిగుమతి అయ్యే నూతన ఔషధాల ధరలు ప్రతికూలంగా ప్రభావితం కాగలవు. విదేశీ పెట్టుబడులకు సంబంధించిన నిబంధనలను సడలించినట్లయితే విదేశీ కార్పొరేషన్ల కార్యకలాపాలను నియంత్రించే భారత ప్రభుత్వ పాత్రను కుదించినట్లవుతుంది. దేశీయ ప్రయోజనాలు దెబ్బ తింటాయి.

**1.54** 2017 చివరలో బ్యూనస్ ఏయిర్స్‌లో జరిగిన డబ్ల్యుటిఓ మంత్రుల సమావేశం ఇ–వాణిజ్యంపై చర్చలు సాగించింది. ఇ–వాణిజ్యం ముసుగులో వాణిజ్యాన్ని సరళీకృతం చేసేందుకై సంపన్న దేశాలు రుద్దిన అజెండా యిది. ఈ వాణిజ్య నిర్వచనాన్ని విస్తృతం చేశారు. ఏదో ఒక రూపంలో ఎలక్ట్రానిక్ లావాదేవీలను సాగించే అన్ని వ్యాపారాలను దీని పరిధిలోకి

తీసుకువచ్చారు. వర్తమాన ప్రపంచంలోని అన్ని రంగాలు దీని క్రిందకు వస్తాయి. దేశీయ పన్నుల నుండి ఇ- వాణిజ్యాన్ని మినహాయించాలని సంపన్న దేశాలు కోరుతున్నాయి. ఇదే జరిగితే భారత ప్రభుత్వ ఆదాయానికి పెద్దయెత్తున నష్టం సంభవిస్తుంది. కస్టమ్స్ తదితర పన్నుల ద్వారా వచ్చే ఆదాయం వదులు కోవలసివస్తుంది. ప్రపంచ స్థాయికి చెందిన బ్రహ్మాండమైన ఇ-వాణిజ్య కంపెనీలతో పోటీపడవలసి రావటంతో భారతదేశంలోని చిన్న, మధ్యతరహా వ్యాపార సంస్థలు దెబ్బతింటాయి. ఆఫ్రికన్ గ్రూపుకు చెందిన దేశాలు దీనిని వ్యతిరేకించాయి. కాని భారతదేశం యిప్పటి వరకు తన వైఖరిని స్పష్టం చేయలేదు.

**1.55** డబ్ల్యుటిఓలో వర్ధమాన దేశాల వాణి ఇంతవరకూ భారతదేశం పరిగణించబడేది. ఐతే ఆ పాత్రను విడచిపెట్టి ప్రపంచ పెట్టుబడికి జూనియర్ భాగస్వామిగా మారాలని భారతదేశం కోరుకుంటున్నట్లు యీ చర్చల క్రమంలో మరోసారి స్పష్టమైంది.

## సోషలిస్టు దేశాలు

**1.56** **చైనా :** గత మహాసభ అనంతర కాలంలో చైనా ఆర్థిక వ్యవస్థ పెరుగుదల సగటు వార్షిక రేటు 7.2 శాతంగా వున్నది. కాగా ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అది కొనసాగుతున్నది. ప్రపంచ ఆర్థికాభివృద్ధిలో చైనా 30 శాతానికి పైగా వాటాను కలిగి వున్నది. ప్రపంచ ఆర్థిక సంక్షోభం కారణంగా ఎదురైన కష్టనష్టాలను అధిగమించే క్రమంలో చైనా ఒక ప్రధానమైన మార్పును తీసుకువచ్చింది. అదేమంటే దేశీయ డిమాండును, వినియోగాన్ని పెంచటం. ఇందుకుగాను అది నిలకడగా కనీస వేతనాలను పెంచటంతోపాటు, ఆరు కోట్లమంది ప్రజలను పేదరికం నుంచి బైటకుతెచ్చే చర్యలను చేపట్టింది. ఉపాధి కల్పన కూడా నిలకడగా పెరిగింది. ప్రతి ఏడాది పట్టణ ప్రాంతాల్లో కోటి 30 లక్షల వుద్యోగాలను చైనా ప్రభుత్వం కల్పించింది.

**1.57** చైనా ఆర్థిక శక్తి పెరుగుదల అంతర్జాతీయ సంబంధాలపై బ్రహ్మాండమైన ప్రభావాన్ని చూపింది. పురాతన సిల్క్ రూట్‌ను పోలిన 'వన్ బెల్ట్ వన్

రోడ్' ప్రాజెక్టుకు, తీరప్రాంత సుగంధ ద్రవ్యాల వాణిజ్య మార్గ ప్రాజెక్టుకు చైనా చొరవ చూపింది. 'ఆసియన్ మౌలిక సదుపాయాల పెట్టుబడి బ్యాంకు'కు సంబంధించి చైనా చేసిన ప్రతిపాదనకు కూడా మంచి స్పందన వచ్చింది. ఇంగ్లండు, ఆస్ట్రేలియా, దక్షిణ కొరియా వంటి అమెరికా మిత్రులతో సహా 60కిపైగా దేశాలు ఈ ప్రతిపాదనతో చేతులు కలిపాయి. షాంఘై సహకార సంస్థ, బ్రిక్స్‌వంటి పలు బహుళపక్ష సంస్థలు బలపడడం చైనా ప్రాబల్యం పెరుగుదలకు సాక్షిగా నిలచాయి. అంతర్జాతీయ సంబంధాలలో చైనా పలుకుబడి పెరగటం చూసి భయపడిన అమెరికా చైనాను నిరోధించే తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. దక్షిణ చైనా సముద్రంలోనూ, కొరియన్ ద్వీపకల్పం, ఆసియా-పసిఫిక్ ప్రాంత వ్యవహారాల్లోను అది జోక్యం చేసుకుంటున్నది. రానున్న రోజుల్లో సామ్రాజ్యవాద అమెరికాకు, సోషలిస్టు చైనాకు మధ్య తీవ్రమైన పోటీ చూడబోతున్నాం.

**1.58** ఇటీవలనే ముగిసిన చైనా కమ్యూనిస్టు పార్టీ (**సిపిసి**) 19వ మహాసభ చైనా ఆత్మవిశ్వాసాన్నీ, పట్టును ప్రతిబింబించింది. పార్టీ ప్రధాన కార్యదర్శిగా తిరిగి జి జిన్‌పింగ్‌ను మహాసభ ఎన్నుకొనటంతోపాటు, యీ నూతన శకంలో చైనా లక్షణాలతో సోషలిజాన్ని నిర్మించే మార్గంలో దేశం మున్ముందుకు పోయేటందుకై దిశను నిర్దేశించుకుంది. ఈ నూతన శకం మార్క్సిజం-లెనినిజంపై నిర్మాణమవుతుందని మహాసభ పునరుద్ఘాటించింది.

**1.59** **సిపిసి** మహాసభ "నూతన శకం కోసం చైనా లక్షణాలతో కూడిన సోషలిజం గురించిన ఆలోచనా విధానం" అన్న నూతన భావనను ప్రతిపాదించింది. "ఈ నూతన శకంలో చైనా సమాజం ఎదుర్కొంటున్న ప్రధాన వైరుధ్యం అసమాన, అసమగ్ర అభివృద్ధికీ, మెరుగైన జీవనం వైపుగా నిరంతరం పెరిగే ప్రజల అవసరాలకూ మధ్య వున్నది. కనుక మనం ప్రజలే కేంద్రంగా ఉన్న అభివృద్ధి తత్వానికి, సర్వతోముఖ మానవాభివృద్ధికి, ప్రతీఒక్కరూ ఉమ్మడిగా అభివృద్ధి చెందడానికి కట్టుబడి వుండటాన్ని కొనసాగించాలని" మహాసభ పునరుద్ఘాటించింది.

**1.60** సంస్కరణల మార్గంలోనే కొనసాగాలని, ఆర్థిక వ్యవస్థ తలుపులు తెరచివుంచాలని, యిదే సమయంలో అసమాన, అరకొర అభివృద్ధి కారణంగా ఎదురవుతున్న తీవ్ర సమస్యలను పరిష్కరించాలని, అభివృద్ధి నాణ్యతను పెంచడంపై దృష్టిని కేంద్రీకరించాలని మహాసభ తీర్మానించింది. ఈ కాలంలోనే **చైనా కమ్యూనిస్టు పార్టీ** అవినీతిపై పెద్దయెత్తున పోరాటాన్ని నడిపింది. కొంతమంది పెద్ద నాయకులను సైతం వదిలిపెట్టకుండా శిక్షించింది. ఈ పోరాటాన్ని కొనసాగించాలని, సమస్త చెడుగులను పారద్రోలి పార్టీని బలోపేతం చేయాలని పార్టీ మహాసభ నిర్ణయించింది.

**1.61** **వియత్నాం**: సత్వరాభివృద్ధిని సాధిస్తున్న దేశాలలో ఒకటిగా వియత్నాం యిప్పటికీ కొనసాగుతున్నది. ఈ కాలంలో దాని ఆర్థిక వ్యవస్థ సగటు పెరుగుదల 6.3 శాతంగా వున్నది. అయినప్పటికీ తాను నిర్దేశించుకున్న లక్ష్యాలలో కొన్నిటిని సాధించలేకపోయింది. ప్రపంచ ఆర్థిక సంక్షోభం కారణంగా 2020 నాటికి దేశాన్ని ఆధునిక పారిశ్రామిక దేశంగా మార్చటం వంటి లక్ష్యాలను వియత్నాం చేరుకోకపోవచ్చు. ప్రపంచ ఆర్థిక సంక్షోభం ఇందుకు కారణం. దోయ్ మోయ్ (పునరుద్ధరణ) విధానాన్ని, అంటే పారిశ్రామికీకరణతో దేశాన్ని ముందుకు నడిపించాలనే విధానాన్ని కొనసాగించాలని వియత్నాం కమ్యూనిస్టు పార్టీ (**సిపివి**) 12వ మహాసభ నిర్ణయించింది. "వినూతనమైన ఆలోచనా విధానాలను కొనసాగించటం, మార్క్సిజం–లెనినిజం, హోచిమిన్ ఆలోచనా విధానాన్ని సృజనాత్మకంగా వర్తింపచేస్తూ, అభివృద్ధి చేయటం, జాతీయ స్వాతంత్ర్యం, సోషలిజం అన్న లక్ష్యానికి కట్టుబడి వుండటమూ తప్పనిసరి" అని మహాసభ నిర్ణయించింది.

**1.62** పునరుద్ధరణ విధానాన్ని అమలు చేసే క్రమంలో ఎదురైన కొన్ని యిబ్బందులను, సవాళ్ళను **సిపివి** 12వ మహాసభ గుర్తించింది. ఈ కాలంలో ప్రజల తలసరి ఆదాయం పెరిగినప్పటికీ నగరాలకూ, లోతట్టు ప్రాంతాలకూ మధ్య అసమానతలు, వ్యత్యాసాలు పెరిగాయి. పార్టీని బలోపేతం చేయడం, మార్క్సిజం–లెనినిజం, హోచిమిన్ ఆలోచనా విధానాన్ని వియత్నాం వాస్తవాలకు అనుగుణంగా సృజనాత్మకంగా వర్తింప చేయడం ద్వారా యీ విషయాలపై దృష్టిని కేంద్రీకరించాలని మహాసభ

నిర్ణయించింది.

1.63 ఇటీవలి కాలంలో **చైనా, వియత్నాం కమ్యూనిస్టుపార్టీ**లు రెండూ అత్యున్నత స్థాయి ప్రతినిధి బృందాలను పరస్పరం పంపుకుని రెండు దేశాల మధ్య వున్న వివాదాస్పద విషయాలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని నిర్ణయించాయి. ఇది ఒక సానుకూల పరిణామం. ఉభయ దేశాల మధ్య వున్న ఉద్రిక్తతలను సడలించటానికి, అదేవిధంగా పొరుగున వున్న దక్షిణ చైనా సముద్ర వివాదాలను పరిష్కరించుకోవటానికి ఇది తోడ్పడుతుంది.

1.64 **క్యూబా**: అమెరికా విధించిన అన్యాయమూ, అమానుషమూ అయిన ఆర్థిక దిగ్బంధనం కారణంగా క్యూబా యిప్పటికీ ఆర్థికంగా యిబ్బందులను ఎదుర్కొంటున్నది. ఉభయ దేశాల మధ్య దౌత్య సంబంధాలను పునరుద్ధరించే ఉద్దేశంతో మునుపటి ఒబామా ప్రభుత్వం మొదలు పెట్టిన పలు సానుకూల చర్యలను డోనాల్డ్ ట్రంప్ రద్దుచేయడం ప్రారంభించాడు. దానితోపాటే ఆర్థిక దిగ్బంధనాన్ని మరింత తీవ్రతరం చేస్తున్నాడు. వెనిజులా వంటి పలు లాటిన్ అమెరికన్ దేశాలు ఎదుర్కొంటున్న ఆర్థిక యిబ్బందులు సైతం క్యూబా ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయి. పదేపదే సంభవిస్తున్న భారీతుఫాన్‌ల వంటి ప్రకృతి విపత్తులు కూడా ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తున్నాయి. ఈ పూర్వరంగంలోనే క్యూబన్ ప్రభుత్వం, క్యూబా కమ్యూనిస్టు పార్టీ **(పిసిసి)** అధికారాన్ని పాత తరం నుంచి కొత్త తరానికి అందించే పద్ధతి పెట్టుకున్నది. రావుల్ కాస్ట్రో అధ్యక్షపదవి నుండి విరమించుకున్నారు. రాబోయేతరం ప్రతినిధిగా మిగుల్‌డెజ్ కానెల్ పదవీ భాద్యతలను చేపట్టాడు. ఈ కాలంలో మహానాయకుడు ఫైడల్ కాస్ట్రో మరణించారు. ఇన్ని యిబ్బందులు వున్నప్పటికీ క్యూబా ప్రజలు పార్టీ వెనుక ఒక్క తాటిపై నిలిచారు. సోషలిస్టు వ్యవస్థను రక్షించుకుంటామని, దేశాన్ని అస్థిరపరచటానికై సామ్రాజ్యవాదులు చేసే అన్ని ప్రయత్నాలను దృఢనిశ్చయంతో ప్రతిఘటిస్తామని ప్రతినబూనారు.

1.65 క్యూబాలో సోషలిస్టు నిర్మాణాన్నీ, ఆర్థికాభివృద్ధి మార్గాన్ని వివరించే పత్రాలను **క్యూబన్ కమ్యూనిస్టుపార్టీ** చర్చించి ఆమోదించింది. ఈ పత్రాలు భవిష్యత్తుకు, అలానే సుసంపన్నమై, స్థిరత్వం కలిగిన సోషలిస్టు సమాజ నిర్మాణానికి అవసరమైన పంథాను చూపుతున్నాయి. దేశ సంపదనూ,

ఆరోగ్యము, విద్య, సామాజిక భద్రతవంటి సామాజిక సేవలనూ ప్రైవేటీకరించే నయా ఉదారవాద విధానాలు సోషలిస్టు క్యూబాలో ఎన్నడూ అమలు చెయ్యబోమని మహాసభ తీర్మానించింది. మౌలిక వుత్పత్తి సాధనాలపై ప్రజల యాజమాన్యం దేశ ఆర్థిక వ్యవస్థ ప్రధాన రూపంగా కొనసాగుతుందని కూడా మహాసభ పునరుద్ఘాటించింది.

1.66 **ఉత్తర కొరియా** : అమెరికా బెదిరింపులను ధిక్కరిస్తూ డిపిఆర్‌కె (ఉత్తర కొరియా) తన బహుదూర క్షిపణి అభివృద్ధి కార్యక్రమంతో ముందుకు సాగుతూ అణుశక్తి క్షిపణిని అభివృద్ధి చేసింది. అమెరికా చేసే ఎలాంటి సైనిక దాడినుంచైనా ఆత్మరక్షణకు ఇదొక్కటే తిరుగులేని రక్షణ ఇస్తుందని ఉత్తర కొరియా వివరణ యిచ్చింది. కొరియా ద్వీపకల్పంలో అమెరికా తన సైనిక చర్యలను బలోపేతం చేస్తున్నది. అణ్వాయుధాలు కలిగిన దక్షిణ కొరియాతో కలసి నిరంతరం సైనిక విన్యాసాలు చేస్తున్నది. ఇంతకుముందే అమెరికా "థాడ్" అణుక్షిపణి రక్షణ వ్యవస్థను దక్షిణ కొరియాలో నెలకొల్పింది. అంతటితో ఆగకుండా కొరియా ద్వీపకల్పంలో సైనికీకరణను విస్తరించింది. ఇది నేరుగా ఉత్తర కొరియాకు ముప్పుగా పరిణమించడమేగాక ప్రజాచైనాకు సైతమూ ముప్పే.

1.67 దాదాపు అర్ధ శతాబ్దం పైబడి ఉత్తర కొరియాపై ఆంక్షలు కొనసాగుతున్నాయి. ఆహారమూ, యితర ప్రజావసరాల కోసం తమ దేశంలోని సంపన్నమైన ఖనిజ వనరులను మార్పిడి చేసుకునే అవకాశంలేకుండా చేశారు. ఈ పరిస్థితుల్లో అమెరికా–దక్షిణ కొరియా సైనిక కూటమి నుంచి ఎదురయ్యే బెదిరింపులనుండి తన రక్షణ సన్నద్ధతను బలోపేతం చేసుకోవటానికిగాను చాలా ఎక్కువ వనరులనే వ్యయం చేసింది. అయితే ఇప్పుడు దక్షిణ కొరియాతో సహకారానికిగాను కొత్తగా చొరవను ప్రదర్శించింది. శీతాకాల ఒలింపిక్స్‌లో ఉభయ కొరియాలు కలసి పాల్గొనటం శుభపరిణామం. ఇది ఉత్తర–దక్షిణ కొరియాల సంబంధాలలో ప్రతిష్టంభనను తొలగించడానికి దోహదం చేయగలదు.

1.68 **లావోస్ :** ఆసియా లోని అన్ని దేశాలకంటే లావోస్ అభివృద్ధి ఎక్కువగా ఉంది. అంటే గత దశాబ్దపు సరాసరి వృద్ధి రేటు ఏడాదికి 7% కంటే

ఎక్కువగా వృద్ధి సంవత్సరాలు గత పది సంవత్సరంలో ఎక్కువ సాధించింది. పేదరికాన్ని సగానికి సగం తగ్గించడం, ఆకలిని తగించడం, విద్యను పెంచడం, ఆరోగ్యాన్ని పెంపొందించడంలో లాఓస్ ముందు ఉంది. దేశంలో 73 శాతానికి ఉపాధి నిచ్చే వ్యవసాయం పెరుగుతున్నది, ఉపాధికి ప్రాధాన్యతనిచ్చే పరిశ్రమలను స్థాపించేందుకు చేస్తున్న ప్రయత్నాలవలన పేదరికం మరింతగా తగ్గే అవకాశాలు ఉన్నాయి.

## మన పొరుగు దేశాలు

**1.69** **పాకిస్తాన్** : ఇస్లామిక్ మత ఛాందసులకు, పాకిస్తాన్ ప్రజలకు మధ్య పోరాటం సాగుతూనే వున్నది. పెద్దయెత్తున ఉగ్రవాదదాడులు, అమాయక ప్రజల మరణాలు సంభవిస్తున్నాయి. ఆఫ్ఘనిస్థాన్ నుండి తాను ఉపసంహరించుకుంటున్నట్లు అమెరికా ప్రకటించిన తరువాత మత ఛాందస శక్తుల కార్యకలాపాల కొనసాగింపు క్లిష్టంగా మారింది. కాగా, యిప్పుడు అక్కడ సైనిక బలగాలను పటిష్టం చేయాలని డోనాల్డ్ ట్రంప్ నిర్ణయించాడు. దీని ప్రభావం పొరుగున ఉన్న పాకిస్తాన్‌పై ఏవిధంగా ఉంటుందో చూడాలి. అంతర్జాతీయ పర్యవేక్షణలో ఆఫ్ఘనిస్థాన్‌లో చర్చల ద్వారా ఒప్పందాన్ని కుదుర్చుకోవాలని ఐరాసలో పాకిస్తాన్ పిలుపు యిచ్చింది.

**1.70** రాజకీయంగా చూస్తే, పనామా పత్రాలు బయటపడటంతో అధ్యక్షుడు నవాజ్ షరీఫ్ రాజీనామా చేయవలసివచ్చింది. ఆ తరువాత సైన్యం పెత్తనం మరింత పెరిగింది. చైనాను అదుపుచేయాలన్న తన విధానంలో భారతదేశాన్ని గట్టి మిత్రునిగా ఇరికించాలని అమెరికా ప్రయత్నిస్తున్నది. అదే సమయంలో పాక్‌పై అమెరికా అప్పుడప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నప్పటికీ వాస్తవానికి ఎప్పటి సంబంధాలనే కొనసాగిస్తున్నది. కాగా, పాకిస్తాన్‌తో భారత్ సంబంధాలు మరింతగా దిగజారాయి. 2016 సెప్టెంబరు నాటి సర్జికల్ దాడులు ఉగ్రవాద దాడులను పెద్దగా తగ్గించలేకపోయాయి. జాతీయ భద్రతా సలహాదారుల సమావేశాలు మూడో దేశంలో జరుగుతున్నట్లుగా వార్తలు వస్తున్నప్పటికీ, ఉభయ దేశాల మధ్య అన్ని స్థాయిల్లోనూ చర్చలు అధికారికంగా నిలచిపోయాయి. సంబంధాలు

మెరుగుపడే సూచనలు యిప్పటిలో కనిపించటం లేదు. పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా భారత ప్రభుత్వం అనుసరించే కఠిన వైఖరి బిజెపీ – ఆర్‌ఎస్‌ఎస్‌ల హిందూత్వ జాతీయవాదానికి ఊపిరి పోస్తున్నది. పెరుగుతున్న మత విద్వేషాలు దేశీయంగా వారి బలాన్ని పెంచుకోడానికి ఊతం ఇస్తాయి.

1.71 **బంగ్లాదేశ్** : బంగ్లాదేశ్‌లో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండటంతో ఆ దేశంలో మతఛాందసవాదుల దాడులు ఎక్కువయ్యాయి. 2017 ప్రారంభంలో బంగ్లాదేశ్ ప్రధానమంత్రి షేక్ హసీనా భారతదేశ పర్యటనకు వచ్చారు. చాలాకాలం అనంతరం బంగ్లాదేశ్ ప్రభుత్వాధినేత భారత్‌లో అధికారికంగా పర్యటించారు. ఈ పర్యటన జయప్రదమైనట్లు ఉభయ దేశాలు ప్రకటించినప్పటికీ దీర్ఘకాలంగా కొనసాగుతున్న తీస్తానదీ జలాల పంపిణీ సమస్య అపరిష్కృతంగానే వుండి పోయింది. గత యుపిఏ ప్రభుత్వానికీ, షేక్ హసీనా ప్రభుత్వానికీ మధ్య కుదిరిన ఒప్పంద ముసాయిదాను పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి బహిరంగంగానే వ్యతిరేకించారు. దీనిని పరిష్కరించటానికి కేంద్ర బిజెపి ప్రభుత్వం చెప్పుకోదగిన ఏ కృషినీ చేయలేదు. భారతీయ పౌరసత్వ చట్టానికి బిజెపి ప్రభుత్వ ప్రతిపాదిత సవరణలు వాస్తవానికి భారతదేశానికి వచ్చిన హిందూ శరణార్థులకు పౌరసత్వం యిచ్చి ఇతర మతశరణార్థులకు తిరస్కరిస్తున్నాయి. ఇది రెండు దేశాల మధ్య వివాదాస్పద అంశమైంది. భారత్‌లోని హిందూత్వ ఛాందసవాదం బంగ్లాదేశ్‌లో ముస్లిం ఛాందసవాదాన్ని బలోపేతం చేస్తున్నది. 2018లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో యీ అంశం బంగ్లాదేశ్‌లో భారత వ్యతిరేక ప్రచారానికి ఆజ్యం పోయవచ్చు. దానితో మన స్నేహ సంబంధాలు మరింతగా దెబ్బతినవచ్చు.

1.72 రోహింగ్యా సంక్షోభం, అలానే బంగ్లాదేశ్‌లోకి పెద్దయెత్తున వచ్చిపడుతున్న శరణార్థుల గురించి మైన్మార్‌తో మధ్యవర్తిత్వం నెరపవలసిందిగా బంగ్లాదేశ్ చేసిన విజ్ఞప్తిపట్ల భారతదేశం మెదలకుండా వుండిపోయింది. ఈ మానవీయ సంక్షోభానికి చైనా మూడు దశల పరిష్కారాన్ని ఇటీవల చూపింది: (అ) కాల్పుల విరమణ (యిప్పుడిది అమలులో వున్నది) (ఆ) మైన్మార్, బంగ్లాదేశ్‌లు రెండూ తమ సమాచార సంబంధాలను

నిలబెట్టుకోవాలి. శరణార్థులు స్వదేశానికి మరలే విషయమై శాంతియుత పరిష్కారానికి చర్చలు కొనసాగించాలి (ఇ) సమస్యకు మూలమైన రఖైన్ ప్రాంత ఆర్థికాభివృద్ధికి దీర్ఘకాల పరిష్కారాన్ని కనుగొనాలి. చైనా విదేశాంగ మంత్రి యిటీవల బంగ్లాదేశ్ పర్యటనకు వచ్చినపుడు చేసిన ప్రతిపాదనను బంగ్లాదేశ్ ఆహ్వానించింది. బంగ్లాదేశ్ యిప్పటికే వన్ బెల్ట్ వన్ రోడ్ పథకంలో చేరటంతోపాటు, దక్షిణాసియాలో అంతర్-దేశ వివాదాలకు చైనా చూపుతున్న దౌత్య చొరవను మొట్టమొదటిసారిగా స్వాగతించింది.

1.73 **నేపాల్** : సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న రాజకీయ అనిశ్చితి, తరచుగా ప్రభుత్వాల మార్పిడి అనంతరం నేపాల్ ఎట్టకేలకు రిపబ్లికన్ రాజ్యాంగాన్ని ప్రకటించింది. దీని ప్రకారమే 2017 నవంబరులో ఎన్నికలు జరిగాయి.

1.74 ఇటీవల నేపాల్‌లో చోటుచేసుకున్న ముఖ్య పరిణామం ఏమంటే నేపాల్ కమ్యూనిస్టు పార్టీ (యుఎంఎల్), నేపాల్ కమ్యూనిస్టు పార్టీ (ఎంసి) లు ఎన్నికలలో పోటీ చేసేందుకై కూటమిగా ఏర్పడ్డాయి. రెండు పార్టీలు సిపిఎన్ (యుఎంఎల్) నాయకుడు కెపిఓజా ప్రధానమంత్రిగా ప్రభుత్వం ఏర్పాటు చేసాయి. ఇది శుభపరిణామం. ఈ కమ్యూనిస్టు కూటమి ఎన్నికల్లో బ్రహ్మాండమైన విజయాన్ని సాధించి, ఫెడరల్ పార్లమెంటులో దాదాపు మూడింట రెండువంతుల ఆధిక్యతను పొందింది. దీనితోపాటే కమ్యూనిస్టు కూటమి ఏడు ప్రాంతీయ అసెంబ్లీలకుగాను ఆరింట విజయాన్ని సాధించింది. ఈ ఫలితాలు నేపాల్‌లో రాజకీయ స్థిరత్వ క్రమంలో నూతన ప్రారంభానికి తెరతీశాయి. నేపాల్ రిపబ్లిక్ లౌకిక ప్రజాతంత్ర స్వభావాన్ని పటిష్టం చేసే దిశగా జరిగే అభివృద్ధి కేవలం నేపాల్‌లోనే కాకుండా మొత్తం దక్షిణాసియా అంతటా శాంతి, సుస్థిరతలపై దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపుతుంది. త్వరలోనే తాము ఒకేఒక కమ్యూనిస్టు పార్టీగా విలీనం కానున్నట్లు సిపిఎన్ (యుఎంఎల్), సిపిఎన్ (ఎంసి)లు ప్రకటించాయి. ఇది అత్యంత ప్రాధాన్యత కలిగిన పరిణామం.

1.75 **శ్రీలంక** : దీర్ఘకాలంగా అపరిష్కృతంగా వున్న తమిళుల సమస్యకు రాజకీయ పరిష్కారం కోసం శ్రీలంకలోని ఎస్ఎల్ఎఫ్‌పి, యుఎన్‌పి సంకీర్ణ ప్రభుత్వం ప్రస్తుతం నూతన రాజ్యాంగ ముసాయిదాను తయారు చేసే పనిలో వున్నది.

శ్రీలంక శ్రేయస్సు దృష్ట్యా సమైక్యంగా శ్రీలంకను వుంచేటందుకై తమిళ భాష మాట్లాడే ప్రాంతాలకు గరిష్ట స్వయంప్రతిపత్తి కల్పించాలని భావించడం మంచిపరిణామం. ఈ ప్రయత్నాలు సఫలం కాగలవనే ఆశించాలి. ఈ మధ్యకాలంలో బౌద్ధ మితవాదులు ముస్లింలపై దాడి చేయడం శ్రీలంక సమాజంలో వివిధ జాతుల మధ్య పొంచి ఉన్న ఉద్రిక్తతను తెలియచేస్తుంది. ఈ మధ్య జరిగిన ప్రాంతీయ ఎన్నికలలో పాలనలోఉన్న యునైటెడ్ నేషనల్ పార్టీ, యునైటెడ్ పీపుల్స్ ఫ్రీడమ్ అలియెన్స్ కూటమి మహీంద్రా రాజపక్ష యొక్క శ్రీలంక పుదుజన పెరమున చేతిలో పరాజయం పాలయ్యింది.

1.76 **భూటాన్** : డోక్లామ్‌పై యిటీవలి భారత్‌చైనాల ప్రతిష్టంభన తుట్టతుదకు పరిష్కారమైంది. తమకే విజయం లభించినట్లు ఉభయ పక్షాలు ప్రకటించాయి. భూటాన్, చైనాలు రెండూ తమదంటే తమదేనంటున్న ప్రాంతం గురించి వివాదం తలయెత్తింది.అయితే ఈ విషయంలో భూటాన్ తటస్థ వైఖరిని అవలంబించింది. భూటాన్ యిటీవల ద్వంద్వ పన్నుల తొలగింపు ఒప్పందాన్ని బంగ్లాదేశ్‌తో కుదుర్చుకున్నది. భారతదేశం కాకుండా వన్ బెల్ట్ వన్ రోడ్ అన్న దానిలో చేరని సార్క్ దేశం భూటాన్ ఒక్కటే. ఇందులో యితర దేశాలన్నీ చేరాయి. ఓబిఓఆర్ క్రమంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి చైనా వనరులు అధికంగా లభిస్తాయన్న అంచనా ఆ దేశాలకు వున్నది. అయితే ఈ ప్రాజెక్టు పట్ల భారతదేశం ప్రదర్శిస్తున్న తీవ్ర వ్యతిరేకత ముమ్ముందు యిరుగుపొరుగు సంబంధాలను సంక్లిష్టం చేసే అవకాశం వున్నది.

1.77 **మాల్దీవులు** : మాల్దీవుల్లో తీవ్రమైన పరిణామాలే చోటుచేసుకుంటున్నాయి. దేశ బహిష్కృతుడైన మాజీ అధ్యక్షుడు మొహమ్మద్ నషీద్‌ను విడుదల చేస్తూ, 2015 నాటి ఉగ్రవాద ఆరోపణల కేసులో ఆయనను నిర్దోషిగా మాల్దీవుల సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది. పన్నెండుమంది మాజీ శాసనకర్తలను పార్లమెంటు సభ్యులుగా పునర్నియామకం చేయవలసిందిగా కూడా కోర్టు వుత్తర్వులు యిచ్చింది. మాల్దీవుల అధ్యక్షుడు అబ్దుల్లా యమీన్ సుప్రీం కోర్టు తీర్పును బేఖాతరు చేయడమే గాక దేశంలో అత్యవసర

పరిస్థితిని విధించాడు. దీనితో ఎల్లెడలా నిరసనలు తలెత్తాయి. అస్థిరత చోటుచేసుకుంది. సార్క్ దేశాలలో ఒకటైన మాల్దీవుల్లో సంభవిస్తున్న పరిణామాలను సన్నిహితంగా పరిశీలించవలసి వుంది.

## కమ్యూనిస్టుల సంఘీభావం

**1.78** కమ్యూనిస్టు పార్టీల వర్కర్స్ పార్టీల అంతర్జాతీయ సమావేశం ప్రతియేటా జరుగుతుంది. మహత్తర అక్టోబరు సోషలిస్టు విప్లవ శత వార్షికోత్సవం 2017లో రష్యాలో జరిగింది. ఇది ఈ కాలంలో చెప్పుకోదగింది. అనేక దేశాలలో కమ్యూనిస్టు పార్టీల నాయకత్వంలో జరిగే ప్రజాందోళనలు పెరుగుతున్నాయి. ఇంతకుముందే చెప్పుకున్నట్లుగా, పెట్టుబడిదారీ విధానానికి రాజకీయ ప్రత్యామ్నాయాన్ని కమ్యూనిస్టు పార్టీలు, వామపక్ష పార్టీలు బలోపేతం చేయకుండా, ప్రజలలో పెరుగుతున్న అసంతృప్తిని సంఘటితపరచకుండా, పెట్టుబడి ఆధిపత్యానికి వ్యతిరేకంగా శ్రామికవర్గ నేతృత్వంలో పెరిగే వర్గపోరాటాలు పదునెక్కకుండా సామ్రాజ్యవాద ప్రపంచీకరణ రుద్దే అమానుషమైన దోపిడీకి స్వస్తిపలకలేము.

**1.79** భారతదేశంలో తనను తాను బలోపేతం చేసుకోవటం ద్వారా, ఆర్థిక, రాజకీయ తదితర రూపాలలో జరిగే ప్రపంచీకరణ దాడులకు వ్యతిరేకంగా భారత ప్రజల పోరాటాలను విస్తృతపర్చి, పటిష్టం చేయడం ద్వారా అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ భాగస్వామిగా సిపిఐ(ఎం) యీ ప్రపంచ స్థాయి పోరాటానికి తనవంతు తోడ్పాటును అందించాలి.

### సామ్రాజ్యవాద వ్యతిరేక సంఘీభావాన్ని బలోపేతం చేయాలి

**1.80** అమెరికన్ సామ్రాజ్యవాదానికి బిజెపి ప్రభుత్వం పూర్తిగా లొంగిపోవడాన్ని వ్యతిరేకిస్తూ, అమెరికన్ సామ్రాజ్యవాదపు చెప్పు చేతలలో ఉండే వ్యూహాత్మక భాగస్వామి స్థాయికి మన దేశాన్ని దిగజార్చడాన్ని వ్యతిరేకిస్తూ భారతదేశ ప్రజలలో సిపిఐ(ఎం) ముమ్మర ప్రచారం చేపట్టాలి. ఆర్థిక, వ్యూహాత్మక, రక్షణ, విదేశీ విధానం తదితర రంగాలన్నిటా వ్యక్తమౌతున్న ఈ లొంగుబాటును సిపిఐ(ఎం) వ్యతిరేకిస్తున్నది.

1.81 ఇజ్రాయెల్ ఆక్రమణను ఎదిరిస్తూ దీర్ఘకాలంగా నిరాకరించబడుతున్న "సొంతగడ్డ హక్కును" సాకారం చేసుకోడానికి పాలస్తీనా చేస్తున్న పోరాటానికి సిపిఐ(ఎం) తన పూర్తి మద్దతును కొనసాగిస్తున్నది.

1.82 ప్రస్తుత బిజెపి ప్రభుత్వం ముందుకు తెస్తున్న అమెరికా ఇజ్రాయెల్ఇండియా కూటమిని సిపిఐ(ఎం) తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది.

1.83 విడివిడి బృందాలుగా గాని, ప్రభుత్వ మద్దతుతో గాని జరిగే అన్ని తరహాల, అన్నిరకాల ఉగ్రవాదాలని సిపిఐ(ఎం) దృఢంగా వ్యతిరేకిస్తున్నది.

1.84 సోషలిస్టు దేశాలైన చైనా, వియత్నాం, ఉత్తర కొరియా, క్యూబా, లావోస్‌లకు సిపిఐ(ఎం) తన సంఘీభావాన్ని తెలుపుతున్నది. ఆయా దేశాలలో సోషలిజాన్ని బలోపేతం చేసే చర్యలకు పూర్తి మద్దతు యిస్తున్నది.

1.85 ఛాందసవాదానికీ, మత తత్వానికీ, మత మౌఢ్యానికీ, తిరోగమన భావాలకు అభివృద్ధి నిరోధక, ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా పోరాడే శక్తులన్నిటితో సిపిఐ(ఎం) సంఘీభావాన్ని ప్రకటిస్తున్నది.

1.86 ప్రపంచ వ్యాప్తంగా, ప్రత్యేకించి దక్షిణాసియా, లాటిన్ అమెరికాలలో సాగుతున్న వామపక్ష విప్లవ ఉద్యమాలతో సిపిఐ(ఎం) తన సంబంధాలను మరింత బలోపేతం చేసుకుంటుంది.

1.87 వివిధ పద్ధతులలో జరిగే సామ్రాజ్యవాదదాడులకు లక్ష్యంగా మారిన సోషలిస్టు దేశాలకు సిపిఐ(ఎం) తన పూర్తి సంఘీభావాన్ని ప్రకటిస్తున్నది.

1.88 ప్రపంచ స్థాయిలో సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలన్నిటికీ సి.పి.ఐ(ఎం) సహకారాన్ని అందిస్తుంది. నయా ఉదారవాదానికి వ్యతిరేకంగా, అమెరికన్ సైనిక జోక్యాలకు, దాడులకు వ్యతిరేకంగా, వాతావరణ, పర్యావరణ విధ్వంస ప్రమాదానికి వ్యతిరేకంగా, విశ్వవ్యాప్త పర్యావరణ న్యాయం కోసం జరిగే సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలకు సంఘీభావాన్ని ప్రకటిస్తున్నది. సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమంలో ఈ వివిధరకాల వాహినులన్నింటినీ ఒకదగ్గరకు చేర్చి బలమైన, సర్వతోముఖమైన ప్రపంచవ్యాప్త ఉద్యమాన్ని నిర్మించడం మన కర్తవ్యం.

# జాతీయ పరిస్థితి

**2.1** దాదాపు నాలుగేళ్ళ మోడీ ప్రభుత్వం మితవాద నిరంకుశ–మతతత్వ పాలనను ముందుకు తెచ్చింది. నయా ఉదారవాద విధానాలను మరింత తీవ్రంగా అమలు చేయడం, దాని పర్యవసానంగా శ్రామిక ప్రజలపై అన్ని వైపుల నుంచి దాడులు చేయడం, దేశ లౌకిక ప్రజాతంత్ర వ్యవస్థకు ప్రమాదం కల్గించే ఆర్‌ఎస్‌ఎస్ మైనారిటీలు, దళితులపై దాడులతో పాటు హిందూత్వ అజెండాను అమలుజరిపేందుకు తీవ్ర ప్రయత్నాలను చేయడం, ఫాసిస్టు దాడులకు పాల్పడడం, అమెరికాతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలపరచడం, దానికి జూనియర్ భాగస్వామి పాత్రను పోషించడం, నియంతృత్వపాలనకు రూపకల్పన చేస్తూ పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి ప్రతిబంధకాలు కల్గించడం, రాజ్యాంగ సంస్థలను బలహీనపరచడం, ప్రజాతంత్ర హక్కులను నాశనం చేయడం వంటివి ఈ పాలన స్వభావంగా ఉంది.

**2.2** పార్టీ 21వ మహాసభ రాజకీయ పరిస్థితిని ఈ కింది విధంగా అంచనా వేసింది :

"2014 మే నెలలో జరిగే లోక్‌సభ ఎన్నికలు రాజకీయ పరిస్థితిలో పెద్ద ఎత్తున మార్పులు తెచ్చాయి. కేవలం 31 శాతం ఓట్లు లభించినప్పటికీ భారతీయ జనతా పార్టీకి లోక్‌సభలో మొట్టమొదటిసారిగా పూర్తి మెజారిటీ లభించింది. ఇది నయా ఉదారవాద విధానాలను దూకుడుగా అమలు చేయడం, ఆర్‌ఎస్‌ఎస్ నేతృత్వంలోని హిందూత్వ శక్తులు తమ మతతత్వ అజెండాను పూర్తి స్థాయిలో అమలు చేయడానికి పూనుకోవడం అనే అంశాలతో కూడిన మితవాద దాడికి వేదికను తయారుచేసింది. ఈ తరుణం నిరంకుశత్వం పెరుగుదలకు సంకేతంగా ఉంది."(పేరా 2.1)

**2.3** తీర్మానం ఈ దిగువ పేర్కొన్న ప్రధాన లక్షణాలను కూడా గుర్తించింది:

(1) గత పదకొండు నెలల పాలనలో బిజెపి ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థలోని అన్ని రంగాల్లోనూ విదేశీ పెట్టుబడులను పెంచడం, మరింత ఎక్కువగా ప్రయివేటీకరణకు పూనుకోవడం, కార్మిక చట్టాలను, భూ సేకరణ చట్టాలను

నీరుగార్చడం వంటి చర్యలపై దృష్టి కేంద్రీకరించి నయా ఉదారవాద విధానాలను మరింత దూకుడుగా అమలుచేస్తున్నది.

(2) "ప్రస్తుత పరిస్థితిలో పాలక పక్షాలకు ప్రజలపై ఈ రకంగా దాడి చేసేందుకు నిరంకుశత్వం తప్పనిసరి అవసరంగా మారుతుంది."

(3) "బిజెపి ప్రభుత్వం ఏర్పడటం, ఆర్‌ఎస్‌ఎస్ వ్యూహాన్ని అమలులో పెట్టడంతో పరిస్థితిలో గుణాత్మకమైన మార్పు వచ్చింది."

(4) "గణతంత్రపు లౌకిక ప్రజాతంత్ర వ్యవస్థకు ప్రమాదం కల్గించే వినాశకర హిందూత్వ ప్రాజెక్టును ముందుకు తెచ్చేందుకు బహుముఖ దాడి ముందుకొచ్చింది."

(5) "మోడీ ప్రభుత్వం అమెరికాలో వ్యూహాత్మక సంబంధాలను బలోపేతం చేయడాన్ని తీవ్రతరం చేసింది."

(6) "ప్రజాతంత్ర హక్కులను తీవ్రంగా ఉల్లంఘించడంలోనూ, పౌర హక్కులపై దాడి చేయడంలోనూ నిరంకుశ పోకడల పెరుగుదల ప్రతిబింబిస్తోంది."

## ప్రస్తుత పరిస్థితి :

**2.4** గత పార్టీ మహాసభ యొక్క పై విశ్లేషణ రాజకీయ పరిస్థితిపై అంచనా సరైనదని గడిచిన ఈ మూడేళ్ళ కాలం ధ్రువీకరించింది. మితవాద దాడిలోని అన్ని అంశాలూ తీవ్రరూపం దాల్చినట్లు తదనంతర కాలంలో స్పష్టంఅయింది.

## ఆర్థిక పరిస్థితి :

**2.5** మోడీ ప్రభుత్వం నాలుగు సంవత్సరాల కాలంలో దేశ ఆర్థిక వ్యవస్థను సంక్షోభపు చివరి అంచుదాకా తెచ్చింది. గణాంకాలను తిమ్మినిబమ్మిని చేసి ఆర్థిక మందగమనాన్ని దాచిపెట్టేందుకు ప్రభుత్వం ఎంతగా ప్రయత్నించినప్పటికీ నిజం బయటపడింది. మెరుగ్గా కన్పించేందుకు జిడిపి శ్రేణిని సవరించారు. అలా సవరించిన జిడిపి శ్రేణిని చూసుకున్నా వృద్ధి 2015-16లోని 8 శాతం నుంచి 2017-18లో అంచనా వేసిన 6.5 శాతానికి తగ్గింది. ఇది నాలుగేళ్ల కాలంలో అతి తక్కువ వృద్ధి రేటు. స్వతంత్ర భారతదేశంలో మొట్టమొదటిసారిగా నికర ఉద్యోగిత స్థాయి 2013-14,

2016-17 మధ్య కుంచించుకుపోయినట్లు లేబర్ బ్యూరో గణాంకాలు చూపుతున్నాయి.

**2.6** ఆర్థిక వ్యవస్థలోని నిజ రంగాల్లోనూ, ప్రత్యేకించి అసంఘటిత రంగాల్లోనూ ఆర్థిక మందగమనం తీవ్రంగా ఉంది. మోడీ ప్రభుత్వపు తొలి మూడేళ్ళ కాలంలో వ్యవసాయ రంగ జిడిపి వృద్ధి రేటు సంవత్సరానికి 1.7 శాతం మాత్రమే ఉంది. ప్రభుత్వ వ్యయంలో కోతలు, మద్దతు ధరల తగ్గింపు, ప్రభుత్వ ధాన్యసేకరణలో తగ్గుదల, ఉత్పత్తి వ్యయాలు బాగా పెరగడం, వ్యవసాయ పరికరాల ఉత్పత్తులు ప్రైవేటు పరం చేయడం ఇందుకు కారణం. దీనివలన రైతుల ఆదాయాలు అంతకంతకూ దిగజారిపోయాయి. వ్యవసాయంలో వినియోగించే వివిధ సరుకులు ప్రైవేటు రంగ అధీనంలోకి పోయాయి. కొన్ని కీలక సరుకులపై పరోక్ష పన్నులు బాగా పెరిగాయి. ఉత్పత్తివ్యయాలు పెరగడానికి ఇది కారణం. పెద్దఎత్తున పంటనష్టాలు సంభవించినప్పటికీ, రైతులకు పంటల బీమా సొమ్ము నిరాకరించబడింది. అదే పంటల బీమా ప్రైవేటు బీమా కంపెనీలకు సిరుల పంట కురిపించింది.

**2.7** వస్తుతయారీ రంగానికి సంబంధించి వివిధ ఆధారాల నుండి రూపొందించిన వృద్ధి అంచనాలు పరస్పర విరుద్ధ ధోరణులను సూచిస్తున్నాయి. ఆర్థిక వ్యవస్థ సజావుగా ఉందని చూపేందుకు ఈ గణాంకాలను వక్రీకరించారనే అనుమానాలు సర్వత్రా వెల్లడవుతున్నాయి. నోట్ల రద్దు, జిఎస్‌టి అమలు వల్ల తీవ్రంగా ప్రభావితమైన అసంఘటిత, ఉత్పత్తి రంగంలోని మార్పులను స్వల్పకాలిక అధికారిక గణాంకాలు కనుగొనజాలవు. వివిధ సంవత్సరాల్లో అక్కడక్కడా కొన్ని పారిశ్రామిక విభాగాలలో కొద్దిపాటి వృద్ధి కనపడినా ముఖ్యమైన కీలక పరిశ్రమల్లో వృద్ధి రేటు గత మూడు సంవత్సరాల్లో చాలా మందకొడిగా ఉన్నట్లు పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపి-ఇండెక్స్ ఆఫ్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్) వంటి సూచీలు చూపుతున్నాయి. ఈ కాలంలో ఎగుమతులు క్రమంగా తగ్గడం ప్రారంభమయింది.

**2.8** బ్యాంకింగ్ రంగం విపరీతంగా పెరిగిన పారు బకాయిల (ఎన్‌పిఎలు) భారంతో తీవ్రంగా నలిగిపోతోంది. పెద్ద కార్పొరేట్ బకాయిదారుల పట్ల బ్యాంకులు మెతకగా వ్యవహరించాల్సి రావడం వల్ల స్థూల పారు బకాయిలు 2014లో

రూ. 2.6 లక్షల కోట్ల నుంచి 2017 సెప్టెంబర్‌లో రూ. 8.37 లక్షల కోట్లకు పెరిగాయి. నోట్ల రద్దుతో బ్యాంకుల్లో డిపాజిట్లు పెరిగిపోవడం, పరపతికి డిమాండ్ తగ్గిపోవడంతో అప్పులివ్వడం తగ్గింది. ఈ డిపాజిట్లపై వడ్డీ భారం పెరగడంతో ప్రభుత్వ రంగ బ్యాంకుల లాభదాయకత మరింతగా క్షీణించింది.

**2.9** ఆయా రంగాలకు సంబంధించిన పలు ప్రత్యేక అంశాలు ఆర్థిక మందగమనానికి అదనపు కారణాలు కాగా నోట్ల రద్దు, జిఎస్‌టి విధానం అమలు వంటి విధానపరమైన చర్యలు అన్ని ప్రధాన రంగాలపై వినాశకర ప్రభావాన్ని చూపాయి.

## నోట్ల రద్దు

**2.10** కేంద్ర ప్రభుత్వం 2016 నవంబర్‌లో రూ॥1000, రూ॥500 నోట్ల రద్దును ప్రకటించింది. ఈ చర్య అవినీతిని, నల్ల ధనాన్ని, దొంగ నోట్ల చెలామణిని నిరోధిస్తుందని, ఉగ్రవాదాన్ని అడ్డుకుంటుందని ప్రభుత్వం పేర్కొంది. నోట్ల రద్దు చర్య వల్ల చెల్లుబాటు కాకుండా చేసిన రూ. 1000, రూ. 500 నోట్లలో 98.96 శాతం తిరిగి వచ్చినట్లు రిజర్వ్ బ్యాంకు విడుదల చేసిన గణాంకాలు తెలిపాయి. కనీసం 4-5 లక్షల కోట్ల రూపాయల నల్ల ధనం చెలామణిలోకి రాకుండా నిలిచిపోతుందని ప్రభుత్వం చెప్పిన విషయం వమ్ము అయింది. వాస్తవానికి ప్రభుత్వం నోట్ల రద్దు గురించి చెప్పిన ఏ ఒక్క వాదనా నెగ్గలేదు.

**2.11** ప్రభుత్వ నియంత్రణ కిందకు రాని ఆర్థిక వ్యవస్థను కూడా ప్రభుత్వ నియంత్రణ కిందకు తేవడమే నోట్ల రద్దు వెనుక ప్రభుత్వానికి ఉన్న నిజమైన ఆకాంక్ష అని తరువాతి దశలో ప్రభుత్వమే వెల్లడిచేసింది. లాభదాయకమైన వ్యాపార అవకాశాలను అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడికి అందుబాటులోకి తెచ్చే ఉద్దేశపూర్వకమైన చర్యే నోట్ల రద్దు. వాస్తవానికి ఇది క్రెడిట్ లేదా డెబిట్ కార్డులను, ఈ-వాలెట్‌లను నిర్వహించే పెద్ద కార్పొరేట్ సంస్థలకు, బ్యాంకులకు ప్రయోజనం కల్పించే డిజిటల్ ఆర్థిక వ్యవస్థ దిశగా తీవ్ర వత్తిడితో నెట్టే ప్రభుత్వ సంస్కరణ చర్యల్లో భాగమే. మన రిటైల్ ఆర్థిక రంగంలోకి విదేశీ కార్పొరేట్లు ప్రవేశించేందుకు సహాయం చేసే ఉద్దేశ్యంతో డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వైపు మార్పుకి పూనుకుంటున్నారు. అంతేగాక, భారతీయ కార్పొరేట్లకు

మరింతగా పరపతి అందించేందుకు వనరులను సమీకరించి తద్వారా వారికి పరోక్షంగా సహాయపడేందుకు చేసిన ప్రయత్నమే ఇది. ఈ కార్పొరేట్లు అప్పులను ఎగవేసినందువల్ల ఇబ్బందుల్లో పడ్డ బ్యాంకులకు తిరిగి మూలధనాన్ని సమకూర్చేందుకు ప్రజలు డిపాజిట్ చేసిన డబ్బును ఉపయోగించారు. ఈ పెద్ద కార్పొరేట్లు చెల్లించని అప్పులను ప్రభుత్వం పారు బాకీల కింద రద్దు చేసింది.

**2.12** నోట్ల రద్దు చిన్న చిల్లర వ్యాపారులపై తీవ్రంగా ప్రతికూల ప్రభావం చూపింది. దీని ఫలితంగా అనేక చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎస్ఎంఇలు) మూతబడ్డాయి. దీంతో పెద్ద ఎత్తున ఉద్యోగాల కోత ఏర్పడింది. అసంఘటిత రంగ కార్మికుల జీవితాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. రైతులు తమ పంటలను అమ్ముకోలేకపోయారు. విత్తనాలను, ఎరువులను కొనుగోలు చేయలేకపోయారు. నోట్ల మార్పిడీ కోసం క్యూలలో నిలబడ్డవారిలో దాదాపు వంద మంది ప్రాణాలు కోల్పోయారు. సహకార బ్యాంకులపై విధించిన నిబంధనలు గ్రామీణ ప్రజలను ముఖ్యంగా కేరళ వంటి రాష్ట్రాలలో మరింతగా కష్టాలపాలు చేశాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులపై ప్రజలకున్న విశ్వాసానికి గట్టి దెబ్బ తగిలింది.

## వస్తు, సేవల పన్ను (జిఎస్‌టి)

**2.13** జిఎస్‌టిని ప్రవేశపెట్టడం కార్పొరేట్ అనుకూల చర్య. ఇది ప్రజల భారాలను పెంచింది. ఇది ప్రభుత్వ నయా ఉదారవాద దాడిలో భాగమే. జిఎస్‌టి విధానం దేశ ఫెడరల్ వ్యవస్థను బలహీనపరిచింది. ఇది రాష్ట్రాల హక్కులను దెబ్బతీసింది. పరోక్ష పన్నుల భాగాన్ని పెంచింది. జిఎస్‌టి సామాన్య ప్రజలపై, చిన్న పారిశ్రామికవేత్తలపై, వర్తకులపై, అసంఘటిత రంగ వృత్తులపై కొత్త భారాలను మోపింది. వివిధ రంగాల పరిశ్రమలను, సేవలను బాగా నష్టపరచింది. ఇందువలన ఉద్యోగాలు ఊడాయి. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలు కూడా జిఎస్‌టి బారినపడ్డాయి. ఆన్‌లైన్‌లో రిటర్న్లు వేయాల్సిరావడం చిన్న పరిశ్రమల వారికి, వర్తకులకు సమస్యలను పెంచింది. జిఎస్‌టి వల్ల అనేక వస్తువుల ధరలు తగ్గుతాయని చేసిన వాదనలకు భిన్నంగా ఈ దుష్ట పన్ను విధానం వల్ల అనేక వస్తువుల, సేవల ధరలు పెరిగిపోయాయి.

## బ్యాంకింగ్ రంగం, ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం

**2.14** బ్యాంకింగ్ రంగం భారీగా ఉన్న పారుబకాయిల భారంతో కుంగిపోయింది. ఇది గత యుపిఎ ప్రభుత్వం, ప్రస్తుత మోడీ ప్రభుత్వం పెంచి పోషించిన ఆశ్రిత పెట్టుబడిదారీ విధానపు లక్షణం. పారుబాకాయిలలో 85 శాతం వరకూ కార్పొరేట్లకు, బడాపెట్టుబడిదారులకు చెందినవే. గత మూడున్నరేళ్ళ మోడీ ప్రభుత్వ పాలనలో రూ. 2,29,082 కోట్ల మేరకు జాతీయ బ్యాంకులిచ్చిన అప్పులను రద్దు చేశారు. నిరవ్ మోడీ మరియు మీహూల్ చోక్సిలు పంజాబ్ నేషనల్ బ్యాంకులో నురూ 11,500కోట్లు మోసం చేసి దేశం వదిలి పారిపోవడం, ఆ పరిశోధన సి.బి.ఐ చేతికి రావడంతో మోడీ ప్రభుత్వ హయంలో దేశాన్ని ఆశ్రిత పెట్టుబడి ఎలా కొల్లగొడుతున్నదీ బహిర్గతం అయింది.

**2.15** ఇంకా ప్రభుత్వం ఫైనాన్షియల్ రిజల్యూషన్ అండ్ డిపాజిట్ ఇన్సూరెన్స్ బిల్లు(ఎఫ్ఆర్‌డిఐ)ను ప్రవేశపెట్టింది. ఇది ఒక ఫైనాన్షియల్ రిజల్యూషన్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తుంది. ఒక బ్యాంకును అమ్మేందుకు, విలీనం చేసేందుకు లేదా మదుపుదారుల సొమ్మును మళ్లించి వినియోగించుకునేందుకు (బెయిల్ ఇన్) ఆ కార్పొరేషన్‌కు అధికారాలు కట్టబెడుతుంది. ప్రైవేటీకరణ క్రమాన్ని వేగవంతం చేసేందుకుగాను ప్రభుత్వరంగ బ్యాంకులను మూసెయ్యడానికి గాని, విలీనం, చేయడానికి గాని వీలుగా ఈ కొత్త చట్టాన్ని, కొత్త యంత్రాంగాన్ని ప్రతిపాదించారు. బడాపెట్టుబడిదారులకు భారీగా రుణాలు సమర్పించుకున్న బ్యాంకులు డిపాజిటర్ల ఖాతాల నుండి మళ్లించిన సొమ్ముతో తిరిగి పుంజుకోడానికి ఈ 'బెయిల్ ఇన్' పద్ధతి దోహదపడుతుంది.

## ప్రైవేటీకరణ వేగవంతం

**2.16** నయా ఉదారవాద విధానాలను దూకుడుగా అమలుచేయడంలో భాగంగా మోడీ ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రైవేటీకరణను వేగవంతం చేస్తున్నది. ఇందులో మూడు పార్శ్వాలున్నాయి : (ఎ) రక్షణ ఉత్పత్తులు, రైల్వేలు, బ్యాంకింగ్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరించడం (బి) ప్రభుత్వ రంగంలోకి నూరు శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతించడం. (సి) విద్యుత్

పంపిణీ, మంచినీటి సరఫరా, రవాణా వంటి మౌలిక సేవలను ప్రయివేటీకరించడం. ఈ రకంగా భారతీయ, విదేశీ బడా పెట్టుబడికి మోడీ ప్రభుత్వం సంపదను సమకూర్చుతోంది.

**2.17** ప్రైవేటీకరణను ముందుకు తీసుకురావడంలో ప్రణాళికా సంఘాన్ని రద్దుచేసి దానిస్థాయిలో ఏర్పరచబడిన నీతి ఆయోగ్ ప్రధాన పాత్రపోషిస్తోంది. వ్యూహాత్మక అమ్మకం పేరుతో మొత్తం 235 కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలకు గాను 74 సంస్థలను మూసివేసేందుకు లేదా అమ్మేసేందుకు సిఫారసు చేసింది. 20 ప్రభుత్వ రంగ సంస్థల్లో వ్యూహాత్మక వాటాల అమ్మకానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. రైల్వేలు, బ్యాంకులు, విద్యుత్ సరఫరా కంపెనీల వంటి సంస్థలలో ప్రయివేటు భాగస్వామ్యానికి దారి తెరవాలని ఆయోగ్ పేర్కొంది.

**2.18** ప్రైవేటీకరణ ప్రక్రియ అన్ని రంగాల ప్రభుత్వ రంగ సంస్థలనూ చుట్టుముట్టింది. ప్రధాన లక్ష్యంగా రక్షణ ఉత్పత్తి రంగం ఉంది. భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్ వ్యూహాత్మక అమ్మకానికి సిద్ధంగా ఉంది. జలాంతర్గాములు, హెలికాప్టర్లు, యుద్ధ విమానాలు వగైరా ఉత్పత్తి చేసేందుకు వ్యూహాత్మక భాగస్వామ్యం కింద విదేశీ ఆయుధ ఉత్పత్తిదారులతో అనుసంధానం చేసుకునేందుకు ప్రధాన భారతీయ ప్రయివేటు కంపెనీలను ఆహ్వానిస్తున్నారు.

**2.19** ఉక్కు రంగంలో దుర్గాపూర్ ఎల్లాయ్ స్టీల్ ప్లాంటును, సేలం, భద్రావతి స్పెషల్ స్టీల్ ప్లాంట్లను అమ్మివేయనున్నారు. రైల్వేలలో రెగ్యులేటరీ అథారిటీని ఏర్పాటు చేశారు. దీని ఆధ్వర్యంలో రైలు మార్గాలను, ఇతర సేవలను ప్రయివేటు రంగానికి తెరుస్తారు. ఇప్పటికే పిపిపి నమూనా కింద 400 రైల్వే స్టేషన్లను పునర్నిర్మించే పనిని ప్రారంభించారు. బొగ్గునిక్షేపాల బ్లాక్‌లను ప్రైవేటు పార్టీలకు వేలానికి పెట్టారు. ప్రస్తుతం నడుస్తున్న బొగ్గు గనులను ప్రైవేటీకరిస్తున్నారు.

**2.20** ప్రాథమిక సేవలను ప్రైవేటీకరించడం ద్వారా మంచినీరు, విద్యుత్, రవాణా, విద్య, వైద్యం వంటి అత్యవసర, మౌలిక సేవలను మార్కెట్‌లో సరుకులుగా మార్చాలని నయా ఉదారవాదం భావిస్తోంది. ప్రత్యేకించి విద్య, వైద్య రంగాలు ప్రైవేటీకరణకు లక్ష్యంగా ఉన్నాయి. నీతి ఆయోగ్ తన మూడేళ్ళ కార్యాచరణ అజెండా ప్రకారం అన్ని స్థాయిల్లోని వైద్య సేవలను ప్రైవేటీకరించాలని

భావిస్తోంది. జిల్లా, తాలూకా స్థాయి ఆస్పత్రులలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని అది ప్రతిపాదించింది. అదే విధంగా పిపిపి నమూనా కింద 50 మంది కంటే తక్కువ మంది విద్యార్థులున్న ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు రంగానికి అప్పగించాల్సిందిగా ప్రతిపాదించింది.

## వ్యవసాయ సంక్షోభం

**2.21** గ్రామీణ భారతదేశంలోని శ్రామిక ప్రజల జీవితాలకు, ఆర్థిక కార్యకలాపాలకు సంబంధించిన ప్రతి రంగం – అంటే ఉదాహరణకు భూ సేకరణ, భూ సంస్కరణల విధానం, సాగు వ్యయాలు, ఉత్పత్తుల ధరలు, పేదలకు రుణాలు, బీమా సౌకర్యం అందుబాటు, ఆహార భద్రత, అంతర్జాతీయ వర్తకం – మోడీ ప్రభుత్వ విధానాల వల్ల తీవ్రంగా దెబ్బతిన్నాయి. వ్యవసాయ ఆర్థిక వ్యవస్థలో నగదు లావాదేవీలే ప్రధానంగా ఉన్నందున నోట్ల రద్దు రోజువారీ గ్రామీణ ఆర్థిక జీవనంపై తీవ్ర వినాశకర, ప్రతికూల ప్రభావం చూపింది. కొన్ని బిజెపి పాలిత రాష్ట్రాల్లో అన్ని రకాల పశు వధపై నిషేధం విధించడం, పశువుల వర్తకంపై ఆంక్షలు విధించడం రైతులను ప్రతికూలంగా ప్రభావితం చేశాయి.

**2.22** వ్యవసాయంలో మదుపుల ధరలు పెరగడం, తమ ఉత్పత్తులకు తగిన ధరలు లేకపోవడం వల్ల రైతులు అడకత్తెరలో పోకచెక్కలా ఇరుక్కపోయారు. మదుపుల ధరలు పెరుగుదల వలన, పంటలకు తగిన ధరలు లేకపోవడం వల్ల వచ్చిన ప్రతికూల ప్రభావం గ్రామీణ ప్రాంతాల్లో అన్ని వర్గాలపై ఒకేమోతాదులో లేదు. అందులో చాలా హెచ్చుతగ్గులున్నాయి. మదుపుల ధరలు పెరిగినందువలన అత్యధిక భారం పేద, మధ్య తరగతి రైతుల భుజాలపై పడింది.

**2.23** గత మూడేళ్ళ ధరల విధానంలో రెండు ధోరణులు కనపడుతున్నాయి. మొదటిది తమ ఉత్పత్తులకు తగినంత ధర లేకపోవడం: ధరలు తరచుగా రైతుల ఉత్పత్తి వ్యయాలకు సరిపడినంతగా కూడా లేవు. ఇక రెండవది, గతంలో ఏడాదికేడాదికి పెరుగుతూ ఉండే (తగినంతగా కాకపోయినా) కనీస మద్దతు ధరలలో ఎలాంటి పెరుగుదలా లేకుండా స్థబద్ధతలో పడిపోయాయి. కనీస మద్దతు ధరలకు సంబంధించి జాతీయ రైతుల కమిషన్ సిఫారసులను

అమలుచేస్తానని 2014 ఎన్నికల ప్రచారం సమయంలో నరేంద్ర మోడీ ప్రకటించారు. రైతుల ఉత్పత్తి వ్యయానికి 50 శాతం అదనంగా కలిపి కనీస మద్దతు ధరలు నిర్ణయించాలని ఆ సంఘం సిఫారసు చేసింది. అధికారంలోకి వచ్చిన వెంటనే బిజెపి ప్రభుత్వం ఆ వాగ్దానాన్ని నెరవేర్చడం అసాధ్యమంటూ 2015 ఫిబ్రవరిలో సుప్రీంకోర్టులో ఒక అఫిడవిట్ దాఖలు చేసింది. గత మూడేళ్ళుగా ప్రకటించిన వరి, గోధుమ మద్దతుధరలు గత ఐదేళ్ళ కాలానికి కనిష్టస్థాయిలో ఉన్నాయి.

**2.24** నయా ఉదారవాద పాలనలో దేశీయ, ప్రపంచ ధరలను అంతకంతకూ ఒకే గాటనకట్టడం పెగిరిపోయింది. దీనితో – పెద్ద ఎత్తున గుత్త మార్కెట్ వాతావరణం ఏర్పడి దాని పర్యవసానంగా కలిగే అంతర్జాతీయ ధరల హెచ్చుతగ్గులు భారతీయ వ్యవసాయ రంగంలోకి దిగబడ్డాయి. ప్రస్తుత మద్దతు ధర విధానాన్ని కుదించమని, ప్రభుత్వ సేకరణ విధానాన్ని పరిమితం చేయమని ప్రపంచ వాణిజ్య సంస్థ భారతప్రభుత్వంపై వత్తిడి పెంచుతోంది. ఆయా ఉత్పత్తులకు ఎంతెంత మద్దతునివ్వాలో నిర్ధారిస్తూ తాను విధించిన ఆంక్షలను ప్రభుత్వం అతిక్రమిస్తున్నదనే వాదనతో ప్రపంచవాణిజ్య సంస్థ ఈ విధంగా వ్యవహరిస్తున్నది. భారత ఆహార సంస్థను ప్రైవేటీకరించాలని, సేకరణ కార్యకలాపాలను నిలిపివేయాలని, అలాగే కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన దాని కంటే రాష్ట్రాలు అధికంగా బోనస్ లేదా కనీస మద్దతు ధర ఇవ్వకుండా నిరోధిస్తూ ఆదేశించాలని 2015లో శాంతా కుమార్ కమిటీ ఇచ్చిన నివేదిక సిఫార్సులను బట్టి ప్రస్తుత ప్రభుత్వ ఉద్దేశాలు వెల్లడవుతున్నాయి. కేంద్రం ప్రకటించిన మద్దత్తు ధర కంటే అధికంగా ప్రకటించిన రాష్ట్రాలలో ఎఫ్‌సిఐ సేకరణను నిలిపివేస్తామని కమిటీ హెచ్చరించింది. డబ్ల్యుటిఒ, అమెరికా ఒత్తిళ్ళతో భారత ప్రభుత్వం కోట్లాది మంది రైతులకు మద్దతు ధరలపై, ధాన్య సేకరణపై చేసిన వాగ్దానాన్ని ఉపసంహరించుకుంటుందనే దానికి ఇవి స్పష్టమైన హెచ్చరికలు.

**2.25** గ్రామీణ, వ్యవసాయ రుణాలకు సంబంధించి యుపిఎ ప్రభుత్వ విధానాల అమలును ఎన్‌డిఎ ప్రభుత్వం తీవ్రతరం చేసింది. 2000లలో చేసిన వ్యవసాయ పరపతి పునరుద్ధరణ వలన ప్రధానంగా కార్పొరేట్ గ్రూపులు,

జాయింట్ – స్టాక్ కంపెనీలు, ఇతర సంస్థలే లబ్ధి పొందాయి. మొత్తంగానే బ్యాంకింగ్ రంగం దృష్టిలో వ్యవసాయం ఒక వాణిజ్య ప్రాధాన్యతున్న కార్యకలాపంగా లేకుండా పోయింది. ఇది చాలా ఆందోళన కల్గించే అంశం. పేద, మధ్యతరగతి రైతులలో పెరుగుతున్న ఋణభారం ఆందోళన కలిగిస్తున్నది.

**2.26** కేంద్రంలోని బి జె పి ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్లకు, వ్యవసాయ వ్యాపారవేత్తలకు వారికి అనువైన, సరళీకరణ విధానాలను అవలంబిస్తున్నాయి. వాటి ఫలితంగా ఏర్పడే ఆదాయ అస్థిరత రైతుల ఆత్మహత్యలకు, వ్యవసాయ దుస్థితికి ప్రధాన కారణాలుగా మారాయి. రైతు సంఘాలు డిమాండ్ చేసినప్పటికీ సమగ్ర పంటల, ఆదాయ బీమా పథకాన్ని ప్రభుత్వం విస్మరించింది. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పిఎంఎఫ్‌బివై) కేవలం సూత్రప్రాయంగా రుణాలు తీసుకోని రైతులకు మాత్రమే వర్తిస్తోంది. చిన్న, సన్నకారు రైతులు ముఖ్యంగా దళిత, ఆదివాసీ కేటగిరీలకు చెందినవారు ప్రీమియం (పథకంలో చేరేందుకు కట్టవలసిన సొమ్ము) కట్టగలిగే పరిస్థితి లేకపోవడంతో ఆ పథకం వలన లాభం పొందలేకపోతున్నారు.

## దేశసహజ వనరులు, పర్యావరణ దోపిడీ

**2.27** మోడీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కార్పొరేట్ ప్రయోజనాలను కాపాడేందుకు, సంపన్నులకు అనుకూలమైన అభివృద్ధి అజెండాను అమలుచేసేందుకు వీలుగా ఇప్పటికే బలహీనంగా ఉన్న పర్యావరణ నియంత్రణ వ్యవస్థను, పాలనా యంత్రాంగాలను మరింత బలహీనపరిచేందుకు వాటిపై తీవ్రమైనదాడి చేస్తోంది. ప్రస్తుత యంత్రాంగం కింద వివిధ పర్యావరణ నియంత్రణలు తీవ్రంగా నీరుగార్చబడ్డాయి. పర్యావరణపరంగా ప్రాధాన్యత కలిగిన అడవీ, తీర ప్రాంతాలలో పారిశ్రామిక, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు చేపట్టడానికి పర్యావరణ అనుమతులివ్వడం సర్వసాధారణంగా మారింది. వీటివలన పర్యావరణంపై ఎటువంటి ప్రభావం పడుతుందో అంచనా వేయడం చాలా అరుదుగా జరుగుతోంది. అడవులు, తీర ప్రాంతాల్లో చివరకు వన్యప్రాణుల రిజర్వు ప్రాంతాలలో సైతం బొగ్గు గనుల వంటి ఖనిజాల తవ్వకాల కార్యకలాపాలు చేసే పరిశ్రమలకు, రోడ్లు,

ఇతర మౌలిక సదుపాయాల నిర్మాణాలకు అనుమతులను అమిత వేగంగా ఇచ్చేస్తున్నారు. అటవీ హక్కుల చట్టం, షెడ్యూల్డ్ తెగల చట్టం, వన్యప్రాణి చట్టం, కోస్టల్ జోన్ రెగ్యులేషన్లు, ఇతర చట్టపరమైన ఏర్పాట్లను కాలరాయడమో లేదా పూర్తిగా ఉల్లంఘించడమో జరుగుతోంది. ఇఐఎను రాష్ట్రాలకు బదిలీ చేయడం ద్వారా పర్యావరణ ప్రభావ అంచనా (ఇఐఎ-ఎన్విరాన్మెంట్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్)కు సంబంధించిన వ్యవస్థాగత విధానాలు నీరుగార్చబడ్డాయి. అటవీవాసులు, గిరిజనులు, మత్స్యకారులు, తదితర బలహీన వర్గాల ప్రజల జీవితాలను, జీవనోపాధిని తీవ్రంగా దెబ్బతీసే విధంగా సహజ వనరులను ఇష్టారాజ్యంగా దోచుకునేందుకు, పర్యావరణానికి తీవ్రహాని కల్గించేందుకు ద్వారాలను బార్లా తెరిచారు.

## ప్రజల స్థితిగతులు

## నిరుద్యోగం

**2.28** మోడీ ప్రభుత్వ అతి పెద్ద వైఫల్యం ఉపాధి కల్పన విషయంలో ఉంది. 2016 సెప్టెంబర్ - డిసెంబర్ మధ్య కాలంతో పోల్చినప్పుడు 2017 జనవరి-ఏప్రిల్ మధ్య కాలంలో 15 లక్షలకు పైగా ఉద్యోగాలు కోల్పోయినట్లు సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సిఎంఐఇ) గణాంకాలను బట్టి తెలుస్తోంది. ప్రతి నెలలోనూ సుమారు పది లక్షల మంది నిరుద్యోగ కార్మిక సైన్యంలో చేరుతున్నారు. వారిలో అత్యధికులకు ఉద్యోగాలు లభించడం లేదు. వారు నిరుద్యోగులుగానే ఉండిపోతున్నారు. నోట్ల రద్దు ఫలితంగా కార్మికుల భాగస్వామ్యం రేటు సగటున 2016 జనవరి-అక్టోబర్ మధ్య కాలంలోని 46.9 శాతం నుంచి 2017 ఏప్రిల్‌లో 43.5 శాతానికి పడిపోయింది. శ్రామిక భాగస్వామ్యం రేట్లు పడిపోవడానికి నోట్ల రద్దు షాక్‌తో పాటు నూతన పెట్టుబడుల కొరత, ఆర్థిక మందగమనం ప్రధాన కారణాలు. ఇది నిరుద్యోగుల సంఖ్య పెరగడానికి కారణమైంది. భారతదేశానికి సంబంధించి 2017లో ఒఇసిడి ఆర్థిక సర్వేను అనుసరించి 15-29 సంవత్సరాల మధ్య ఉన్న యువతలో 30 శాతం మందికి ఉపాధి లేదా విద్య లేదా శిక్షణ వంటివి లేవు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద పని రోజులను తగ్గించడంతో గ్రామీణ నిరుద్యోగంలో సంక్షోభం మరింత తీవ్రతరమైంది. ఐటి రంగంలో

పెద్ద ఎత్తున ఉద్యోగుల తొలగింపు ఒక కొత్త పరిణామం. ఆ రంగంలో వేలాది మంది ఉద్యోగాల నుండి తొలగించబడ్డారు.

## అసమానతలు

సరళీకరణ ప్రారంభమైన 25 సంవత్సరాల అనంతరం ప్రపంచంలోని అత్యంత అసమానతలున్న సమాజాల్లో భారతదేశం ఒకటిగా మారింది. జనాభాలో ఒక్క శాతంగా ఉన్న అత్యంత సంపన్నవంతులైన భారతీయుల వద్ద దేశ సంపద మొత్తంలో 28 శాతం ఉన్నట్లు జాతీయ శాంపుల్ సర్వే ఆర్గనైజేషన్ సేకరించిన గణాంకాల ఆధారంగా 2016లో నిర్వహించిన ఒక అధ్యయనం వెల్లడించింది. 1991లో అది 11 శాతంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో అత్యున్నత స్థాయిలో ఉన్న 10 శాతం మంది వద్ద ఉన్న సగటు ఆస్తులు అట్టడుగున ఉన్న 10 శాతం వారి వద్దనున్న సగటు ఆస్తుల కంటే దాదాపు 228 రెట్లు అధికం. అదే పట్టణ ప్రాంతాలలోని ఎగువ 10 శాతం మంది వద్దనున్న సగటు సంపద దిగువ 10 శాతం మంది వద్దనున్న దానికంటే దాదాపు 50 వేల రెట్లు అధికంగా ఉంది. ఆస్తుల పంపకంలోని అసమానతలు పట్టణ ప్రాంతాల్లో చాలా స్పష్టంగా కన్పిస్తున్నాయి. ఎగువ స్థాయి 10 శాతం మంది దగ్గర మొత్తం ఆస్తుల్లో 63 శాతం ఉండగా గ్రామీణ ప్రాంతాల్లోని ఎగువ స్థాయిలోని 10 శాతం మంది దగ్గర 48 శాతం ఉంది.

**2.29** ఈ మధ్యనే వెలువడిన ఆక్సఫామ్ నివేదిక ప్రకారం పై ఒక్క శాతం దేశంలో 2017 లో సమకూర్చబడిన అదనపు సంపదలో 73% పొందారు.

## ఆహార భద్రత, ఆధార్

**2.30** లక్షలాది కుటుంబాలను ప్రజా పంపిణీ వ్యవస్థ నుంచి మినహాయించేందుకు ఆధార్ బయోమెట్రిక్ గుర్తింపును తప్పనిసరి చేయడం ఒక సాధనంగా మారింది. బయోమెట్రిక్ ప్రమాణీకరణ, ఆధార్ కార్డు నమోదు విఫలమైనందున పెద్ద సంఖ్యలో పేద ప్రజలకు రేషన్ అందడం లేదు. రేషన్ సరఫరా తిరస్కరణ జార్ఖండ్, తదితర ప్రాంతాలలో ఆకలి మరణాలకు

దారితీసింది. ఆహార భద్రతా చట్టంలోని అనేక ఏర్పాట్లను పలు రాష్ట్రాలలో సక్రమంగా అమలుచేయడం లేదు. కేంద్ర మార్గదర్శకాలు పెద్ద సంఖ్యలో అర్హతగలిగిన ప్రజలకు ప్రాధాన్యతా హోదాను లేకుండా చేస్తున్నాయి. ఇది కేరళలో ప్రజా పంపిణీ వ్యవస్థను దెబ్బతీస్తోంది. ఇవన్నీ కూడా ప్రజల ఆహార భద్రతను పెద్దఎత్తున నిరాకరిస్తున్నాయి.

**2.31** మొత్తంగా ఆధార్ నిఘాకు సమగ్ర విధానంగా మారింది. పౌరుల గోప్యత హక్కును ఉల్లంఘించేదిగా ఉంది. పైగా యుఐడిఎఐ సమాచారాన్ని వాణిజ్యపరంగా వాడుకునేందుకు వీలుగా ప్రైవేటు శక్తులకు అందుబాటులో ఉంచుతున్నారు.

## పెట్రోల్, డీజిల్ ధర పెరుగుదల

**2.32** మోడీ ప్రభుత్వం గత మూడేళ్ళలో పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాలను తొమ్మిదిసార్లు పెంచడంతో 2014 నుంచి అంతర్జాతీయ చమురు ధరలు బాగా తగ్గినప్పటికీ, దాని నుంచి వచ్చే ప్రయోజనాలను ప్రజలు పొందలేకపోయారు. ఒక లీటరు పెట్రోల్ ధరలో పన్నుభాగం రూ. 21.48 కాగా, లీటరు డీజిల్‌లో పన్ను భాగం రూ. 17.33 ఉంది. ఇప్పుడు అంతర్జాతీయ చమురు ధరలు పెరుగుతుండటంతో పెట్రోల్, డీజిల్ ధరలు మళ్ళీ పెరుగుతున్నాయి. కాని ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించి తద్వారా ప్రజలకు వెసులుబాటు కల్పించేందుకు ప్రభుత్వం తిరస్కరిస్తోంది.

## కార్మికులపై దాడులు

**2.33** తన నయా ఉదారవాద విధానాల అమలు లక్ష్యంతో బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం కార్మికులపై దోపిడీని తీవ్రతరం చేసేందుకు వీలు కల్పిస్తూ పలు చర్యలు చేపట్టింది. యజమానులకు ప్రయోజనం కల్పించేందుకు, 'వ్యాపారాన్ని సులభతరం చేయడాన్ని' మెరుగుపరిచేందుకు కార్మిక చట్టాలను సవరించే ప్రక్రియను వేగవంతం చేసింది. అప్రెంటిస్ (సవరణ) చట్టం, కార్మిక చట్టాన్ని సవరణ చట్టాన్ని ఇప్పటికే అమలులోకి తెచ్చింది. వేతన బిల్లుపై రూపొందించిన నిబంధనలను పార్లమెంటులో ప్రవేశపెట్టింది. పారిశ్రామిక సంబంధాలు, సామాజిక భద్రత హక్కుతో ప్రతిపాదించిన

నిబంధనలు సంఘంగా ఏర్పడే హక్కును, ఉమ్మడి బేరసారాల హక్కును, సామాజిక భద్రతతో సహా కార్మికుల ప్రాథమిక హక్కులను కాలరాసేవిగా ఉన్నాయి. పలు బిజెపి పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను పై విధంగా సవరించాయి. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలూ అదే విధంగా చేయాలని భారత ప్రభుత్వం ఆదేశించింది.

సంఘటిత రంగంలో కాంట్రాక్టు, క్యాజువల్ కార్మికుల సంఖ్య పెరిగిపోయింది. ప్రభుత్వం నియమితకాల ఉద్యోగాలకు అన్నిరంగాలలో నియమించుకునేందుకు అనుమతినిచ్చింది. ఫలితంగా కార్మికుల పనిక్రమానికి సర్వీసు కొనసాగింపుకు అంతరాయం ఏర్పడుతుంది. అందువలన కార్మికుల కాంట్రక్టు పద్దతి పెరుగుతుంది. కార్మిక బ్యూరో ఐదవ వార్షిక ఉద్యోగ-నిరుద్యోగ సర్వే నివేదిక 2015-16(2015 ఏప్రిల్, డిసెంబర్ మధ్య నిర్వహించబడింది)ను అనుసరించి దేశంలోని 77 శాతం కుటుంబాల్లో క్రమ పద్ధతిలో కూలి లేదా జీతం వచ్చే వ్యక్తి ఒక్కరు కూడా లేరు. క్రమ పద్ధతిలో కూలి లేదా జీతాలు వచ్చే కార్మికులలో 57.2 శాతం నెలకు రూ.10 వేల కంటే తక్కువ సంపాదిస్తున్నారు. కాంట్రాక్టు కార్మికులలో 38.5 శాతం క్యాజువల్ కార్మికులలో 59.3 శాతం నెలకు రూ.5,000 కంటే తక్కువ వేతనాలు పొందుతున్నారు.

**2.34** అనేక రాష్ట్రాలలో పెద్ద సంఖ్యలో వలస కార్మికులు ఉన్నారు. వారికీ ఏ విధమయిన ప్రాథమిక హక్కులు లేవు. సామాజిక భద్రత లేదు. వివక్షతను ఎదుర్కొంటున్నారు.

**2.35** 2013-14లో 25.8శాతంగా ఉన్న మహిళా కార్మికుల సంఖ్య ఇప్పుడు 23.7 శాతానికి పడిపోయింది. లక్షలాది కార్మికులను ముఖ్యంగా ప్రభుత్వ స్కీముల్లో పనిచేస్తున్న మహిళలను 'కార్మికులు'గా గుర్తించేందుకు, వారికి కనీస వేతనం చెల్లించేందుకు, సామాజిక భద్రతా ప్రయోజనాలను కల్పించేందుకు ఐఎల్‌సి చేసిన సిఫార్సును అమలుచేసేందుకు ప్రభుత్వం తిరస్కరిస్తోంది. ఈ స్కీమ్‌లను ప్రైవేటీకరించేందుకు, రద్దు చేసేందుకు చర్యలు చేపడుతోంది.

**2.36** నోట్ల రద్దు మూలంగా లక్షలాది మంది కార్మికులు తమ ఉపాధిని, ఆదాయాలను కోల్పోయారు. 2016 అక్టోబర్, 2017 అక్టోబర్ మధ్య కాలంలో 90 లక్షల ఉద్యోగాలు పోయినట్లు సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సిఎంఐఇ) వెల్లడించిన గణాంకాలు తెలుపుతున్నాయి. పెద్ద సంఖ్యలో లిస్టెడ్ కంపెనీలు 2016–17లో తమ ఉద్యోగుల సంఖ్య తగ్గినట్లు చూపుతున్నాయి.

## మహిళల స్థితిగతులలో తిరోగమనం

**2.37** మహిళల ఆర్థిక స్వాతంత్ర్యం, భద్రత, స్వయం ప్రతిపత్తికి సంబంధించిన హక్కులలో తిరోగమనం గత నాలుగేళ్ళుగా కన్పించింది. మహిళలపై లైంగిక, మతపరమైనదాడులు, గృహ హింస, సైబర్ నేరాలు, దళిత మహిళలపై కుల ఆధారిత హింస పెరిగిపోయింది. 2016లో రోజుకు సగటున 106 అత్యాచార కేసులు నమోదవుతున్నాయి. 2015లో మహిళలపై జరిగిన నేరాల కంటే 2.9 శాతం పెరిగింది. చాలా ఆందోళన కల్గించే అంశమేమంటే బాలికలపై అత్యాచార కేసులు అత్యధికంగా అంటే 82 శాతం పెరిగాయి. పని ప్రదేశంలో మహిళల వేధింపులు అమితంగా పెరిగిపోయాయి. వికలాంగ యువతుల, పిల్లల పట్లకూడా హింస పెరిగింది. అయితే శిక్షల విధింపు రేటు మాత్రం తక్కువ స్థాయిలోనే ఉండిపోయింది. మరోవైపు ఐపిసిలోని సెక్షన్ 498ఎ వంటి మహిళల రక్షణ చట్టాలను నీరు గార్చాలని చూస్తున్నారు. నిర్భయనిధిని తక్కువగా ఉపయోగిస్తున్నారు. మహిళల భద్రతకు, వర్మ కమిషన్ సిఫార్సుల అమలుకు ప్రాధాన్యతనివ్వడంలో మోడీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది.

**2.38** తమ ఆర్థిక, సామాజిక హక్కులపై ద్విముఖ దాడి జరగడంతో పేద, షెడ్యూల్డ్ కులాల, మహిళలు, ఆదివాసీ మహిళలు అత్యంత దుర్బలులుగా మారారు. ఆధార్ సమస్యల వలన వితంతువులు, వృద్ధులు పెన్షన్ పొందలేక పోతున్నారు. ధరల పెరుగుదల, ఆహార భద్రతను బలహీనపరచడం, స్వయం సహాయ మహిళా గ్రూపుల అవసరాలను దారుణంగా నిర్లక్ష్యం చేయడం మహిళలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్న అంశాలు. వ్యవస్థాగత రుణాలు అందకపోవడం వల్ల వారు అధిక వడ్డీలు వసూలు చేసే వడ్డీవ్యాపారుల, మైక్రోఫైనాన్స్ సంస్థల

కబంధ హస్తాలలో నలిగిపోతున్నారు. ఈ కాలంలో ఎక్కువమంది మహిళలు ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్నప్పటికీ ఉద్యోగాల కొరత వల్ల పనులలో వారి భాగస్వామ్యం రేట్లు పడిపోయాయి. నోట్ల రద్దువల్ల అసంఘటిత రంగంలోని మహిళలు తీవ్రంగా ప్రభావితమయ్యారు. వీటికి తోడుగా ఎన్.ఎమ్.ఆర్.జి.ఇ.ఏ. పథకం కింద పనులు గణనీయంగా తగ్గుతున్నాయి.

**2.39** మత విశ్వాసాలు, సంప్రదాయాలు ముసుగులో హిందూత్వ సిద్ధాంతాలు దూకుడుగా మహిళలలో అమలు చేయబడుతున్నాయి. బాలికల పై నైతిక పర్యవేక్షణలు, హెచ్చరికలు జారీ చేసే బృందాలు, రాష్ట్ర ప్రభుత్వమే గుర్తించిన రోమియో వ్యతిరేక బృందాలు వగైరా ఏర్పాటుచేయడం ప్రోత్సహించడాలలో ఇది ప్రతిబింబిస్తుంది. గృహ హింస, పిఎన్‌డిఒ చట్టాలను నీరుగార్చే శాసనాలు తెచ్చేందుకు చేసే ప్రయత్నాలు గర్భం, గర్భస్థ పిండ నిర్ధారణ పరీక్షల చట్టం 1994 (పి ఎన్ డి టి చట్టం) ఇందులో భాగమే. ఈ ప్రయత్నాలను ప్రజాతంత్ర మహిళా ఉద్యమాలు తీవ్రంగా ప్రతిఘటించాయి. పర్సనల్ చట్టాల్లో న్యాయం కోసం జరుగుతున్న ముస్లిం మహిళా పోరాటాలను హైజాక్ చేయాలని హిందూత్వ శక్తులు ప్రయత్నిస్తున్నాయి. నానాటికీ పెరిగిపోతున్న కుల దురహంకార హత్యలకు వ్యతిరేకంగా చట్టం చేయడానికి ప్రభుత్వం తిరస్కరిస్తోంది. గౌరవ 'హత్యలని చెప్పబడే వాటికి వ్యతిరేకంగా ఎలాంటి చట్టం చేసేందుకు కూడా ప్రభుత్వం తిరస్కరిస్తున్నది. మొత్తంగా ఆర్ఎస్ఎస్, దాని అనుబంధ సంస్థలు సాగిస్తున్న మతతత్వ దాడి మైనారిటీ మత ఛాందస శక్తుల పెరుగుదలకు దారితీసింది. మహిళల సమాన పౌరసత్వ హక్కులు రెండు వైపుల నుంచీ జరిగే దాడులకు లక్ష్యంగా మారాయి.

**2.40** మోడీ ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లును ఆచరణలో అటకెక్కించింది. ఈ అన్ని సమస్యలపైనా, మహిళల హక్కులు, స్థితిగతుల రక్షణకు ప్రజాతంత్ర మహిళా సంఘాలు ముందు పీఠీన నిలిచాయి. చాలాకాలంగా ఆర్ ఎస్ ఎస్ 'కుటుంబాలను విచ్ఛిన్నం' చేస్తుందన్న నెపంతో రిజర్వేషన్ లకు వ్యతిరేకిస్తూనే ఉన్నది.

## దళితులు : దిగజారుతున్న పరిస్థితి

**2.41** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నయా ఉదారవాద సంస్కరణలను దూకుడుగా అమలుచేయడం వల్ల, అందరికన్నా ఎక్కువగా దెబ్బతిన్నది దళితులు. సామాజిక సంక్షేమానికి, పేదరిక నిర్మూలన కార్యక్రమాలకు, విద్యకు, ఆరోగ్యానికి బడ్జెట్ కేటాయింపులు బాగా తగ్గిపోవడంతో పేదల, ముఖ్యంగా దళితుల జీవనోపాధులు సర్వనాశనం అవుతున్నాయి. ఎన్‌డిఎ ప్రభుత్వం కేంద్ర బడ్జెట్ నుండి ఎస్సీ, ఎస్టీ కాంపోనెంట్ ప్రణాళికను తొలగించడం ఈ తరగతుల అభివృద్ధికి తీవ్ర విఘాతం. ఉపాధిరహిత వృద్ధి, ప్రభుత్వ ఉద్యోగాలలో కూడా శాశ్వత నియామకాలపై నిషేధం, ఉద్యోగాల కాంట్రాక్టీకరణ, అన్నింటా ప్రైవేటీకరణ, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు లేకపోవడం– ఇవన్నీ బలహీన వర్గాలకు రిజర్వేషన్లు లేకుండా చేస్తున్నాయి. దీనివల్ల విద్యావంతులైన దళిత యువకులో నిరుద్యోగం ఆందోళనకర స్థాయికి చేరింది. ఎస్ సి, ఎస్ టిలలో ఎక్కువమందికి ఆధార్ లేనందువలన ఉపకారవేతనాలు నిరాకరించబడుతున్నాయి.

**2.42** దళితులపై నేరాలు అడ్డూ అదుపూ లేకుండా పెరిగిపోతున్నాయి. దళితులపై అత్యాచారాలు 2015–2017 మధ్యకాలంలో క్రమంగా పెరిగాయి. దళితులపై జరుగుతున్న దాడులన్నీ ఎఫ్ ఐ ఆర్ లో నమోదు కావడం లేదు. వాస్తవంగా ఈ నేరాల సంఖ్య ఎక్కువగా వుంది. ప్రాచీన భారతీయ సంస్కృతి పేరిట హిందుత్వ శక్తులు కుల దురభిమానాలను నిస్సిగ్గుగా ప్రోత్సహించడం వల్ల బరితెగించిన అగ్రకులాలవారు దళితులపై వివక్షను, అత్యాచారాలను నిర్భయంగా సాగిస్తున్నారు. ఎస్ సి, ఎస్ టి దాడులను నిలువరించే చట్టాలలోని విభాగాలను సుప్రీమ్ కోర్ట్ నిర్వీర్యం చేయడంతో పరిస్థితి మరింత విషమించింది. గోరక్షకుల దాడులకు దళితులు లక్ష్యాలుగా మారారు. అన్ని రకాల పశువుల వధను నిషేధించడం, పశువుల వ్యాపారాన్ని అడ్డుకోవడం వల్ల తోలుఉత్పత్తి, సంబంధిత వ్యాపారంలో ఉన్న ఎంతోమంది దళితుల జీవనోపాధిని దెబ్బతీసింది. దళితులు మలాన్ని మోయటంపై చట్టపరమయిన నిషేధం ఉన్నట్టు ఆదేశాలు ఉన్నప్పటికీ అవమానకరమైన అప్రతిష్టాకరమైన ఈ అలవాటు కొనసాగుతూనే ఉన్నది. ఇది ప్రభుత్వానికి ఈ పద్ధతులను నిషేధించాలన్న చిత్తశుద్ధి లేదని తెలియచేస్తున్నది.

**2.43** కుల వివక్ష, నిత్యం జరుగుతున్న అణచివేత, ప్రభుత్వ విధానాల ఫలితంగా పెరుగతున్న వెనుకబాటుతనం – ఇవన్నీ దళితుల్లో అసంతృప్తికి, ఆగ్రహానికి దారితీస్తున్నాయి. అత్యాచారాలకు, వేధింపులకు వ్యతిరేకంగా పెరుగుతున్న ప్రతిఘటనలో వారి ఆగ్రహం వెల్లడవుతోంది. అంబేద్కర్ భవనం కూల్చివేతకు వ్యతిరేకంగా ముంబయిలో జరిగిన సమీకరణ, ఉనా కొరడా దెబ్బల సంఘటనకు వ్యతిరేకంగా సాగిన విస్తృత ఉద్యమం, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో వ్యవస్థీకృతమైన కులవివక్ష కారణంగా జరిగిన రోహిత్ వేముల హత్యకు నిరసనగా దేశవ్యాప్తంగా సాగిన ఉద్యమం, పశ్చిమ యుపిలో దళితులపై సాగిన దాడులకు వ్యతిరేకంగా భీమ్ ఆర్మీ చేసిన సమీకరణ, భీమ్–కోరేగావ్ వార్షికోత్సవానికి హాజరైన దళితులపై జరిగిన దాడులకు నిరసనగా మహారాష్ట్రలో జరిగిన బంద్ ఎస్ సి, ఎస్ టి చట్ట నిబంధనలను పలచన చేసే చర్యలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా బంద్ జరగడం వంటి సంఘటనలు పెరుగుతున్న ఈ ప్రతిఘటనకు కొన్ని ప్రధాన ఉదాహరణలు.

**2.44** ప్రజలను మత ప్రాతిపదికన విభజించే తన ప్రాజెక్టులో భాగంగా అంబేద్కర్ వారసత్వాన్ని వినియోగించుకోవడానికి బిజెపి–ఆరెస్సెస్ ప్రయత్నిస్తున్నాయి. అంబేద్కర్ హిందూత్వ సమర్థకుడని, ఇస్లాం వ్యతిరేకి అని చిత్రించడం ద్వారా మత ప్రాతిపదిక దళితులను, ప్రభావితం చేసేందుకు బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు ప్రయత్నిస్తున్నాయి. అన్ని ప్రజాతంత్ర, లౌకిక శక్తులు ఈ విన్యాసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఈ శక్తుల దుష్ట పన్నాగాలను బట్టబయలు చేయాలి. హిందూత్వ మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా జరిగే మన పోరాటంలో సామాజిక న్యాయ లక్ష్యం కోసం దళితులు, ఇతర బలహీన సెక్షన్లను సమీకరించడం ముఖ్యమైన కర్తవ్యంగా ఉండాలి.

## ఆదివాసీ హక్కులపై దాడి

**2.45** హిందూ మతము, హిందుత్వ సిద్ధాంతాలను గుప్పిస్తూ గిరిజన అస్థిత్వాన్ని జీవన విధానాలను హిందూత్వపు ఏకరూప స్వభావానికి మార్చేందుకు హిందూత్వ వాదులు దాడిచేస్తున్నారు. బ్రాహ్మణవాద చారిత్రిక దృకోణంకి అనుగుణంగా ఆదివాసీలను వనవాసులుగా సంభోధిస్తున్నారు. అదే

సమయంలో వ్యాపారాన్ని సులభతరం చేసే పేరిట ఆదివాసీ ఆవాస ప్రాంతాల్లో నయా ఉదారవాద పెట్టుబడిదారీ విధానాలను ఉధృతంగా అమలు చేస్తున్నారు. చిన్నతరహా అటవీ ఉత్పత్తులను గిరిజనులకు అందుబాటులో లేకుండా చేయడంతో సహా వారి సాంప్రదాయిక జీవనోపాధులకు సైతం అంతరాయం కల్గిస్తున్నారు. దీనివల్ల బిజెపి పాలన కింద భారతదేశంలోని అత్యధిక ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఆదివాసులకు నిలువ నీడలేకుండాపోతుంది. వారు వలసలుపోతున్నారు. ఆదివాసీ తెగలను క్రూరమైన పద్ధతులలో కూలీలుగా మార్చివేస్తున్నారు. దీర్ఘకాలంలో ఇది ఆయా తెగల ప్రజలపై వినాశకరమైన ప్రభావం చూపుతుంది. వారు ఆర్థికంగా నిరాధారులవుతున్నారు. ఆహార భద్రత లేకుండాపోవడం, హీనమైన ఆరోగ్య పరిస్థితి ఏర్పడటం, పోషకాహార లోపం పెరగడం వంటివి సంభవిస్తున్నాయి. ఆదివాసీ బాలికల, బాలుర హాస్టళ్ళ పరిస్థితి శోచనీయంగా ఉంది. ఉపకార వేతనాల కోసం నిధుల విడుదలలో క్షమించరాని జాప్యం, అందుకు నిధులు పెంచేందుకు తిరస్కరించడం వంటివి ఆదివాసీ విద్యార్థుల పట్ల ప్రత్యక్ష వివక్షకు రూపాలు. ఈ కీలకమైన సమస్యలపై పోరాటాలు నిర్మించాల్సి ఉంది. వీరిలో చాలామంది ఎస్ టి సర్టిఫికట్ ఇవ్వడంలో జాప్యం కారణంగా ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి సంక్లిష్ట సమస్యలపై పోరాటాలను నిర్మించాలి.

**2.46** సిఎఎంపిఎ (కాంపెన్సేటరీ అఫారెస్టేషన్ ఫండ్ మేనేజ్‌మెంట్ అండ్ ప్లానింగ్ అథారిటీ యాక్ట్)ను ప్రవేశపెట్టడం, ఖనిజాలు, గనుల (నియంత్రణ, అభివృద్ధి) చట్టానికి గిరిజన వ్యతిరేక సవరణలు ప్రతిపాదించడం వల్ల గిరిజనుల భూములు లాక్కోవడానికి ఆమోదం లభించింది. ఇది పెద్ద ఎత్తున ఆదివాసులు నిర్వాసితులవడానికి దారితీస్తుంది. జార్ఖండ్‌లో బిజెపి ప్రభుత్వం గిరిజన భూములను స్వాధీనం చేసుకోవడానికి వీలుగా ఛోటానాగపూర్, సంతాల్ పరగణాల కౌలు చట్టాలను సవరించేందుకు ప్రయత్నించింది. ఆదివాసుల ఉమ్మడి పోరాటాలతో ఆ సవరణలను ఉపసంహరించుకున్నప్పటికీ మళ్లీ కొత్త రూపాలలో ఆ సవరణలు తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. గ్రామ సభల పాత్రను తొలగించేందుకు నిబంధనల్లో అదనపు మార్పులు చేయడం ద్వారా కీలకమైన అటవీ హక్కుల చట్టాన్ని బలహీనపరిచేందుకు

ప్రయత్నిస్తున్నారు. షెడ్యూల్ ప్రాంతాలకు పంచాయత్‌ల విస్తరణ చట్టం పెసా(పిఇఎస్ఎ)ను, అందుకు సబంధించి ఐదవ షెడ్యూల్‌లోని ఏర్పాట్లను నీరుగార్చడం వంటి చర్యలు మోడీ ప్రభుత్వానికి ఆదివాసీల రాజ్యాంగ హక్కులపట్ల ఉన్న విద్వేషాన్ని ఎత్తి చూపుతున్నాయి.

ఆర్థిక, న్యాయ, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో ఆదివాసీల హక్కులపై బిజెపి నేతృత్వంలోని మోడీ ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని వైపుల నుంచి సాగిస్తున్న దాడికి నిరసనగా తమ హక్కుల రక్షణ కోసం ఈ కాలంలో ఆదివాసీల మిలిటెంట్ పోరాటాలు జరిగాయి. వీటిలో అనేక ఆందోళనలు పోలీసు నిర్బంధాన్ని, కాల్పులను సైతం ఎదుర్కొన్నాయి. మావోయిస్టులను మట్టుపెట్టడం పేరుతొ రాష్ట్ర బలగాలు అమాయక ఆదివాసీలను,మహిళలతో సహా, తప్పుడు కేసులు పెట్టి జైళ్లలో పెడుతున్నారు; మావోయిస్టు రాజకీయాలను వ్యతిరేకిస్తూనే ప్రజాతంత్ర హక్కుల కోసం రాష్ట్రాల అణచివేతలకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించవలసి ఉంది.

**2.47** మావోయిస్టులపై పోరాటం పేరుతొ రాష్ట్ర బలగాలు అమాయక ఆదివాసీలపై, తప్పుడు కేసులు పెట్టి అరెస్టుచేస్తున్నారు. నిర్బంధం ప్రయోగిస్తున్నారు. గిరిజన మహిళలపై అత్యాచారాలకు పాల్పడుతున్నారు. మావోయిస్టు రాజకీయాలను వ్యతిరేకిస్తూనే ప్రజాతంత్ర హక్కుల కోసం రాజ్యం అణచివేతలకు వ్యతిరేకంగా ప్రజలను, సమీకరించవలసి ఉంది.

## ముట్టడిలో మైనారిటీలు

మితవాద మతతత్వ దాడి ముస్లిం మైనార్టీలలో భయాన్ని, అభద్రతా వాతావరణాన్ని సృష్టించింది. బిజెపి పాలిత రాష్ట్రాలలో గోరక్షకులనబడేవారు ముస్లిం పురుషులపై, బాలురపై చిత్రహింసలు సాగిస్తున్న సందర్భాలలో రాష్ట్ర పాలనా యంత్రాంగం అనుసరిస్తున్న స్పష్టమైన పక్షపాత వైఖరి ముస్లింములలో అభద్రతను పెంచుతోంది. ఉత్తర ప్రదేశ్ వంటి బిజెపి పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు కబేళాలను, చిల్లర మాంసం దుకాణాలను మూసివేయడం ద్వారా లక్షలాది మంది ముస్లింల జీవనోపాధిపై దాడికి పాల్పడుతున్నాయి. అన్ని రకాల పశువధను నిషేధించడం వల్ల పశువుల వ్యాపారంలోను, మాంసం

వ్యాపారంలోను ఉన్న ముస్లింల జీవనోపాధి దెబ్బతింటున్నది.

**2.48** పలు ప్రాంతాలలో మధ్య ప్రదేశ్, జార్ఖండ్ వంటి బీజేపీ పాలిట రాష్ట్రాలలో క్రిస్టియన్ చర్చిలు, కూటములు దాడులు జరుగుతున్నాయి. ముఖ్యంగా వారిని 'ఉగ్రవాదులు', 'దేశ ద్రోహులు' అని ముద్రవేసి అమాయక ముస్లిం యువతపై ప్రభుత్వమే (యుఎపిఎ) చట్టవ్యతిరేక కార్యక్రమాల నిరోధక చట్టం వంటి రాజద్రోహం చట్టాలను వివక్షాపూరితంగా ఉపయోగిస్తోంది. ఈ అణచివేత వాతావరణం ముస్లిం మత ఛాందసవాదం, ఉగ్రవాదం పెరగడానికి తోడ్పడుతోంది. ముస్లింలపై సాగుతున్న వేధింపులు, వారిని తమ దాడులకు లక్ష్యంగా చేసుకోవడం వంటి అన్ని సమస్యలను పార్టీ, ప్రజా సంఘాలు చేపట్టాలి. ప్రజాతంత్ర హక్కుల పరి 'రక్షణ' విస్తృత వేదికలో వారిని తప్పనిసరిగా భాగస్వాములను చేయాలి.

**2.49** మెజారిటీ మతతత్వపు దాడులవలన మైనారిటీ మతత్వం తీవ్రవాదం పెరుగుతున్నది. ఈ ధోరణి మైనారిటీ ప్రయోజనాలకు భంగం కలిగిస్తుంది. అందువలన వాటిని వ్యతిరేకించాలి. తద్వారా ప్రజలలో ఐక్యత పాదుకొల్పి హిందుత్వ శక్తుల నుండి ఎదురయ్యే ముప్పును ఎదుర్కోవాలి.

## సామాజిక సమస్యలను ముందుకు తీసుకెళ్ళడం

**2.50** సామాజిక సమస్యలను తప్పనిసరిగా చేపట్టాలని, వాటిని పార్టీ యొక్క మొత్తం రాజకీయ కార్యాచరణతో జోడించాలని గత పార్టీ మహాసభలు నొక్కిచెప్తూ వచ్చాయి. హిందూత్వ దాడి మహిళలు, పిల్లలు, దళితులు, ఆదివాసీలు, మైనారిటీల హక్కులను లక్ష్యంగా చేసుకున్నందున ఇప్పుడు ఇది మరింత కీలకంగా మారింది. మహిళలపై హింసకు వ్యతిరేకంగానూ, మైనారిటీల హక్కుల రక్షణ కోసమూ జరిగే ప్రచారంలో పార్టీ చురుకుగా ఉండాలి. కుల అణచివేతకు, వివక్షకు వ్యతిరేకంగా ముఖ్యంగా దళితులకు, అత్యంత వెనుకబడిన తరగతులకు సంబంధించిన సమస్యలపై పార్టీ మొనగాడుగా నిలవాలి. దళిత, ఆదివాసీ వేదికల కార్యకలాపాలకు పార్టీ తన పూర్తి మద్దతు అందించాలి.

## హిందుత్వ దాడి

**2.51** గత నాలుగేళ్లుగా ఆర్ఎస్ఎస్ తన రాజ్యాధికారాన్ని వినియోగించుకుని దేశంలోని అన్ని సంస్థల కీలక పదవులలోకి తన మనుషులను జొప్పించాలన్న పథకం అమలుచేస్తోంది. రాష్ట్రాలకు నియమించిన గవర్నర్లలో ఎక్కువమంది బిజెపి – ఆరెస్సెస్ వారే. అందులో పలువురు వారి స్థానాన్ని వినియోగించుకుని వారి మతతత్వ అజెండాను ప్రచారం చేస్తున్నారు. రాజ్యాంగ సంస్థలలోకి చొరబడిన వారు అంతర్గతంగా వాటిని దెబ్బతీస్తున్నారు. బిజెపి – ఆరెస్సెస్ నాయకులు సైతం బహిరంగంగానే రాజ్యాంగాన్ని మార్చేయాలన్న తమ అభిలాషను వెలిబుచ్చుతుంటారు.

విద్యా సంస్థలను, సాంస్కృతిక సంస్థలను మతతత్వంతో ప్రభావితంచేస్తున్నారు. యు.జి.సి. (యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్), ఎన్.సి.ఇ.ఆర్.టి. (నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిసెర్చ్ అండ్ ట్రెయినింగ్) ఐ.సి.హెచ్.ఆర్. (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రిసెర్చ్) ఐ.సి.ఎస్.ఎస్.ఆర్. (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ స్టడీ అండ్ రిసెర్చ్) వంటి సంస్థలు ఆరెస్సెస్ వారితో నింపివేయబడ్డాయి లేదా హిందుత్వవాదానికి తలవొగ్గే వ్యక్తులు ఆ సంస్థల అధికారులుగా ఉన్నారు. జె.ఎన్.యు, హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయం, పాండిచ్చేరి విశ్వవిద్యాలయం వంటి కేంద్రీయ విద్యా సంస్థలలో అధ్యయనాంశాల సారాంశాన్ని మార్చి వేయడానికి, అధ్యాపకులను కట్టడి చేయడానికి, విద్యార్థి సంఘాలపై సంస్థలపై, ఆంక్షలకు పూనుకున్నారు. ఈ ప్రయత్నాలను వ్యతిరేకిస్తే దాడులకు పాల్పడ్డారు. చరిత్ర తిరిగి రాయబడుతున్నది. లౌకిక, శాస్త్రీయ చరిత్ర తిరస్కరించబడుతున్నది. శాస్త్రీయ సంస్థలపై, శాస్త్రీయ విజ్ఞానంపై దాడులకు మూలం హిందుత్వ మితవాద భావజాలం. శాస్త్రీయ పరిశోధన సంస్థలకు, పరిశోధనలకు వెచ్చించవలసిన ఖర్చులలో కోతలు విధించబడుతున్నాయి. అశాస్త్రీయ భావాలూ, అభివృద్ధి నిరోధక భావాలూ అధికారికంగానే ప్రోత్సహించబడుతున్నాయి.

**2.52** ఈ భావాలు మహిళల పై ద్విముఖ ప్రభావాన్ని కలిగి పురుషులకు స్త్రీలు లొంగి వుండాలన్న హిందూత్వ మనువాదుల దృక్పథానికి అనుగుణంగా వుంటుంది.

ఒకవైపు కేంద్ర ప్రభుత్వం తన హిందుత్వ అజెండాను పై నుండి రుద్దుతుంటే

స్థానికంగా ఆర్ఎస్ఎస్ హిందుత్వ అనుయాయులు యథేచ్ఛగా స్వైర విహారం చేస్తున్నారు. ముస్లింలను లక్ష్యంగా చేసుకునే ఉద్దేశంతోనే గోరక్షకులమంటూ పశు వ్యాపారులపైన, రైతుల పైన దాడులకు పాల్పడుతూ అనుమానించిన వారిని ఏకంగా హత్యలు చేస్తున్నారు. ఆవును చంపారనో, ఆవు మాంసం తింటున్నారనో నెపంతో ఈ ఫాసిస్ట్ తరహా దాడులలో ముప్పై మందికిపైగా హత్యలకు గురైనారు. బిజెపి ఆర్ఎస్ఎస్ పాలిత ప్రభుత్వాలు బాహాటంగానే గో రక్షకులకు కొమ్ముకాస్తున్నాయి. లవ్ జిహాద్ కారణంగా చూపి ముస్లింలను లక్ష్యం చేసుకుని, దాడుల చేస్తున్నారు. వారిని దేశద్రోహులుగా ముద్రవేస్తున్నారు. ఆ విధంగా దేశంలో మత విద్వేషాలను రగిల్చి ప్రజలను విభజించేందుకు పూనుకుంటున్నారు.

**2.53** రామనవమి వంటి పండగల సమయాలలో మత దాడులను పద్ధతి ప్రకారం అమలు చేస్తున్నారు.

**2.54** వీరి మరో లక్ష్యం పశు వ్యాపారంలో ఉన్న దళితులు, పశు చర్మాన్ని వలిచే దళితులు. గుజరాత్ ఉనాలో నలుగురు దళితులు దారుణంగా దాడికి గురికావడం ఈ దళిత వ్యతిరేకతలో భాగమే.

హిందుత్వ ఉగ్రవాద శక్తులు ఆలోచనాపరులను, రచయితలను లక్ష్యం చేసుకుంటున్నాయి; ముఖ్యంగా హేతువాద లౌకిక భావాలున్నవారిని తన లక్ష్యంగా చేసుకుంటున్నాయి. నరేంద్ర దబోల్కర్ హత్య అనంతరం మహారాష్ట్రలో గోవింద్ పన్సారే హత్య చేయబడ్డాడు. కర్ణాటకలో ప్రొఫెసర్ ఎం ఎం కల్బుర్గి ఆ తరువాత వీరి లక్ష్యం అయ్యాడు. ఆ తరువాత మళ్ళీ గౌరి లంకేశ్ హత్య. ఈ రకమయిన ఫాసిస్ట్ దాడులతో తమకు వ్యతిరేకంగా ఉన్నవారిని నోరెత్తకుండా చేయడానికి, భయభ్రాంతులను చేయడానికి పూనుకుంటున్నారు.

## 2.55 జమ్మూ, కాశ్మీర్

2.56 గత పార్టీ మహాసభ తరువాత కాలంలో కాశ్మీర్‌లోయలో పరిస్థితి మరింత దిగజారింది. అప్పుడు మనం శంకించినట్టే బిజెపి – పిడిపి సంకీర్ణ ప్రభుత్వం రాష్ట్రంలో జమ్మూ ప్రజలకు, కాశ్మీర్ లోయలోని ఇతరులకు మధ్య ఉన్న మత విభేదాలను పెంచింది. ఆచరణలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి

జమ్మూ కాశ్మీర్ ప్రజలకు ప్రత్యేక హోదా నిరాకరిస్తున్నది. ఇది కాశ్మీర్ ప్రజలకు భారతదేశానికి మధ్య నున్న దూరాన్ని ఎన్నడూలేనంత ఎక్కువస్థాయికి పెంచింది.

**2.57** 2016 జులైలో సైనిక దళాలు హిజ్బుల్ తీవ్రవాది బుర్హాన్ వనిని చంపడంతో తీవ్రమయిన అశాంతి చెలరేగింది. దీనిని సైనికదళాలు క్రూరంగా అణచివేశాయి. 6000 కు పైగా యువకులు గాయపడ్డారు, 500 మందికి పైనే కంటి గాయాలయ్యాయి. ఎంతోమంది 'పెల్లెట' గాయాలు తగిలి ఒక కంటికో, రెండుకళ్లకో చూపు పోగొట్టుకున్నారు. ఈ రకమయిన అణచివేత తీవ్రవాదం పెరగడానికి దోహదం చేసింది. ఈ పరిణామం రక్షణ దళాలు విరుచుకుపడడానికి దారితీసింది. ఇందువలన తీవ్రవాద కార్యకలాపాలు ఒక మేరకు అదుపులోకి వచ్చినా ప్రజలను మాత్రం మరింత గాయపరిచి తాము పరాయివారమనే భావాన్ని మరింతలోతుగా పెంచింది.

**2.58** మోడీ ప్రభుత్వం అశాంతిని, పరాయీకరణను బలప్రయోగంతో అదుపు చేయాలనుకుంది. రాజకీయ చర్చలు జరపాలన్న పిలుపును పక్కకు పెట్టేసింది. 2016 సెప్టెంబర్‌లో రాష్ట్రాన్ని సందర్శించిన పార్లమెంట్ ప్రతినిధుల ప్రతిపాదనలను అంగీకరించలేదు. అందుకు భిన్నంగా స్థిర నివాసుల హక్కులను కాపాడే రాజ్యాంగంలోని 35ఏ అధికరణ చట్టబద్ధతని సవాలుచేయడం హిందుత్వ ఎజెండాపై మరిన్ని అనుమానాలకు ఊతమిచ్చింది. మధ్యవర్తిగా కేంద్ర ప్రభుత్వ మాజీ నిఘా విభాగపు అధికారి నియామకం ప్రభుత్వం ఈ సమస్యకు తగిన ప్రాధాన్యతనిస్తున్నదన్న నమ్మకాన్ని ప్రజలకు కల్పించలేదు.

**2.59** మోడీ ప్రభుత్వం జమ్మూ కాశ్మీర్ సమస్యల పట్ల అనుసరిస్తున్న రాజకీయ విధానాన్ని సిపిఐ(ఎం) పూర్తిగా వ్యతిరేకిస్తున్నది. వివిధ రకాల రాజకీయవైఖరులవలంబించే వారందరితోనూ చర్చలు జరపాలన్న వైఖరిని సిపిఐ(ఎం) పునరుద్ఘాటిస్తున్నది. దీనికితోడు పాకిస్తాన్‌తో కూడా కాశ్మీర్ సమస్యను గురించి రాజకీయ చర్చనడపవలసిన అవసరం ఉంది. ఈ రాజకీయ అణచివేతకు, పెల్లెట్ గన్స్ వాడకానికి, 'సాయుధబలగాల విశేష అధికారాల చట్టాని'కి ముగింపు పలకవలసిన అవసరం ఉంది. రాజ్యాంగ చట్టంలోని 370 అధికరణను ఏ లక్ష్యాలతో తొలుత రూపొందించారో ఈ లక్ష్యాలన్నింటినీ

పునరుద్ధరించి, చిత్తశుద్ధితో వాటిని ఆచరిస్తామన్న నమ్మకాన్ని తిరిగి కల్పించి, జమ్మూ, కాశ్మీర్ లోయ, లడక్ ప్రాంతాలు మూడింటికీ ప్రాంతీయ స్వయంపాలనా హక్కు కల్పించాలి.

## ఈశాన్య భారతం

ఈశాన్య ప్రాంతంలో మోడీ ప్రభుత్వం వచ్చిన నాటి నుండి, తెగలమధ్య విద్వేషాలు, మతతత్వ ఉద్రిక్తతలు రెచ్చగొట్టడానికి అనువైన రంగాన్ని సిద్ధంచేస్తున్నది. అస్సాంలో బిజెపి ప్రభుత్వం ఏర్పడడంతో ఈ ప్రక్రియ ఇంకా ముందుకుపోతున్నది. ఇదే సున్నితమైన ఈశాన్య ప్రాంతంలో ప్రధానమైన ప్రమాదం. హిందూ కాందిశీకులకు స్వయంచలితంగా (ఆటోమేటిక్‌గా) పౌరసత్వం ఇచ్చేందుకు వీలుగా పార్లమెంట్‌లో పౌరసత్వ చట్టానికి సవరణ బిల్ ప్రవేశపెట్టడంతోటే అస్సామియాజాతి వారిలో, ఇతర జాతులలో, భయాలు మొదలయ్యాయి. ముఖ్యంగా మార్చి 1971 నాటికి దేశంలో ఉన్న వారిని మాత్రమే దేశ పౌరులుగా జాతీయ పౌరుల రిజిస్టర్‌లో నమోదు చేయడం, దానిని సుప్రీం కోర్టు పర్యవేక్షించడం, ప్రజలకు ఆందోళన కలిగిస్తున్నది; ప్రత్యేకించి స్వాతంత్ర్యానికి ముందే తూర్పు బెంగాల్ నుండి వచ్చి అస్సాంలో స్థిరపడిన ప్రజలకు ఆందోళన కలిగిస్తున్నది.

**2.60** అస్సాంలో వరద సృష్టించిన భీభత్సాన్ని బిజెపి ప్రభుత్వం జాతీయ విపత్తుగా – గుర్తించి పరిష్కరించేందుకు తగిన నిధిని కేటాయించను నిరాకరిస్తున్నది.

**2.61** నాగా ఒప్పందం (నాగా ఫ్రేమ్‌వర్క్ ఎగ్రిమెంట్) లోని అంశాలను ఇప్పటివరకు బహిర్గతం చేయలేదు; ఇందువలన మణిపూర్, అస్సాం అరుణాచలప్రదేశ్ ప్రజలకు గ్రేటర్ నాగాలాండ్ హోదా విషయమై ఆందోళన కలుగుతోంది. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లు వారి మతతత్వ ఎజెండా చుట్టూ వివిధ తెగల, గిరిజన జాతులను తిప్పుకోవాలనుకుంటున్నది. ఇది వివిధ మతాలమధ్య, తెగల మధ్య సామరస్యాన్ని దెబ్బతీస్తుంది. తమ రాజకీయ ఎజెండాను ముందుకు తీసుకెళ్లేందుకు బిజెపి స్థానిక ఉన్నత వర్గీయులను, పార్టీలను తమవైపు తిప్పుకుంటున్నది.

**2.62** గత ప్రభుత్వాల లాగే కేంద్రంలో ఉన్న బిజెపి కూడా  ఈశాన్య ప్రాంతం సమగ్రంగా అభివృద్ధి చెందేందుకు అవసరమైన చర్యలు చేపట్టడానికి సిద్ధంగా లేదు. ప్రణాళికా సంఘాన్ని రద్దుచేయడం వలన  ఈశాన్య ప్రాంత అభివృద్ధికై రిజర్వు చేయబడిన 10శాతం అభివృద్ధినిధి రద్దు అయింది. ఇది ఆ ప్రాంతం సమగ్ర అభివృద్ధికి తీవ్ర విఘాతం కలిగిస్తున్నది.

## ఫెడరలిజం పై దాడి

**2.63** మోడీ ప్రభుత్వం అధికారాలను కేంద్రీకృతం చేసుకుంటూ రాష్ట్రాల హక్కులను హరిస్తున్నది. జిఎస్‌టి అమలుతో రాష్ట్రాలు వాటికున్న పన్నులు వేసే అధికారాన్ని కూడా కోల్పోయాయి. కేంద్రం ఇష్టానుసారంగా రాష్ట్రాలకు ఇవ్వాల్సిన నిధులలో కోతలు పెడుతున్నది. అధ్యక్ష పాలన విధించేందుకు గవర్నర్లను ఉపయోగించుకోవడం ఉత్తరఖండ్ అరుణాచల్‌ప్రదేశ్‌లలో చూసాం. పదిహేనవ ఆర్థిక సంఘం సిఫారసులను మోడీ ప్రభుత్వం ఉపయోగించుకున్న తీరు ఫెడరలిజంకి మరో దెబ్బ. తమిళనాడు గవర్నర్, ఢిల్లీ, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌లను రాష్ట్ర వ్యవహారాలలో జోక్యం చేసుకోవడానికి వాడుకోవడం చూస్తున్నాము. ఇటువంటి ప్రతిపాదనలు రాజ్యాంగ మౌలిక స్వరూపానికి విరుద్ధం. లోక్‌సభకు, రాష్ట్రాలకు జమిలి ఎన్నికలు జరపాలన్న ప్రతిపాదన ఆచరణలోకిగనుకవస్తే రాష్ట్ర అసెంబ్లీ కాలాన్నయినా తగ్గించాలి లేదా మెజారిటీ కోల్పోయిన రాష్ట్ర, ప్రభుత్వాలను గద్దెదించే అధికారాన్ని ఆ చట్టసభలకు లేకుండా వాటి అధికారాలను కుదించాలి. ఇది రాజ్యాంగ మౌలిక స్వభావానికే విరుద్ధం.

**2.64** కేంద్ర ప్రభుత్వం దాని సంస్థలు వారి అధికారాలను దుర్వినియోగం చేస్తూ హిందీ భాషను రుద్దుతున్నారు; విద్యకు,  సంస్కృతికి సంబంధించిన ఆదేశాలను బలవంతంగా అమలు చేస్తున్నారు.ఇది రాష్ట్రాల హక్కులపై దాడి.

## నిరంకుశ విధానాలు

**2.65** హిందుత్వశక్తులు, కార్పొరేట్ శక్తులు ఒకదానికొకటి తోడై నిరంకుశత్వం వైపుకు దారి తీస్తున్నది. ఈ కాలం ఎన్నో నిరంకుశ చర్యలను చవిచూసింది. మోడీ ప్రభుత్వం కుటిలత్వంతో కొన్ని బిల్లులను ద్రవ్య బిల్లులుగా వర్గీకరించి రాజ్యసభలో ఆమోదం పొందవలసిన అగత్యం లేకుండా చేయడం ద్వారా

పార్లమెంటును అవమానపరుస్తున్నది. చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం అమలుచేయడం, 'దేశద్రోహం' క్లాజు ఉపయోగించడం ద్వారా ప్రజలను దేశద్రోహులుగా చిత్రించడం, భిన్నాభిప్రాయాలను అణచివేయడం వంటి పద్ధతులకు పాల్పడుతున్నది.

**2.66** సుప్రీమ్ కోర్టులోని నలుగురు సీనియర్ న్యాయమూర్తులు సుప్రీమ్ కోర్ట్ ప్రధాన న్యాయమూర్తిపై చేసిన వ్యాఖ్యలు కలవరం కలిగిస్తున్నాయి; న్యాయస్థానాలలోని న్యాయాధిపతులు సహితం అధికారుల ఒత్తిడులకు ఎలా గురిఅవుతున్నారో వీరు బహిర్గతపరిచారు. దేశ భద్రత పేరుతో ప్రభుత్వం జడ్జీల నియామకంపై కూడా వీటో అధికారాన్ని కోరుకుంటున్నది.

**2.67.** మోడీ ప్రభుత్వం వారికి అనుగుణంగా వ్యవహరించని మీడియాను భయపెట్టి లొంగదీసుకుంటున్నది. ఇప్పటికే మీడియాలో ఒక పెద్ద భాగం యుద్ధానికి కాలుదువ్వే విధానాన్ని, హిందుత్వ విధానాన్ని అనుసరిస్తున్న బిజెపిని గట్టిగా బలపరుస్తున్నది. కేసులు నమోదు చేస్తామని బెదిరించడం, సంపాదకులను తీసేయించడం, వారికి నచ్చని వార్తలను ప్రచురితం కాకుండా గొంతునొక్కడం వంటి పద్ధతులకు ప్రభుత్వం ఒడిగడుతున్నది.

## బడాపెట్టుబడి అవినీతి

**2.68.** మోడీ ప్రభుత్వం కార్పొరేట్ల, బహుళజాతి కంపెనీల అనామతుసొమ్మును, అవినీతిని చట్టబద్ధం చేస్తున్నది. ప్రభుత్వ ప్రతిపాదిస్తున్న ఎన్నికలనిధి బాండ్లు అధికారంలో ఉన్న ప్రభుత్వం కాంట్రాక్టుల నుండి అక్రమంగా వసూళ్లు చేసుకోడానికి ఈ రకంగా అవకాశం కల్పిస్తున్నది. బాండ్లు ఇచ్చేవారుగానీ తీసుకునేవారు గాని తమ పేర్లను తెలియచేయవలసిన పనిలేదు. ఒక కంపెనీ రాజకీయ పార్టీలకు ఇచ్చేవిరాళం, దాని నికరలాభాలలో 7.5 శాతానికి మించకూడదని ఉన్న పరిమితులను ఈ ప్రభుత్వం తొలగించింది. అంటే ఇప్పుడు ఎంతయినా విరాళాలు చట్టబద్ధంగానే ఇవ్వవచ్చు. ఇది లంచగొండితనాన్ని హవాలాను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తుంది.

**2.69.** తన అధీనంలో అవినీతి అంతమవుతుందని ప్రగల్భాలు పలికిన మోడీ ప్రభుత్వం బండారం రఫెల్ యుద్ధ విమానాల ఒడంబడికతో బట్టబయలయింది.

ప్రభుత్వ రంగ సంస్థ అయిన హిందుస్థాన్ ఎయిరోనాటిక్స్ లిమిటెడ్‌తో ఒప్పందం చేసుకోవాలని ఉన్న ఆదేశాన్ని మార్చి అనిల్ అంబానీ కంపెనీ భాగస్వామ్యంతో 21,000కోట్ల మేరకు కొత్త ఒప్పందం చేసుకోవాలని ప్రధానమంత్రే అదేశాలు జారీ చేశారు. బిజెపి పాలిత రాష్ట్రాలలో అవినీతి విలయ తాండవం చేస్తున్నది; మధ్యప్రదేశ్‌లో వ్యాపం కుంభకోణం నుండి మహారాష్ట్రలో గోధుమపిండి కుంభకోణం, ఛత్తీస్‌ఘర్‌లోని పిడిఎస్, రాజస్థాన్‌లోని గనుల కుంభకోణం వరకు ఈ చిట్టా ఉన్నది. అమిత్‌షా కొడుకు యాజమాన్యంలోని కంపెనీ కుంభకోణం ఉదంతం ఇందుకు మరో ఉదాహరణ. మోదీ ప్రభుత్వం లోక్‌పాల్‌ని నియమించేందుకు అవసరమైన చట్ట సవరణలు కూడా చేయ్యలేదు.

## 2.70. ఎన్నికల సంస్కరణలు

మోడీ ప్రభుత్వం పెద్ద మొత్తంలో ఎన్నికల కోసం వచ్చిన డబ్బును ఎలెక్టోరల్ బాండ్లతో చట్టబద్ధం చేసేందుకు తీసుకున్న చర్యలు ఎన్నికల సంస్కరణల తక్షణ అవసరాన్ని సూచిస్తున్నది. వి వి పి ఏ టి యంత్రాంన్ని ఎలక్ట్రానిక్ యంత్రానికి సుసంధానం చేయాలి. ఫలితాలను లెక్కించే సమయంలో కనీసం 20% వి వి పి ఏ టి బాలెట్ ఓట్లను ఎన్నికలఫలితాలతో సరిపోల్చాలి; ధన ప్రాబల్యం తగ్గాలంటే ప్రభుత్వమే ఎన్నికలకు ధనాన్ని సమకూర్చాలి. అందుకు బదులుగా బిజెపి ప్రభుత్వం విదేశీ చందాల నియంత్రణ చట్టాన్ని ఫైనాన్స్ బిల్ ద్వారా వెనకటి తేదినుండి అమలుచేస్తూ చట్టాన్ని చేసింది. తద్వారా విదేశీ నిధులు రాజకీయ పార్టీలు పొందే అవకాశం ఏర్పడుతుంది. ఇది అంతర్జాతీయ సంస్థల యొక్క అనుబంధ సంస్థలు విదేశీ పెట్టుబడిదారులన నియంత్రణలో ఉన్న సంస్థలు రాజకీయ పార్టీలకు నిధులిచ్చే అవకాశాన్ని కల్పిస్తుంది . ఈ భయంకర నిబంధనసురద్దు చేయాలి. ఎన్నికల్లో ధనబలాన్ని తగ్గించేందుకు ప్రభుత్వమే ఎన్నికలకు నిధులు సమకూర్చవలసి ఉంటుంది. ఇందుకు ఎన్నికల విధానంలోనే సమూల మార్పులు అవసరమవుతాయి; దామాషా ప్రాతినిథ్యం అమలుపరచవలసి ఉంటుంది. పాక్షిక జాబితా విధానంతో కూడిన దామాషా పద్ధతి గురించిన పార్టీ వైఖరిని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి.

## 2.71 విదేశాంగ విధానం : అమెరికా కాంప్‌లో

అలీన విధానం నుంచి అమెరికాకి అనుగుణంగా విదేశాంగ విధానం మారడం, ఉదారవాద విధానాల అమలు, 1991 నుంచి ఏకకాలంలోనే జరిగాయి. గత రెండున్నర దశాబ్దాలుగా పాలించిన కాంగ్రెస్, బిజెపి ప్రభుత్వాలన్నీ కూడా అమెరికాతో వ్యూహాత్మక భాగస్వామ్యం వైపే అడుగులు వేశాయి. అమెరికాతో వ్యూహాత్మక మిత్రత్వం వైపు అడుగులు వేసిన యూపిఏ పదేళ్ల పాలన తరువాత వచ్చిన మోడీ ప్రభుత్వం, అమెరికా అనుకూల విదేశాంగ విధానాన్ని మరింత ఉధృతంగా, విస్తృతంగా అమలుచేస్తున్నది.

**2. 72.** 2015 జనవరిలో ఒబామా భారత పర్యటన సందర్భంగా చేసిన భారత్–అమెరికా 'ఉమ్మడి దృక్పథం' ప్రకటనలో ఆసియా–పసిఫిక్ ప్రాంతానికి సంబంధించి అమెరికా రూపొందించిన భౌగోళిక–రాజకీయ వ్యూహం అమలుకు ఇరుసుగా ఉన్న అమెరికాతో సమన్వయం చేసుకోడానికి భారత్ కట్టుబడివున్నట్టు ప్రకటించింది. నరేంద్రమోడీ మరో ముందడుగు వేసి జపాన్ అమెరికాలతో కలిసి త్రైపాక్షిక రక్షణ మిత్రత్వం ఏర్పరచుకున్నారు. అక్కడి నుండి మరో అడుగు ముందుకెళ్లి జపాన్, ఆస్ట్రేలియా, అమెరికాతో కలిసి నాలుగు దేశాల చతుర్భుజ మిత్రత్వ ఒడంబడిక చేసుకున్నారు.

**2.73.** అమెరికా భారతదేశ సైనిక సహకారం లోతుగా వేళ్లూనుకుని, అమెరికా భారతదేశాన్ని తన అతి పెద్ద రక్షణ భాగస్వామిగా చెప్పుకునే స్థాయికి చేరింది. భారతదేశ – అమెరికా రక్షణ ఒప్పందం మరో పదేళ్లకు పొడిగించబడింది. లాజిస్టిక్ ఎక్స్ఛేంజి అగ్రిమెంట్ అనే మరో కీలక ఒప్పందం చేసుకుని (ఎల్ఇఎంఓఏ) అమెరికా యుద్ధ విమానాలకు, వాయు సైనిక విమానాలకు భారతదేశ విమానాశ్రయాలలో చమురు నింపుకోడానికి, ఇతర సేవలను అవి ఉపయోగించుకోడానికి, వాటి నిర్వహణ పనులు చేసుకోడానికి అంగీకరించింది. ఇది భారతదేశ సార్వభౌమత్వంపై దాడి; ఇంతకు ముందు ఏ ప్రభుత్వం ఇటువంటి నిర్ణయాలు చేయడానికి సిద్ధం కాలేదు.

**2.74.** ఇజ్రాయిల్‌తో సంబంధాలు గట్టిపడ్డాయి. ఇజ్రాయిల్‌ను సందర్శించిన మొట్టమొదటి ప్రధాని మోడీ; ఇజ్రాయిల్‌ను సందర్శించి కూడా పాలస్తీనా

అధికారులను ఉద్దేశపూర్వకంగానే కలవలేదు. ఇది మామూలుగా అయితే అమెరికా అధ్యక్షుడు సైతం చేయని పని. ప్రధాన మంత్రి కారకాస్‌లో జరిగిన అలీనదేశ శిఖరాగ్ర సభకు హాజరుకాలేదు. ఇంతకు ముందున్న రివాజుకు ఇది విరుద్ధం.

**2.75.** 2017 జూన్‌లో భారతదేశం షాంఘై సహకార సంఘంలో పూర్తి సభ్యురాలిగా చేరింది. ఇది బ్రిక్స్ (బిఆర్ఐసిఎస్ )లో భాగమే. మోడీ ప్రభుత్వం కేవలం ఉగ్రవాద సమస్యకి మాత్రవే పరిమితమవుతూ ఈ వేదికలను ఉపయోగించుకుని ప్రాంతీయ సహకారాన్ని పెంపొందించుకుని బహుళధ్రువత్వాన్ని అభివృద్ధి చేసుకునే ప్రయత్నం చేయడం లేదు.

**2.76.** మోడీ ప్రభుత్వం మన పొరుగునున్న దక్షిణ ఆసియా దేశాలతో అనుసరిస్తున్న విధానం మనకున్న సన్నిహిత, సౌహార్ద్ర సంబంధాలను చెడగొట్టింది. 'మాధేశీ' ఆందోళనకారులు, చేపట్టిన ఆర్థిక దిగ్బంధనాన్ని సమర్థించడంతో భారతదేశానికి, నేపాల్ ప్రజలకు, అక్కడున్న అన్ని రాజకీయ శక్తులకు మధ్య దూరం ఏర్పడింది. భారతదేశం రోహింగ్యాల విషయంలో తీసుకున్న వైఖరి బంగ్లాదేశ్‌కి సహకరించేది కాదు. మోడీ ప్రభుత్వం పాకిస్తాన్‌తో ఘర్షణ విధానాన్నే అవలంబిస్తూ చర్చలకు ఏమాత్రం అవకాశం కల్పించడం లేదు. జాతీయ దురభిమానాన్ని రెచ్చగొట్టడం, మతతత్వాన్ని ఎగదోయడం తద్వారా ప్రజలను వేరుచేయడం వంటి సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసమే వ్యవహరించడం దీనికి కారణం.

## పెరుగుతున్న ప్రతిఘటన, విస్తృతమవుతున్న పోరాటాలు

**2.77.** మోడీ ప్రభుత్వ ఆర్థిక విధానాలకు, మతతత్వ విధానాలకు, నిరంకుశ ధోరణులకు వ్యతిరేకంగా ఈ కాలంలో ప్రతిఘటన పెరుగుతున్నది.

1. రైతుల సమైక్య పోరాటాలు పెరిగాయి. మహారాష్ట్రలో 11 రోజులు జరిగిన రైతుల సమ్మె, అనంతరం రైతాంగ పోరాటానికి ఒక కొత్త మలుపు రైతుల చారిత్రిక సుదీర్ఘ పాదయాత్ర (లాంగ్ మార్చ్). ఈ పోరాటానికి పరాకాష్ట నాసిక్ నుండి ముంబాయి వరకు సాగిన రైతాంగ చారిత్రక (లాంగ్ మార్చ్) రైతాంగ పోరాట చారిత్రలో ఒకమైలురాయిగా నిస్తుంది. మందాసర్

(మధ్యప్రదేశ్) ఆ చుట్టు పక్కల జిల్లాల రైతులు సద్యోజనితంగా చేసిన పోరాటాలు; జార్ఖండ్‌లో సంథాల్ పరగణాలు, చోటానాగపూర్‌లలో కౌలు చట్టానికి ప్రతిపాదించిన సవరణలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాలు, సికార్ గ్రామీణ ప్రాంతంలోను ఇతర అయిదు రాజస్థాన్ జిల్లాలోనూ విస్తృతంగా, ఏ అంతరాయం లేకుండా, మిగిలిన అన్ని తరగతుల మద్దతుతో కొనసాగిన రైతు ఆందోళనలు అందులో ముఖ్యమయినవి. ఈ పోరాటాలు ప్రభుత్వాల నుండి కొన్ని వెసులుబాట్లు గుంజుకోగలిగాయి. రైతు సంఘాలు సాధించిన ఐక్య పోరాటాలు మోడీ ప్రభుత్వం భూ సేకరణ చట్టాన్ని నీరుగార్చే ప్రయత్నాన్ని అడ్డుకోగలిగాయి. 2017 నవంబర్ 20–21 లో 187 సంఘాల ఐక్య వేదిక ద్వారా సాగిన కిసాన్ పార్లమెంట్‌కు దేశం నలుమూలలనుంచి పెద్ద ఎత్తున రైతులు తరలి వచ్చారు. ఈ మధ్య కాలంలో జరిగిన అతి పెద్ద సంఘటిత రైతు ఉద్యమం ఇదే. ఈ అన్ని పోరాటాలలో ఆల్ ఇండియా కిసాన్ సభ ముఖ్యమయిన భూమికని పోషించింది.

2. కార్మిక సంఘాల ఐక్యవేదిక 2016 సెప్టెంబర్ 2న ఒక దేశవ్యాప్త సమ్మెకు ఇచ్చిన పిలుపుతో విస్తృతంగా కార్మికులు, ఉద్యోగులు సమ్మెలో పాల్గొనేందుకు అవకాశం వచ్చింది. రంగాలవారీగా కూడా ప్రైవేటీకరణకి వ్యతిరేకంగా బ్యాంకు ఉద్యోగులు, స్టీల్ కార్మికులు, బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులు ముఖ్యమైన సమ్మెలు చేసారు. ఇందులో ముఖ్యమయినది అంగన్వాడీ కార్మికులు బెంగుళూరులో చేసిన బైఠాయింపు సమ్మె. మహారాష్ట్రలో నెలరోజులపాటు సాగినరాష్ట్రవ్యాప్త సమ్మె. 2015 ఏప్రిల్ నెలలో మొట్టమొదటిసారిగా జరిగిన దేశ వ్యాప్త రవాణా కార్మిల సమ్మె లో కార్మికులు భారీగా పాల్గొన్నారు.

2017 నవంబర్ 9 నుండి 11 వరకు ఢిల్లీలో పార్లమెంట్ ఎదురుగా మూడు రోజులు కార్మికులు 'మహాపడావ్' నిర్వహించారు. ఈ వినూత్న నిరసన కార్యక్రమంలో లక్షమందికి పైగా కార్మికులు పాల్గొన్నారు. వీటన్నిటిలో సి.ఐ.టి.యు. ప్రముఖ పాత్ర పోషించింది.

3. కేంద్ర విశ్వవిద్యాలయాలలో విద్యార్థులపై జరుగుతున్న మతతత్వ నిరంకుశ దాడులకు వ్యతిరేకంగా జెఎన్‌యూ, హెచ్‌సియూ, ఎఫ్‌టిఐఐ, ఐఐటి (మద్రాస్) మొదలయిన విద్యాసంస్థలలో పోరాటాలు జరిగాయి. గోరక్షకులు మైనారిటీలపై

చేస్తున్న దాడులకు వ్యతిరేకంగా, రచయితలపై, జర్నలిస్టులపై ఫాసిస్ట్ తరహా దాడులకు వ్యతిరేకంగా విస్తృతంగా ప్రదర్శనలు, ర్యాలీలు జరిగాయి. కల్బుర్గి హత్య తరువాత పెద్దసంఖ్యలో ప్రముఖ రచయితలూ కళాకారులూ తమకు వచ్చిన అవార్డులను తిరిగి ఇచ్చేసారు. గౌరి లంకేశ్ హత్యకి నిరసనగా దేశవ్యాప్తంగా ప్రదర్శనలు జరిగాయి.

4. రోహిత్ వేముల మరణం అనంతరం ఉనాలో దళితులపై దాడుల అనంతరం వామపక్షాలు, దళిత సంఘాలు కలిసి దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. దళిత్ స్వాభిమాన్ సంఘర్ష్ మంచ్ వామపక్ష పార్టీల, దళిత సంఘాల వేదికగా రూపొంది అనేక కేంద్రాలలో సభలు నిర్వహించింది.

5. 2017 సెప్టెంబర్‌లో జన్‌ఏక్తా, జన్ అధికార్ ఆందోళన్ (ప్రజల ఐక్యత మరియు హక్కుల వుద్యమం) పేరుతో ప్రజాసంఘాల, వర్గ సంఘాల, సామాజిక ఉద్యమాల వేదిక ఏర్పడింది. ఇది ఒక డిమాండ్ల పత్రాన్ని తయారుచేసింది. దీని ఆధారంగా సమైక్యప్రచారం, పోరాటాలు జరగనున్నాయి.

## పరిస్థితి సంక్షిప్తంగా

**2.78** బిజెపి రాజకీయంగా సంఘటితపడింది. మోడీ ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రజలపై నయా ఉదారవాద పెట్టుబడిదారీ దోపిడీ మరింత తీవ్రతరమయింది. హిందుత్వ అజెండాను అమలుపరిచే క్రమంలో భారతదేశ లౌకిక ప్రజాస్వామ్య పునాది దెబ్బతింటున్నది. బిజెపి నాయకత్వంలోని భారత ప్రభుత్వం మనదేశాన్ని అమెరికా యొక్క సామ్రాజ్యవాద వ్యూహానికి అనుకూలంగా కట్టివేసింది. ఇదంతా ఒక దూకుడుతో కూడుకున్న నయా ఉదారవాద నిరంకుశ మతతత్వ పరిపాలన మొదలైందని సూచిస్తోంది.

**2.79** అదేసమయంలో మోడీ అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ప్రజలలో తీవ్రమయిన అసంతృప్తి ఉన్న సంకేతాలు ఉన్నాయి. ఇవి వివిధ తరగతుల ప్రజలలో పెరుగుతున్న ప్రతిఘటనల రూపంలో, రకరకాల పోరాటాల రూపంలో కనిపిస్తున్నాయి. పాలకవర్గాలకు, రైతాంగ, కార్మికవర్గాలకు మధ్య వైరుధ్యాలు పెరుగుతున్నాయి. మనం ఈ పరిస్థితిలో జోక్యం చేసుకుని

శ్రామిక జనుల వివిధ పోరాటాలను ముందుకు తీసుకువెళ్ళాలి.

**2.80** వ్యవస్థ బడా బూర్జువా – భూస్వామ్య వర్గ ఆధిపత్యం ఉంటే రకరకాల నిరంకుశ ధోరణులు వివిధ సందర్భాలలో బయటపడుతుంటాయి. నిరంకుశత్వపాలనని సమర్థవంతంగా ఓడించాలంటే మన పోరాటం, ఎత్తుగడలు బడా బూర్జువా – భూస్వామ్య వర్గాన్ని బలహీనపరచే దిశగా ఉండాలి.

**2.81** శ్రామిక వర్గంపై, వివిధ తరగతుల ప్రజలపై పడే ఆర్థికభారానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలను మన పార్టీ వేగవంతం చేయాలి. ఆర్ఎస్ఎస్, బిజెపిల మతతత్వ ఎజెండాకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలను ప్రభావితం చేయాలంటే నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటాలను, హిందుత్వ మతతత్వానికి వ్యతిరేకంగా జరిగే పోరాటాలను, నిరంకుశత్వానికి వ్యతిరేకంగా జరిగే పోరాటాల ఒకదానితో మరొకటి కలిపి చేయాలి.

## రాజకీయ పార్టీల వైఖరులు

### బిజెపి

**2.82** పార్టీ కార్యక్రమంలో పేర్కొన్నట్లు బిజెపి విచ్ఛిన్నకర మతతత్వ పునాదిపై ఆధారపడిన ప్రగతి నిరోధక పార్టీ. దాని ప్రగతి నిరోధక సిద్ధాంతం ఇతర మతాలపట్ల ద్వేషం, అసహనం కలిగివుండి ద్వేషపూరిత తీవ్ర జాతీయవాదంపై ఆధారపడి ఉంది. బిజెపి ఒక సాధారణ రాజకీయ పార్టీ కాదు. అది ఫాసిస్టు తరహా ఆర్ఎస్ఎస్ పెత్తనం కింద దాని మార్గదర్శకత్వంలో పని చేస్తున్న పార్టీ. బిజెపి అధికారంలో ఉన్నప్పుడు ఆర్ఎస్ఎస్‌కు రాజ్యాంగ యంత్రాంగంలోకి, రాజ్యాధికారాన్ని చెలాయించే విభాగాల్లోకి ప్రవేశించే అవకాశం లభిస్తుంది, బిజెపిని ఫాసిస్టు తరహా ఆర్ఎస్ఎస్ నడిపిస్తుంది, నియంత్రిస్తుంది.

**2.83** మునుపటి వాజ్‌పేయి ప్రభుత్వంతో పోల్చితే నరేంద్రమోడీ నాయకత్వంలోని ప్రభుత్వంలో బిజెపి ఆర్ఎస్ఎస్‌ల మధ్య మరింత సమన్వయం ఉంది.

పైగా నరేంద్రమోడీ బడా బూర్జువా వర్గం నుండి బిజెపికి విస్తృత మద్దతు పొందుతున్నారు.

**2.84** బిజెపి బడా బూర్జువా-భూస్వామ్య వర్గాలకు ప్రాతినిధ్యం వహించే బలమైన పార్టీగా ఎదిగి ఇంతకు మునుపు కాంగ్రెస్ ఉన్న స్థానంలోకి వచ్చి కూర్చున్నది. రాజ్యాధికారాన్ని ఉపయోగించుకొని దేశవ్యాప్తంగా తన నిర్మాణాన్ని, ప్రభావాన్ని విస్తరించుకొంది. తన బలాన్ని పెంచుకోవడం కోసం కాంగ్రెస్ నుండి ఇతర బూర్జువా పార్టీల నుండి ఫిరాయింపులను ప్రోత్సహిస్తోంది. ప్రత్యేకించి అది బలహీనంగా ఉన్న ఈశాన్య రాష్ట్రాల్లో బిజెపి ఈ పద్ధతిని అనుసరిస్తోంది.

**2.85** దేశంలోని మొత్తం 29 రాష్ట్రాలకు గాను 21 రాష్ట్రాల్లో అది ఒంటరిగా గానీ, ఇతర పార్టీలతో కలసిగానీ అధికారంలో ఉంది. లోక్‌సభలో దానికి మెజారిటీ ఉండగా రాజ్యసభలో అది అతిపెద్ద పార్టీగా ఉంది. నేడు దేశంలో మొదటిసారి రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతులిద్దరూ బిజెపి – ఆర్‌ఎస్‌ఎస్ తాను నుండే వచ్చారు.

## కాంగ్రెస్ పార్టీ

**2.86** కాంగ్రెస్ పార్టీ వర్గస్వభావమూ బిజెపి వర్గస్వభావమూ ఒక్కటే. బడా బూర్జువా భూస్వామ్య వర్గాల ప్రయోజనాలకే అది ప్రాతినిధ్యం వహిస్తుంది. రాజకీయంగా, నిర్మాణపరంగా అది బలహీనపడిపోయి ప్రధాన పాలక పార్టీగా తనుకున్న స్థానాన్ని బిజెపికి అప్పగించింది. కాంగ్రెస్ తనను తాను సెక్యులర్ పార్టీ అని చెప్పుకొంటున్నప్పటికీ తనకు మతతత్వ శక్తులపై నికరంగా పోరాడగల శక్తి లేదని నిరూపించుకొంది. అధికారంలో ఉండగా నయా ఉదారవాద ఎజెండాను ముందుకు తెచ్చింది.
అమెరికాతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. ప్రధాన ప్రతిపక్ష పార్టీగా కూడా అవే విధానాలను సమర్థిస్తోంది. ఈ విధానాలను వ్యతిరేకించడం తప్పనిసరి.

**2.87** జనతా ప్రజాతంత్ర విప్లవం యొక్క మూడు మౌలిక కర్తవ్యాలు ఇవి: గుత్తపెట్టుబడిదారీ వ్యతిరేక, భూస్వామ్యవ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక కర్తవ్యాలు. పార్టీ కార్యక్రమం ఇలా పేర్కొంది:

"అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో విప్లవం యొక్క ఈ ప్రాథమిక, మౌలిక కర్తవ్యాలను అమలు చేయాలంటే బడా బూర్జువా వర్గానికీ, ప్రభుత్వంలో నాయకత్వం స్థానంలో ఉన్న దాని రాజకీయ ప్రతినిధులకూ వ్యతిరేకంగా దృఢంగా పోరాటం చేయడం తప్పవేరే మార్గం లేదు."

**2.88** ప్రస్తుతం మనదేశంలో బడా పెట్టుబడిదారీ వర్గానికి రాజకీయ ప్రతినిధులు బిజెపి, కాంగ్రెస్ పార్టీలు. మన కార్యక్రమ అవగాహన ప్రకారం కాంగ్రెస్ బడా పెట్టుబడిదారుల భూస్వామ్య శక్తుల ప్రయోజనాలకు ప్రాతినిథ్యం వహిస్తూ సామ్రాజ్యవాద అనుకూల విధానాలను అనుసరిస్తుంది. కనుక అలాంటి వాటిని ఐక్య సంఘటన భాగస్వాములుగా గాని, మిత్రులుగా గాని, భావించే ఎత్తుగడల పంథాను మనం అనుసరించలేము.

**2.89** అయితే బిజెపి నేడు అధికారంలో ఉన్న పార్టీ. దానికి ఆర్ఎస్ఎస్‌తో గల మౌలిక సంబంధాన్ని బట్టి అది ప్రధాన ప్రమాదకారి. కనుక బిజెపి - కాంగ్రెస్‌లు రెండూ సమానమైన ప్రమాదాలుగా భావించే పంథా ఉండటానికి వీలులేదు.

## ప్రాంతీయ పార్టీలు

**2.90** 21వ మహాసభల్లో రాజకీయ ఎత్తుగడల విధానాన్ని సమీక్షిస్తూ ప్రాంతీయ పార్టీల పాత్రలో వచ్చిన మార్పును అంచనా వేశాం. ప్రాంతీయ పార్టీలు ఆయా ప్రాంతాలలోనిబూర్జువా భూస్వామ్య వర్గాల ప్రయోజనాలకే ప్రాతినిథ్యం వహిస్తున్నాయి. నయా ఉదారవాద విధానాల పట్ల వారికి గల వైఖరినిబట్టి ప్రాంతీయ పార్టీలు ఏ వర్గాల ప్రయోజనం కోసం ఉన్నాయో తెలిసిపోతున్నది. అధికారం కోసం బిజెపితో గానీ, కాంగ్రెస్‌తో గానీ పొత్తు పెట్టుకొని కేంద్రంతో సంకీర్ణ ప్రభుత్వాల్లో షరీకయ్యే వాటి అవకాశవాద వైఖరిని మనం గుర్తించాం.

2014 లోకసభ ఎన్నికల్లో పెద్ద ప్రాంతీయ పార్టీలయిన అకాలీదళ్, టిడిపి, ఏజిపిలు బిజెపితో పొత్తుపెట్టుకొన్నాయి. ఆ తర్వాత 2015 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలలిచ్చిన తీర్పును వమ్ముచేసి జెడి(యు) తిరిగి బిజెపి వైపు ఫిరాయించింది. జయలలిత మరణం తర్వాత ఎఐఎడిఎంకె

చీలిపోయింది. రెండు ప్రధాన పక్షాలు తిరిగి ఒక్కటయ్యాయి. బిజెపికి సన్నిహితంగా ఉండడంలో ఒక దానితో ఇంకొకటి పోటీ పడుతున్నది. ఈ మధ్య కాలంలో టి డి పి, ఎన్ డి ఏ తో ఆంధ్రాకి ప్రత్యేక హెూదా ఇవ్వకపోవడం అనే సమస్య పై తెగతెంపులు చేసుకుంది . ఒడిశాలోని బిజెపి తెలంగాణాలోని టిఆర్ఎస్ లాంటి ఇతర ప్రాంతీయ పార్టీలు మోడీ ప్రభుత్వాన్ని మొదట్లో వ్యతిరేకించడానికి సిద్ధపడలేదు. ఆ తరువాత బిజెపితో రాజీ విధానాన్ని అనుసరిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ఆర్‌సిపి కూడా ఇటువంటి వైఖరే ప్రదర్శిస్తోంది.

**2.91** పశ్చిమ బెంగాల్ లోని త్రిణమూల్ కాంగ్రెస్ రాజకీయంగా అధికారం స్థిరపరుచుకోడానికి నిరంకుశంగాను అప్రజాస్వామికంగాను ఉండి మతతత్వ విషయంలో బిజెపి తో పోటీపడుతున్నది.

**2.92** బిజెపితో చేయి కలపని ఇతర ప్రాంతీయ పార్టీలు కూడా ఉన్నాయి. అలాంటి పార్టీలను కలుపుకొని వీలైనన్ని చోట్ల మనం మతోన్మాదానికి, నియంతృత్వ దాడులకు వ్యతిరేకంగా ఉమ్మడి కార్యాచరణను ముందుకు తీసుకెళ్లాలి.

**2.93** మన ఎత్తుగడల వైఖరిని నిర్ణయించుకోవడంలో ఆయా ప్రాంతీయ పార్టీల పాత్రలను, వాటి రాజకీయాలను గమనంలోకి తీసుకోవాలి. మనవైఖరి పార్టీ ప్రయోజనాలను, వామపక్ష ప్రజాతంత్ర శక్తుల సమీకరణ అవశ్యకతను దృష్టిలో ఉంచుకోవాలి. ఏమైనప్పటికీ, జాతీయ స్థాయిలో ప్రాంతీయ పార్టీలతో పొత్తుకు ఎట్టి అవకాశమూ లేదు.

## వామపక్ష రాష్ట్రాలు

**2.94** పశ్చిమ బెంగాల్, కేరళ, త్రిపురాలలో ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లో ఎదురుదెబ్బలు తిన్న నేపథ్యంలో, పార్టీ పునాదులను, వామపక్షాలను కాపాడుకోవడానికి, 21 వ మహాసభ అత్యంత ప్రాధాన్యత నిచ్చింది. బిజెపి, కేరళ త్రిపురలలోని వామపక్ష నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకుంటున్నది. త్రిపుర ఎన్నికల ఫలితాలలో బిజెపి విజయం సాధించిన దగ్గరినుండి పార్టీని వామపక్ష ఉద్యమాన్ని అణచివేయడానికి విస్తృతమయిన

దాడులు చేస్తున్నది. కేరళలో కూడా ఎల్ డి ఎఫ్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి బిజెపి మార్క్సిస్టు పార్టీ ఆఫీసులను కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నది.

**2.95** ఈ పరిస్థితుల్లో పశ్చిమ బెంగాల్, కేరళ త్రిపురలలో పార్టీని, దాని పునాదులను రక్షించుకోవడం అత్యంత ప్రాధాన్యత గల విషయం. ఈ దాడులను తిప్పికొట్టి పార్టీ నిర్మాణాన్ని దాని నిర్వహణను, ప్రజలలో సంబంధాల విస్తృతికి అవసరమైన నిర్మాణ చర్యలను చేపట్టాలి.

## కేరళ

**2.96** 2016 మే నెలలో జరిగిన కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో 140 సీట్లకు గానూ 91 సీట్లను సిపిఐ(ఎం) మరియు ఎల్‌డిఎఫ్ గెలుచుకొన్నాయి. యుడిఎఫ్‌కు 38.8శాతం ఓట్లు రాగా ఎల్‌డిఎఫ్‌కు 43.35శాతం ఓట్లొచాయి. అదే ఎన్నికలలో బిజెపికి, దాని మిత్రులకూ 15శాతం ఒట్లు వచ్చాయి. ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం తన ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన అనేక హామీలను అమలు చేసింది. అన్ని రంగాల్లో కనీస వేతనాన్ని రోజుకు రు.600లకు పెంచింది. వివిధ తరహాల ప్రజల పెన్షన్లను పెంచింది. ప్రభుత్వ విద్యా, వైద్య సంస్థలను మెరుగుపరిచే అనేక చర్యలను చేపట్టింది. దేవాలయాల్లోని అర్చక పోస్టుల్లో ఎస్సీ, ఓబిసి రిజర్వేషన్లు కల్పించింది. కేరళ ప్రభుత్వం ఈ నాలుగు పథకాలను ప్రారంభించింది.

(i) లైఫ్–ఇళ్లులేని వారందరికీ ఇళ్లు (ii) ఆరర్ద్రం– సమగ్ర ఆరోగ్య సంరక్షణ పథకం (iii) ప్రభుత్వ విద్యారంగం స్థాయిని పెంచడం (iv) హరిత కేరళం; పూర్తి పారిశుద్ధ్యం, సేంద్రీయ వ్యవసాయం, నదుల, నీటివనరుల సంరక్షణ కోసం హరిత పథకం.

**2.97** ఎల్‌డిఎఫ్ అధికారం చేపట్టిన నాటి నుండి సిపిఐ(ఎం) కార్యకర్తలపై, మద్దతుదార్లపై ఆర్‌ఎస్‌ఎస్ దాడులు పెంచింది. పదముగ్గురు కామ్రేడ్స్‌ను హత్య చేశారు. 200ల మందికి పైగా పార్టీ సభ్యులు, సానుభూతిపరులు ఈ దాడుల్లో గాయపడ్డారు. 200 పైగా ఇళ్లపై, 50 పార్టీ ఆఫీసులపై కూడా దాడిచేసి తగులబెట్టారు. ధ్వంసం చేశారు.

**2.98** పైగా ఆర్‌ఎస్‌ఎస్–బిజెపి కార్యకర్తలను చంపేయాలనే లక్ష్యంతో సిపిఐ(ఎం), ఎల్‌డిఎఫ్ ప్రభుత్వమే దాడులు చేస్తోందని, సిపిఐ(ఎం)కు వ్యతిరేకంగా, ఎల్‌డి.ఎఫ్. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిలు దేశవ్యాప్తంగా తప్పుడు ప్రచారాన్ని చేస్తున్నాయి. బిజెపి – ఆరెస్సెస్ ముఠాల అబద్ధాలను తిప్పికొట్టడానికి పార్టీ, ఎల్.డి.ఎఫ్ ఒక ఉధృతమైన ప్రచారాన్ని ప్రజలలో చేశాయి. ఇటువంటి పరిస్థితుల్లో, కాంగ్రెస్ నేతృత్వంలోని యు.డి.ఎఫ్. కూటమి బిజెపితో పోటీపడి మరీ ఎల్‌డిఎఫ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తోంది.

## త్రిపుర

**2.99** 2018 ఫిబ్రవరిలో జరిగిన త్రిపుర అసెంబ్లీ ఎన్నికలలో వామపక్షం పరాజయం పొందింది. దీనితో అక్కడ బిజెపి – ఐపిఎఫ్‌టి కలిసి ప్రభుత్వాన్ని ఏర్పరిచాయి. ఇది సిపిఐ(ఎం),వామపక్షానికి మరియు ప్రజాతంత్ర శక్తులకు పెద్ద ఎదురుదెబ్బ. బిజెపి– ఐపిఎఫ్‌టికి 43 స్థానాలతో, 50.5శాతం ఓట్లతో మూడింట రెండొంతుల మెజారిటీ వచ్చింది – వామపక్షకూటమికి 44.9శాతం ఓట్లు వచ్చి 16 సీట్లు వచ్చాయి. గత అసెంబ్లీ ఎన్నికలతో పోల్చి చుస్తే 7.45శాతం ఓట్లు తగ్గాయి.

**2.100** త్రిపురలో గత్ 25 సంవత్సరాలనుండి, అంటే 1993 నుండి వామపక్ష ఫ్రంట్ అధికారంలో ఉన్నది. వామపక్ష ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసి, సాంఘిక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టింది. అందువలన ఈశాన్య రాష్ట్రాలకు నమూనాగా నిలిచింది. సామాజిక సూచీలన్నిటిలోను ఇతర రాష్ట్రాలు అసూయ పడేంత అభివృద్ధి సాధించింది. పేదరికంరేఖకు దిగువన మగ్గుతూన్న వారి సంఖ్యను 62% తగ్గించింది. రాజ్యాంగపు ఆరవ షెడ్యూల్ ప్రకారం స్వయం ప్రతిపత్తి జిల్లా కౌన్సిల్ లను ఏర్పాటు చేసి గిరిజన ప్రజలహక్కులకు గ్యారంటీ నిచ్చింది.

**2.101** ఇన్ని రకాలుగా అన్ని రంగాలలో మంచి పనులు చేసినప్పటికీ బిజెపి వామపక్ష వ్యతిరేక శక్తులను కలుపుకుని వారి మద్దతును కూడగట్టగలిగింది. బిజెపి, కాంగ్రెస్ పార్టీని మొత్తంగా వశపరచుకొంది. గిరిజనులకోసం

ప్రత్యేక త్రిపుర రాష్ట్రం కావాలని డిమాండ్ చేసే ఐపిఎఫ్‌టితో పొత్తుపెట్టుకుంది. ఈ పిలుపుకు గిరిజనులలో, ముఖ్యంగా యువకులలో మంచి మద్దత్తు లభించింది. మార్పుకోసం ప్రధాన మంత్రి, బిజెపి చేసినపెద్ద పెద్ద వాగ్దానాలు కొన్ని తరగతుల ప్రజలను ఆకట్టుకున్నాయి. కొంతమంది ఇతర ప్రతిపక్ష కార్యకర్తలను, కొన్ని తరగతుల ఓటర్లను పెద్ద మొత్తంలో డబ్బులిచ్చి, ప్రభావితం చేయడంలో జయప్రదమయ్యారు. గిరిజనులలో, పార్టీ ప్రజా పునాది ఎలా దెబ్బతినిందో పరిశీలించేందుకు లోతైన ఆధ్యయనం చేయవలసి ఉంది. నిర్మాణ బలహీనతలను, స్థానిక సంస్థలపనితీరుపై దాని ప్రభావాన్ని పరిశీలించవలసి ఉంది.

**2.102** ఎన్నికల తరువాత పార్టీ ప్రజాసంఘాలు పెద్ద ఎత్తున దాడులకు గురి అవుతున్నాయి. వందలాది పార్టీ ఆఫీసులు దాడులకు గురయ్యాయి; తగల బెట్ట బడ్డాయి. లేదా దోచుకోబడ్డాయి; మద్దతుదారుల, చురుకైన కార్యకర్తల ఇళ్ల పై దాడులు జరిగాయి; కార్మిక సంఘాల కార్యాలయాలు వశపర్చుకోబడ్డాయి; లేదా స్థంబింప చేయబడ్డాయి. పంచాయతీలు స్థానిక సంస్థలను వశపరచుకుంటున్నారు లేదా సభ్యులను రాజీనామాలు చేయమని బెదిరించో, పార్టీ మారమని అదిలించో వశపరచుకుంటున్నారు. పార్టీని నిర్వీర్యం చేసి ప్రజాపునాదిని భయభ్రాంతులను చేయాలన్నది వారి లక్ష్యం. పార్టీ, వామపక్ష కూటమి దృఢంగా నిలబడతాయి. హింసాత్మక ప్రచారాన్ని అడ్డుకుంటుంది. నిర్మాణము పటిష్ట పరచడానికి అవసరమైన చర్యలు తీసుకుంటుంది. ప్రజలను కూడగట్టి దాడులను ఎదుర్కొంటుంది; ప్రజలతో సజీవ సంబంధాలు ఏర్పరచుకుంటుంది.

## పశ్చిమ బెంగాల్

సిపిఐ(ఎం) మరియు వామపక్ష కూటమిపై భయానక పాలన, ఫాసిస్టు తరహాదాడులు టియంసి ప్రభుత్వంలో కొనసాగుతున్నాయి. 2016 అసెంబ్లీ ఎన్నికల అనంతరం పార్టీపై ప్రత్యేకించి పార్టీకి ప్రజల్లో పట్టున్న ప్రాంతాల్లో టి.యం.సి విస్తృతంగా దాడులు చేస్తోంది. 2016 జూన్ తర్వాత 31మంది సిపిఐ(ఎం) సభ్యులను మద్దతుదారులను టిఎంసి గూండాలు హత్య చేశారు. సిపిఐ(ఎం)కు మెజారిటీగల గ్రామ పంచాయితీలను, పంచాయతీ

సమితులను, మునిసిపాలిటీలను బలవంతంగా చేజిక్కించుకొనే పద్ధతిని కూడా టిఎంసి అనుసరించింది. ఆ పార్టీ పూనుకుంటున్న దాడులవల్ల, హెచ్చరికల వల్ల వేలాదిమంది తమ ఇళ్లను వదలిపెట్టి వెళ్లవలసి వచ్చింది.

**2.103** 2018 పంచాయత్ ఎన్నికలకు ముందే ఎన్నికలలో వామపక్ష ఫ్రంట్, ప్రతిపక్ష సభ్యులు నామినేషన్లు వేయనీయకుండా విస్తృతమైన దాడులు చేసి, హింసాత్మక పద్దతులకు పాల్పడ్డారు.

**2.104** ప్రజలతో తిరిగి సంబంధాలు పునరుద్ధరించడానికి పార్టీ ఒక ప్రణాళికను రూపొందించుకొంది. పార్టీ, వామపక్ష ఫ్రంట్, ప్రజా సంఘాల అధ్వర్యంలో అనేక జాతాలను, పాదయాత్రలను నిర్వహించింది. రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల అధ్వర్యంలో నబన్నా యాత్రను నిర్వహించింది. ఇటీవల – బెంగాల్ ప్రజా సంఘాల వేదిక (బిపిఎంఓ) అధ్వర్యంలో చాలా బ్లాకుల, పోలింగ్ బూతుల స్థాయిల్లో పాదయాత్రలు, జాతాలు జరిగాయి.

**2.105** తాను బిజెపిని వ్యతిరేకిస్తున్నట్లు టిఎంసి పైకి గొప్పగా చెప్పుకొన్నప్పటికీ అది చేపట్టే చర్యలు ప్రజల్లో మత విభజనకు తోడ్పడుతున్నాయి. తద్వారా వామపక్షాలను బలహీనపర్చాలని టిఎంసి ఎత్తుగడ. టిఎంసి అప్రజాస్వామిక విధానాలకు, బిజెపి మతతత్వ పన్నాగాలకు వ్యతిరేకంగా రెండు వైపులా సిపిఐ(ఎం) పోరాడుతోంది. ప్రస్తుత సంక్లిష్టస్థితిలో మన కర్తవ్య నిర్వహణకు పార్టీ నిర్మాణాన్ని సభ్యుల ప్రమాణాలను మెరుగుపర్చే చర్యలను పార్టీ చేపట్టింది.

## పార్టీ స్వతంత్ర బలం

**2.106** పార్టీ అభివృద్ధికి, వామపక్ష ప్రజాతంత్ర సంఘటన నిర్మాణానికి పార్టీ సొంతబలాన్ని పెంచుకోవడం కీలకం. పశ్చిమ బెంగాల్‌లో, త్రిపురలో తగిలిన ఎదురుదెబ్బల వల్ల, కేరళతప్ప తక్కిన రాష్ట్రాల్లో మనం పురోగమించనందు వల్ల ఈ కర్తవ్యం మరింత కీలకమయింది. పార్టీ పునాదిని విస్తృత పర్చుకోవడం, పార్టీ పలుకుబడిని పెంచుకోవడం ద్వారా మాత్రమే మనం వామపక్ష ప్రజాతంత్ర ప్రత్యామ్నాయం వైపు పురోగమించగలం. ఇందుకు మనం ప్రజలతో సజీవ సంబంధాల కోసం

పట్టుదలతో బహుముఖ కృషి చేయాలి. వర్గ, ప్రజా పోరాటాలను పెంపొందించి వాటిని పార్టీ రాజకీయ పలుకుబడిలోకి సంఘటితం చేసుకోవాలి.

**2.107** పాలకవర్గ సిద్ధాంతాలను, రాజకీయాలను ఎండగడుతూ రాజకీయ, సిద్ధాంతరంగంలో ఉద్ధృత పోరాటం చేయాలి. సామాజిక అంశాలపై పార్టీ జోక్యం చేసుకొని పోరాటాలు చేపట్టాలి. దీర్ఘకాల విస్తృత పోరాటాల ద్వారా, వర్గ సంఘాల విశాల ప్రజానీకాన్ని సమీకరించడానికి ప్రజాసంఘాలు వేదికలు తయారు కావాలి.

## వామపక్ష ఐక్యత

**2.108** పశ్చిమ బెంగాల్, కేరళ, త్రిపురలతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, బీహార్, తమిళనాడు, అస్సాం, పంజాబ్ రాష్ట్రాల్లో వామపక్ష పార్టీలతో ఐక్యఉద్యమాలు సాగుతున్నాయి. అయితే జాతీయస్థాయిలో, కొన్ని వామపక్ష పార్టీలు చేపట్టిన భిన్న రాజకీయ వైఖరుల కారణంగా ఐక్య కార్యాచరణను పెంపొందించి, దాన్ని కొనసాగించడంలో ఇబ్బందులు వస్తున్నాయి. కేరళలోని ఆర్ఎస్‌పి, ఫార్వర్డ్ బ్లాకుల రాష్ట్ర శాఖలు కాంగ్రెస్ నాయకత్వంలోని యుడిఎఫ్‌లో భాగస్వాములుగా ఉన్నాయి. కాగా కాంగ్రెస్‌తో సహా అన్ని లౌకిక పార్టీలను కలుపుకురావాలని సిపిఐ ఆమోదించిన రాజకీయ విధానం పేర్కొంటున్నది.

**2.109** కొంత వ్యవధి తర్వాత నోట్లరద్దు మొదటి వార్షికం సందర్భంగా, బాబ్రీ మసీదును కూల్చి 25ఏళ్లు అవుతున్న సందర్భంగా 2017లో వామపక్షాలు ఐక్య కార్యక్రమాలకు పిలుపునిచ్చాయి. ప్రజా సంఘాలతో, సామాజిక ఉద్యమాలతో ఒక ఐక్యవేదికను ఏర్పాటు చేయడంపై కొంతవరకు ఉమ్మడి అవగాహనకు రాగలిగాం. ఉమ్మడి రాజకీయ అవగాహనతో వామపక్ష ఐక్యత కోసం సూత్రబద్ధ పోరాటం చేయవలసి ఉంది.

## వామపక్ష ప్రజాతంత్ర సంఘటన

**2.110** వామపక్ష ప్రజాతంత్ర సంఘటనకు ప్రథమ ప్రాముఖ్యతను పునరద్ధరించాలని పార్టీ 21వ మహాసభ పిలుపు నిచ్చింది. బూర్జువా

భూస్వామ్య రాజకీయ విధానాలకు ఈ సంఘటనే నిజమైన ప్రత్యామ్నాయం. దాని పరిధిని వివరిస్తూ రాజకీయ తీర్మానం ఇలా పేర్కొంది. 'నేడు, వామపక్ష ప్రజాతంత్ర సంఘటన కేంద్రంలోకి సమీకరించవలసిన శక్తుల్లో వామపక్ష పార్టీలు, వాటి వర్గ ప్రజా సంఘాలు; వామపక్ష గ్రూపులు, మేధావులు; వివిధ పార్టీల్లో చెదిరి ఉన్న సోషలిస్టులు, లౌకిక బూర్జువా పార్టీల్లోని ప్రజాస్వామిక శక్తులు; ఆదివాసీల దళితుల, మహిళల, మైనార్టీలకు చెందిన ప్రజాతంత్ర సంస్థలు మరియు అణగారిన తరగతుల ప్రజల సమస్యలను చేపడుతున్న సామాజిక ఉద్యమాలు ఉ న్నాయి. బూర్జువా భూస్వామ్య పార్టీ విధానాలకు వ్యతిరేకమయిన ఒక కార్యక్రమం ప్రాతిపదికన పై తరగతులనన్నింటినీ ఒకదగ్గరకు సమీకరించగలిగే ఐక్యవేదిక మాత్రమే వామపక్ష ప్రజాతంత్ర ఫ్రంటుకు ఒక నిర్థిష్ట రూపాన్ని ఇవ్వగలదు.

**2.111** వివిధ వర్గసంఘాల, ప్రజాసంఘాల, సామాజిక ఉద్యమాల వేదికగా జనఏక్తా, జన అధికార్ ఆందోళన్‌ను, ఏర్పాటు చేయడం ద్వారా ఈ దేశంలో ఒక అడుగు ముందుకేశాం. దేశవ్యాప్తంగా ఐక్యపోరాటాలను నిర్వహించే విధంగా దీనిని శక్తివంతమైన ఉమ్మడి వేదికగా అభివృద్ధి చేయడానికి ఇంకా చాలా కృషి చేయాలి. ఒక వామపక్ష ప్రజాతంత్ర ప్రత్యామ్నాయాన్ని నిర్మించేందుకు దోహదపడే విధంగా మనం ఐక్య పోరాటాలను ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేయాలి.

**2.112** ప్రతి రాష్ట్రంలో అక్కడ వర్తించే ఒక కార్యక్రమం చుట్టూ వామపక్ష ప్రజాతంత్ర పార్టీలను, శక్తులను ప్రజాసంఘాలను, ప్రజాతంత్ర సంఘాలను, సామాజిక ఉద్యమాలను, మేధావులను సమీకరించాలి. అదే సమయంలో జాతీయ స్థాయిలో వామపక్ష ప్రజాతంత్ర ప్రత్యామ్నాయాన్ని ఐక్యవామపక్ష వేదికలద్వారా ప్రజల ముందుకు తేవాలి.

**2.113** దీన్ని చాలా కాలం ఒక ప్రచార నినాదంగా భావించాం. రానున్న కాలంలో దీనిని ఒక ప్రాధాన్యత గల కర్తవ్యంగా గుర్తించి చేపట్టేలా మొత్తం పార్టీని చైతన్యపర్చుకోవాలి.

## వామపక్ష, ప్రజాతంత్ర కార్యక్రమం : ఒక ప్రత్యామ్నాయం

**2.114** వామపక్ష ప్రజాతంత్ర కార్యక్రమం అన్నది నయా ఉదారవాద విధానాలకు, బూర్జువా–భూస్వామ్య విధానాలకు ప్రత్యామ్నాయాన్ని ముందుంచుతుంది. కార్మికుల, రైతుల, గ్రామీణ కార్మికుల ఇతర శ్రమజీవులందరి యొక్క మౌలిక డిమాండ్లు అందులో ఉంటాయి. ఇలాంటి విస్తృత అంశాలను డిమాండ్లను వామపక్ష ప్రజాతంత్ర శక్తులను సమీకరించడానికి నిర్ధిష్టపర్చాలి. తద్వారా వామపక్ష ప్రజాతంత్ర ప్రత్యామ్నాయాన్ని ముందుకు తెచ్చి వర్గ పోరాటాలను, ప్రజా ఉద్యమాలను నిర్మించాలి.

**2.115 కార్యక్రమం పరిధులు ఈ విధంగా ఉంటాయి:–**

**1. లౌకికతత్వం:** రాజ్యాన్ని, మతాన్ని వేరువేరుగా ఉంచాలన్నది లౌకికతత్వం యొక్క మౌలిక సూత్రంగా రాజ్యాంగంలో పొందుపరచాలి. కులతత్వం, మతతత్వ దురభిమానాలతో కూడిన ద్వేషపూరిత ప్రచారాన్ని నిషేధిస్తూ చట్టం చేయాలి. ప్రభుత్వ సంస్థల నుండి ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందిన వ్యక్తులను తొలగించాలి.

**2. ఫెడరలిజం:** రాష్ట్రాలకు ఎక్కువ అధికారాలిస్తూ కేంద్ర, రాష్ట్ర సంబంధాలను పునర్నిర్మించాలి. అందుకోసం ఉమ్మడి జాబితాను సవరించాలి. ఆర్టికల్ 356ను తొలగించి దానిస్థానే తగిన ప్రత్యామ్నాయాన్ని ఉంచాలి. గవర్నర్ల పాత్రను ప్రక్షాళన చేయాలి. ఆర్టికల్ 370ని పునరుద్ధరించి జమ్మూ కాశ్మీర్‌కు అత్యధిక స్వయం ప్రతిపత్తి కల్పించాలి.

**3. ప్రజాస్వామ్యం:** పౌరుల ప్రజాతంత్ర హక్కులను విస్తృతపర్చాలి. సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని, చట్ట వ్యతిరేక కార్యకలాపాల నివారణా చట్టాన్ని రద్దు చేయాలి. ఇండియన్ పీనల్‌కోడ్ నుండి కుట్ర (సెడిషన్) క్లాజును తొలగించాలి. మరణ శిక్షను రద్దు చేయాలి. డబ్బు ప్రభావాన్ని తగ్గించడానికి ఎన్నికల సంస్కరణలు చేపట్టాలి. పార్టీలు పాక్షిక జాబితాను ప్రకటించే పద్ధతిలో దామాషా ప్రాతినిథ్య విధానాన్ని ప్రవేశపెట్టాలి. ఎన్నిక కాబడిన స్థానిక సంస్థలకు ఎక్కువ అధికారాలు ఇవ్వాలి.

## 4. ఆర్థిక విధానం, అభివృద్ధి :

**(i)** స్వావలంబనతో కూడిన సమతుల అభివృద్ధి కోసం ప్రణాళికా పద్ధతిని పునరుద్ధరించాలి. ఉత్పత్తి శక్తులను అభివృద్ధిచేసి ఉపాధిని కల్పించాలి. ఆర్థిక సామాజిక అసమానతలను తగ్గించాలి.

**(ii)** మౌలిక భూసంస్కరణలను అమలు జరిపి వ్యవసాయ సంబంధాలలో ప్రజాతంత్ర మార్పు సాధించాలి. సహకార సేద్యాన్ని, సహకార మార్కెటింగ్‌ను అభివృద్ధి చేయాలి. భూమిలేని గ్రామీణ పేదలకు భూమి పంచాలి.

**(iii)** ప్రయివేటీకరించబడిన ప్రభుత్వరంగ సంస్థలను తిరిగి జాతీయం చేయాలి. విద్యుచ్ఛక్తి, నీటిసరఫరా ప్రజారవాణా, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాలను తిరిగి ప్రభుత్వ రంగంలోకి తేవాలి**;** గుత్త పెట్టుబడులకు కళ్లెంవేయాలి. సంపద పునఃపంపిణీజరిగేలా ద్రవ్యవిధానంలో, పన్నువిధానంలో మార్పులు చేయాలి. నల్లధనాన్ని అరికట్టడానికి కఠిన చర్యలు తీసుకోవాలి; దేశంలోకి ద్రవ్య రాకపోకలను నియంత్రించాలి. చిన్న మధ్యతరగతి పరిశ్రమలను ప్రోత్సహించి, సంప్రదాయ పరిశ్రమలకు భద్రత కల్పించాలి.

## 5. కార్మికవర్గం హక్కులు :

**(i)** కనీసవేతనం నెలకు రూ.18వేలకు తగ్గకుండా చట్టబద్ధం చేసి అమలుచేయాలి. వేతనాన్ని వినిమయ ధరల సూచితో అనుసంధానించాలి. రహస్య బ్యాలెట్ ద్వారా కార్మిక సంఘాల గుర్తింపు జరగాలి. కార్మికులకు సామాజిక భద్రత గ్యారంటీ ఇవ్వాలి. యాజమాన్యంలో కార్మికులకు భాగస్వామ్యం ఉండాలి. ఉద్యోగాల కాంట్రాక్టీకరణకు స్వస్తి చెప్పాలి.

**(ii) రైతాంగం:** వ్యవసాయ ఉత్పత్తులమీద ఉత్పత్తి ఖర్చుతో పాటు మరో 50శాతాన్ని చేర్చి కనీస మద్ధతు ధరగా నిర్ణయించాలి; సన్న, చిన్నకారు రైతుల రుణ విముక్తికి చర్యలు చేపట్టాలి; కేంద్ర ప్రభుత్వం చిన్న, మధ్య తరగతి రైతుల అప్పులను పూర్తిగా రద్దు చేయాలి; వ్యవసాయేతర అవసరాలకోసం బలవంతంగా, విచక్షణా రహితంగా వ్యవసాయ భూమిని తీసుకోవడాన్ని

నిరోధిస్తూ వ్యవసాయ భూములకు రక్షణ కల్పించాలి; కార్పొరేట్ వ్యవసాయాన్ని, ప్రైవేటీకరణను నిషేధించాలి.

**(iii) వ్యవసాయ కార్మికులు :** వ్యవసాయ కార్మికులకు వేతనాలు, సామాజిక భద్రతకల్పిస్తూ కేంద్ర చట్టం తేవాలి. గ్రామీణ కార్మికులకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఇవ్వాలి. ఉపాధి హామీ చట్టాన్ని (ఎంఎన్ఆర్ఇజిఏ)ను విస్తృతపర్చాలి. పటిష్టంగా అమలుపర్చాలి.

**6. ప్రజాసంక్షేమం:** ఆహారధాన్యాలతో పాటు నిత్యావసర సరుకులన్నింటినీ సార్వత్రిక ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేయాలి. అందరికీ పెన్షన్ సౌకర్యం. సీనియర్ సిటిజన్లకు సామాజిక భద్రత, ఆరోగ్య సంరక్షణ, రక్షిత మంచినీరు, పారిశుద్ధ్యం, పట్టణ, గ్రామీణ పేదలకు ఇంటి వసతి. సరసమైన చార్జీలతో కూడిన ప్రజారవాణా వ్యవస్థను విస్తరించడం, పనిచేసే హక్కు, విద్యాహక్కు, ఆరోగ్య హక్కు కల్పించాలి.

**7. స్త్రీ పురుష సమానత్వం:** రాష్ట్ర అసెంబ్లీల్లో పార్లమెంట్‌లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు, బాలలపై మహిళలపై సాగుతున్న అన్ని రకాల హింసను అరికట్టడానికి, నేరస్తులను శిక్షించడానికి తగిన చర్యలు. సమాన పనికి సమానవేతనం. ట్రాన్స్‌జెండర్లకు, లైంగిక మైనారిటీలకు హక్కులు కల్పించాలి.

**8. సామాజిక న్యాయం మరియు పౌర హక్కులు**

**(i) దళితులు:** కులవ్యవస్థను, అన్ని రకాల కుల అణచివేతను నిర్మూలించాలి. అంటరానితనాన్ని పాటించే వారిని, షెడ్యూల్ కులాలపై దౌర్జన్యాలు చేసే వారిని కఠినంగా శిక్షించాలి. రిజర్వుడు పోస్టులను, పదవులను ప్రమోషన్లలోని బ్యాక్ లాగులను భర్తీ చేయాలి. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు అమలుచేయాలి.

**(ii)) బాగా వెనుకబడిన తరగతులు:** విద్యలోనూ, ఉపాధిలోను వీరు అభివృధి చెందేందుకు అవసరమయిన రేజర్వేషన్లను కల్పించే చర్యలు చేపట్టాలి.

**(iii) ఆదివాసీలు:** ఆదివాసీల భూమి హక్కులను కాపాడాలి. వారినుండి తీసుకొన్న భూములను తిరిగి వారికివ్వాలి; అటవీ హక్కుల చట్టాన్ని సంపూర్ణంగా

అమలుచేయాలి; మైనర్ అటవీ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరను ప్రకటించాలి; గిరిజన భాషలను, సంస్కృతిని పరిరక్షించాలి. పెసా చట్టానికి, పంచాయతీలకు షెడ్యూల్డు ప్రాంతాల కొనసాగింపు చట్టం 1996, 5వ, 6వ షెడ్యూళ్లకు రక్షణ కల్పించాలి.

(iv) **మైనారిటీలు:** మైనారిటీలపై సాగే ద్వేషపూరిత నేరాలకు కఠిన శిక్షలు, ముస్లింలకు విద్యా, ఉపాధి, ఆరోగ్యం, సామాజిక సంక్షేమం కల్పించడం కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలి.

(v) **విభిన్న ప్రతిభావంతులు:** సమాన అవకాశాలు కల్పించాలి. ఇతరులతో పోటీపడేందుకు వీలుగా తగిన నిబంధనలు, పబ్లిక్ స్థలాలన్నింటిలోకి ఇబ్బంది లేకుండా వెళ్లే ఏర్పాట్లు చేయాలి. రవాణా, కమ్యూనికేషన్లు, వినోద కార్యక్రమాలు వగైరా ఉండాలి.

(vi) **యువజనుల, బాలుర హక్కులు :** రాజ్యాంగంలో ప్రాథమిక హక్కుగా పని హక్కు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నైపుణ్యాల అభివృద్ధికి శిక్షణ వంటి అంశాల్లో యువజనులకు అవకాశముండాలి. యువజనుల, పిల్లల సర్వతోముఖాభివృద్ధి జరగాలి. అన్ని రకాల బాలకార్మికుల వినియోగంపై నిషేధం ఉండాలి.

**9. విద్య, ఆరోగ్యం, పర్యావరణం :**

(i) ప్రభుత్వ రంగంలో విద్యను విస్తరింపచేయాలి. అందరికీ విద్య ఆచరణ రూపం ధరించేలా విద్యానాణ్యతను మెరుగుపరచాలి. జిడిపిలో ఆరు శాతం నిధులను ప్రభుత్వ విద్యా వ్యవస్థలపై ఖర్చు చేయాలి; లౌకిక విలువలను, శాస్త్రీయ ఆలోచనను పెంచే విధంగా పాఠ్యాంశాలను సవరించాలి. ప్రయివేట్ విద్యా సంస్థల్లోని ఫీజులను, పాఠ్యాంశాలను నియంత్రించాలి.

(ii) ప్రజలందరికీ ఉచిత వైద్యం అందేలా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నిధులతో జాతీయ ఆరోగ్య వ్యవస్థను రూపొందించాలి. ఇందుకోసం ఆరోగ్యరంగంపై ప్రభుత్వఖర్చును జిడిపిలో కనీసం ఐదు శాతానికి పెంచాలి. ప్రయివేట్ వైద్యఆరోగ్య సంస్థలను అదుపు చేయాలి. అత్యవసర మందుల ధరలు తగ్గించాలి.

(iii) సమర్థ నియంత్రణ ద్వారా విషవాయువుల విడుదలను తగ్గించాలి. ఉత్పత్తి, వినియోగ రంగాలన్నింటిలో ఇంధన వినియోగ సామర్థ్యాన్ని పెంచాలి. సాంప్రదాయేతర ఇంధనాన్ని ప్రోత్సహించాలి. ఇంధన అందుబాటులో ఉన్న అసమానతలను తగ్గించాలి. నదుల్లో, సముద్రం ఇతర నీటివనరుల్లో ముఖ్యంగా అడవులు, మడఅడవులలో కాలుష్యాన్ని తగ్గించాలి.

**10. సంస్కృతి, మీడియా :**

మతోన్మాద, చాందసవాద, తిరోగామి భావాలను ఎదుర్కొనే లౌకిక, బహుళ సంస్కృతి అభివృద్ధి పరచాలి. జానపద కళల, సాంప్రదాయాల సంరక్షణ, అన్ని జాతీయ భాషలన్నింటినీ సమాన హోదా కల్పించాలి. ఉర్దూను ప్రోత్సహించి కొన్ని రాష్ట్రాలలో రెండో భాషగా గుర్తించాలి.

ప్రభుత్వ రంగంలో ప్రసార సంస్థలను పటిష్టపర్చాలి. మీడియాల్లో విదేశీ, గుత్త పెట్టుబడులను నిషేధించాలి. మీడియా నియంత్రణకు స్వతంత్ర నియంత్రణా సంస్థను ఏర్పాటుచేయాలి.

**11. విదేశాంగ విధానం :**

అమెరికాతో వ్యూహాత్మక ఒప్పందం నుండి వెనక్కురావాలి. సామ్రాజ్యవాద వ్యతిరేక, స్వతంత్ర విదేశాంగ విధానం చేపట్టాలి.

## రాజకీయ పంథా

**2.116**

(i) హిందూత్వ మతోన్మాద శక్తులను ఒంటరి చేయడానికి దాని ప్రజావ్యతిరేక ఆర్థిక విధానాలను తిప్పికొట్టడానికి బిజెపి ప్రభుత్వాన్ని ఓడించడం తప్పనిసరని మోడీ పాలనలోని దాదాపు నాలుగేళ్ల అనుభవం చెప్తోంది.

(ii) కనుక బిజెపిని దాని మిత్రులను ఓడించడానికి లౌకిక, ప్రజాస్వామ్య శక్తులను సమీకరించటం ప్రధాన రాజకీయ కర్తవ్యంగా వుండాలి.

(iii) కాని ఇది కాంగ్రెస్ పార్టీతో రాజకీయ పొత్తు లేకుండా చేయాలి.

(iv) అయితే పార్లమెంటులో కాంగ్రెసుతోసహా అన్ని లౌకిక ప్రతిపక్ష పార్టీలతోనూ

అంగీకారమయిన సమస్యలపై అవగాహనా ఉండవచ్చు. పార్లమెంట్ బయట లౌకిక ప్రతిపక్ష శక్తులతో మతతత్వానికి వ్యతిరేకంగా ప్రజలను సమీకరించే విషయంలోమనం సహకరించాలి. కాంగ్రెస్, ఇతర బూర్జువా పార్టీల ప్రజాసంఘాలవెనక ఉన్న ప్రజాబాహుళ్యాన్ని మనవైపు తిప్పుకునేందుకు వర్గ ప్రజా సంఘాల ఉమ్మడి కార్యాచరణను మనం పెంపొందించాలి.

(v) కేంద్రంలో బిజెపి ప్రభుత్వం, ప్రాంతీయ పార్టీల నాయకత్వం నడుస్తున్న ప్రభుత్వాలతో సహ పలురాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా పార్టీ పోరాడుతుంది. ప్రజల జీవనానికి సంబంధించిన అంశాలపైన, ఆర్థిక విధానాల దాడికి వ్యతిరేకంగాను ఐక్య మరియు నిరంతరం పోరాటాలను చేపడుతుంది.

(vi) ప్రజా ఉద్యమాల కోసం, అన్ని స్థాయిల్లో ఐక్య పోరాటాల కోసం ఉమ్మడి వేదికలను నిర్మించాలి. ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రతిఘటనను ఉధృతం చేయాలి. వర్గసంఘాల, ప్రజాసంఘాల ఐక్య కార్యాచరణ అన్నది బూర్జువా పార్టీల వెనుకనున్న ప్రజా సమూహాలను మనవైపుకు తెచ్చేదిగా ఉండాలి.

(vii) ప్రభుత్వం లోపల, బయట ఉన్న హిందుత్వ శక్తుల సవాలు తీవ్రతను దృష్టిలో ఉంచుకొని లౌకిక ప్రజాతంత్ర శక్తుల యొక్క విశాల సమీకరణ కోసం వేదికలు నిర్మించడం నేడు అత్యవసరం. అట్టడుగు స్థాయిలో కూడా మతతత్వ శక్తులపై పోరాటానికి, ప్రజల ఐక్యతకు ప్రాధాన్యత నివ్వాలి. వీటిని రాజకీయ పొత్తులుగా గాని, ఎన్నికల పొత్తులుగాగాని చూడరాదు. అలాగే ప్రజాతంత్ర హక్కులపై జరుగుతున్న నిరంకుశ దాడులకు వ్యతిరేకంగా కూడా విశాల ఐక్యతను సాధించాలి.

(viii) పార్టీయొక్క స్వతంత్ర బలాన్ని పెంపొందించుకోవడానికి, నిర్మించుకోవడానికి పార్టీ ప్రాధాన్యత నిస్తుంది. వామపక్ష ఐక్యతను విస్తృతపరచడానికి, పటిష్టపర్చడానికి పార్టీ కృషి చేస్తుంది.

(ix) వామపక్ష ప్రజాతంత్ర శక్తులు ఐక్య పోరాటాలు చేయడానికి ఉమ్మడి ఉద్యమాలు నిర్మించడానికి ఒక నిర్థిష్ట కార్యక్రమంపై

సమీకరింపబడాలి. ఆవిధంగానే వామపక్ష ప్రజాతంత్ర సంఘటన రూపొందగలదు. రాష్ట్రాల స్థాయిలో వివిధ వామపక్ష ప్రజాతంత్ర శక్తులను ఒక నిర్దిష్ట కార్యక్రమం ఆధారంగా సమీకరించి ఐక్యవేదికలను నిర్మించాలి. జాతీయ స్థాయిలో మన రాజకీయ ఆందోళనల్లో వామపక్ష ప్రజాతంత్ర ప్రత్యామ్నాయాన్ని ముందుకు తెచ్చి వామపక్ష ప్రజాతంత్ర సంఘటనలో చేరదగిన శక్తులను సమీకరించాలి.

**(x)** పైన పేర్కొన్న మనపార్టీ రాజకీయ విధాన పరిధిలో బిజెపి వ్యతిరేక ఓట్లను వీలైనంత ఎక్కువగా ఒక దగ్గరకు చేర్చడానికి తగిన ఎన్నికల ఎత్తుగడలను అనుసరించాలి.

## ప్రస్తుత పరిస్థితుల్లో కర్తవ్యాలు

**2.117**

**(1)** మోడీ ప్రభుత్వ ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాన్ని ఉధృతం చేయాలి. నయా ఉదారవాద విధానాల వల్ల దోపిడీకి గురవుతున్న అన్ని తరగతుల శ్రామికులను సమీకరించి వారిని నిర్మాణయుతం చేసి పోరాటం నిర్వహించాలి. ఉద్యోగం, భూమి, ఆహారం, వేతనాలు, బతుకుదెరువు కోసం సద్యోజనిత పోరాటాల్లోనూ పార్టీ జోక్యం చేసుకొని వాటిని కూడా అభివృద్ధి చేసి ముందుకు తీసుకెళ్లాలి.

**(2)** పార్టీ, ప్రజాసంఘాలు హిందూత్వ మతోన్మాదంపై పోరాటంలో ముందుపీఠిన ఉండాలి. సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, సైద్ధాంతిక రంగాల్లో ఈ పోరాటం నడపాలి. మతోన్మాద శక్తుల కార్యకలాపాలను తిప్పికొట్టేందుకు లౌకిక ప్రజాతంత్ర శక్తులతో విస్తృత వేదికలను నిర్మించాలి.

**(3)** సామాజికంగా అణగారిన తరగతుల ప్రయోజనాలను పరిరక్షించడానికి పార్టీ మరింత కృషి చేయాలి. పార్టీ మహిళా హక్కుల కోసం, అలాగే వారిపై పెరుగుతున్న హింసాకాండకు వ్యతిరేకంగా పోరాడాలి. వామపక్ష, దళిత ఉమ్మడి వేదికలను దళితుల హక్కులను రక్షించడానికి ముందుకు తీసుకెళ్లాలి. అన్ని రంగాల్లో పార్టీ ఆదివాసీల హక్కుల రక్షణకై నిలవాలి. మైనారిటీల హక్కుల రక్షణకు విస్తృతం ఐక్యతను నిర్మించాలి.

(4) అమెరికాతో వ్యూహాత్మక భాగస్వామ్యం వల్ల సామ్రాజ్యవాదుల పట్టు పెరుగుతోంది. దేశ సార్వభౌమత్వానికి ప్రమాదం ఏర్పడుతోంది. వీటికి వ్యతిరేకంగా ప్రజలను సమీకరించడానికి ప్రచారాందోళనలను విస్తృతపరచాలి. అమెరికా సామ్రాజ్యవాదం ముందు లొంగిపోయిన బిజెపి తన నిజరూపాన్ని కప్పిపెట్టుకోవడానికి తానే ఒక పెద్ద జాతీయవాదిగా పోజు పెడ్తోంది. దాని బండారాన్ని బైటపెట్టాలి.

(5) పెరుగుతున్న నియంతృత్వ ఫాసిస్టు దాడులను తిప్పికొట్టడానికి విస్తృత శక్తులను పార్టీ సమీకరించాలి. ప్రజాస్వామ్యం పైన, కళాకారుల స్వేచ్ఛ పైన, విద్యారంగ స్వయంప్రతిపత్తిపైన జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా విశాల సమీకరణ చేయాలి.

(6) వర్గ ప్రజా పోరాటాల ద్వారా తన స్వతంత్ర పాత్రను, బలపర్చుకోవడానికి పలుకుబడిని విస్తృతపర్చుకోవడానికి పార్టీ అత్యంత ప్రాధాన్యత నివ్వాలి. పశ్చిమబెంగాల్‌లో ప్రజాస్వామ్యంపై, పార్టీపై, వామపక్షాలపై సాగుతున్న దాడులకు వ్యతిరేకంగా జరిగే పోరాటాల మీద పార్టీ ప్రత్యేకంగా దృష్టి సారించాలి. వామపక్షాల నాయకత్వంలోని కేరళ ప్రభుత్వాన్ని రక్షించుకోవడం మన ముఖ్య కర్తవ్యం.

(7) ప్రస్తుత లోపాలను అధిగమించి వామపక్ష వేదిక ఆధారంగా ఐక్య కార్యక్రమాలకు, ఉమ్మడి ప్రచారోద్యమాలకు ప్రాధాన్యతనిస్తూ వామపక్ష ఐక్యతను బలోపేతం చేయాలి. దీని ప్రాతిపదికన, ఒక వామపక్ష, ప్రజాతంత్ర కార్యక్రమం చుట్టూ ఇతర ప్రజాతంత్ర సంస్థలను, శక్తులను సమీకరించాలి. అట్టి కార్యక్రమం ప్రాతిపదికగా నిర్మించే ఉద్యమాల నుండి, పోరాటాలనుండి ఒక నిజమైన ప్రత్యామ్నాయం–వామపక్ష, ప్రజాతంత్ర ప్రత్యామ్నాయం ఆవిర్భవిస్తుంది.

## బలమైన కమ్యూనిస్టు పార్టీని నిర్మించాలి

**2.118** ఈ లక్ష్యాన్ని సాధించడానికి దేశవ్యాప్తంగా కమ్యూనిస్టు పార్టీని బలంగా నిర్మించాలి. మార్క్సిజం లెనినిజం సిద్ధాంతంపై ఆధారపడి కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాల కనుగుణంగా పార్టీని నిర్మించాలి. ప్రజాపునాది

గల ఒక బలమైన దేశవ్యాప్త కమ్యూనిస్టు పార్టీని నిర్మించాలంటే కోల్‌కతా ప్లీనం నిర్ధారించిన కర్తవ్యాలపై దృష్టి పెట్టాలి.

1. పార్టీ పలుకుబడిని విస్తృతపరచుకోవడానికి వామపక్ష ప్రజాతంత్ర శక్తులను సమీకరించడానికి ఆర్థిక సామాజిక అంశాలపై వర్గ పోరాటాలను, ప్రజా పోరాటాలను నిర్మించాలి.
2. ప్రజాపంథాను అమలుచేసి ప్రజలతో సజీవ సంబంధాలను నెలకొల్పాలి.
3. ఒక విప్లవ పార్టీ నిర్మాణం కోసం నాణ్యతకల సభ్యత్వంతో నిర్మాణాన్ని చక్కదిద్దాలి.
4. పార్టీలోకి యువతను ఆకర్షించడానికి ప్రత్యేక కృషి చేయాలి.
5. మతోన్మాదం, నయా ఉదారవాదం, తిరోగమన వాదాలకు వ్యతిరేకంగా సైద్ధాంతిక పోరాటం చేయాలి.

## మనం చేయాల్సినవి

**2.118**

* బిజెపి నియంతృత్వ మతోన్మాద పాలనను ఓడించడానికి పోరాటం.
* ప్రజాస్వామ్యం, సెక్యులరిజం, సామాజిక న్యాయం సోషలిజంలను ముందుకు తీసుకెళ్లడానికి బలమైన సి.పి.ఐ(ఎం) నిర్మాణం.
* వామపక్ష ప్రజాతంత్ర ప్రత్యామ్నాయం కోసం బలమైన వామపక్ష, ప్రజాతంత్ర ఫ్రంటు నిర్మించాలి.

***

ప్రతులు : 1000
ప్రచురణ కాలం : మే, 2018
వెల : ₹ 20/-

135259

ప్రచురణ

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), ఆంధ్రప్రదేశ్ కమిటీ

27-13-3, గవర్నర్‌పేట, విజయవాడ - 2,

ఫోన్ నెం. 0866 2577202, 9490098042